
మా ఉత్తరభారత యాత్రలు



అయితరాజు రాంరావు

మా ఉత్తర భారత యాత్రలు

అయితరాజు రాంరావు

ప్రచురణ:

నేషనల్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్

హైదరాబాదు.

MAA UTTHARA BHARATHA YATHRALU

(Telugu)

By Aitharaju Ram Rao

Supervision M s. Prema Malini (NIS)
Cover Design : Ganesh
Printed at :
Manorupa Art Printers, Hyderabad. 557398

Copies : 1,000
Price : Rs. 25/-

Published by :
National Information Services,
Nalanda Complex, Amruta Estates,
Somajiguda, Hyderabad - 500 482.

December, 1993



మా స్వగ్రామం
ఖమ్మం జిల్లా వల్లభిలో
వెలసివున్న

శ్రీ వేణు గోపాలస్వామి వారికి

భక్తి ప్రపత్తులతో

అంకితం

- అయితరాజు రాంరావు



భార్యతో రచయిత

అయితరాజు రాంరావు, శ్రీమతి రాధ



మా స్వగ్రామం
ఖమ్మం జిల్లా వల్లభిలో
వెలసివున్న

శ్రీ వేణు గోపాలస్వామి వారికి

భక్తి ప్రపత్తులతో

అంకితం

- అయితరాజు రాంరావు



భార్యతో రచయిత
అయితరాజు రాంరావు, శ్రీమతి రాధ

పరిచయం

సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, మా పెద్ద బావగారు శ్రీ అయితరాజు రాంరావుగారు, మా అక్కగారు, మ.ల.స. రాధాదేవిగారు ఉత్తర భారత యాత్రలు చేసి వచ్చిన సందర్భంలో తమ యాత్రానుభవాలను ఏ రోజు కారోజు వ్రాస్తూ వచ్చారు. ప్రచురించాలన్న దృష్టితో ఆయన దీనిని రచించక పోయినా, పుస్తక రూపంలో తీసుకొని రాతగ్గ రచనగా మా అందరికీ తోచింది.

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీ వి. చంద్రమౌళి, ఐ.ఏ.యస్, డాక్టర్ ఎ.పి. రంగారావు, శ్రీ జ్వాలా నరసింహారావు ప్రభృతుల పూనిక వల్ల ఈ పుస్తకం యీనాటికి వెలుగు చూస్తోంది. ఇందుకు కారణ భూతులైన వారందర్నీ అభినందిస్తున్నాను.

రచయిత ఆయా ప్రదేశాలను కనులకు కట్టినట్లు వర్ణించారు. భాష సరళంగా, సహజంగా సుబోధకంగా వుంది. అక్కడక్కడ రచయితకు కల్గిన అనుభవాలను ఆయన వివరించిన తీరు పాఠకులను కదిలించేట్లుగా వుంది.

యాత్రలు చేసినవారికి తమ యాత్రానుభవాలను మరోసారి మననం చేసికోడానికి, యాత్రలు చేయనుద్దేశిస్తున్న వారికి దర్శనీయ స్థలాలను గురించి తెలుసుకోడానికి, యాత్రలు చేయాలనె ఆసక్తి వుండీ కారణాంతరాల వలన పొసగని వారికి యాత్రా విశేషాలు చదివి ఆనందించటానికి ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉండగలదు.

ప్రశంసనీయమైన విధంగా తమ యాత్రానుభవాలను గ్రంథస్థం చేసిన రచయితను, పుస్తకాన్ని సర్వాంగ సుందరంగా, ఎంతో ముచ్చటగా రూపొందించిన కుమారి ప్రేమమాలినిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఈ పుస్తకం పాఠకుల ఆదరాభిమానాల నందుకోగలదని విశ్వసిస్తున్నాను

- భండారు పర్వతాల రావు.

ప్రకాశకుల మనవి

ఉత్తర భారత యాత్రలు చేసే సందర్భంలో శ్రీ అయితరాజు రాంరావుగారు తమ యాత్రాను భవాలను బంధు మిత్రులకు వివరెంచేందుకై రాసుకున్నారు. నిజానికి, ఒక పుస్తకరచన చేయాలని ఆయన ఉద్దేశించక పోయినా వారు రాస్తూ వచ్చినదంతా చక్కటి యాత్రా గ్రంథంగా రూపుదిద్దుకోడం విశేషం. ఇందులో వారుపయోగించిన వాడుక భాషను సహజంగా వుంటుదన్న అభిప్రాయంతో అలాగే వుంచటం జరిగింది.

ఉత్తర భారత యాత్రలు చేసిన వారు తాము చూచి వచ్చిన ప్రదేశాలను గురించి మరోసారి చదువుకోటానికి, యాత్రలు చేయదలచినవారు తాము చూడ దలచిన ప్రదేశాలను గురించి ముందుగా కొంత తెలుసుకోడానికి, యాత్రలు చేద్దామనే ఆసక్తి వుండి కూడా, అది కారణాంతరాల వలన పొసగని వారు యాత్రా విశేషాలు చదువుకొని ఆనందించటానికి ఈ పుస్తకం బాగా వుపయోగ పడుతుందని మా విశ్వాసం. ఈ ప్రచురణకు తోడ్పడిన శ్రీ వి. చంద్రమౌళి, ఐ.ఎ.యస్ గారికి, ప్రకటనలిచ్చి ధనసహాయం చేసిన కంపెనీల వారికి, పర్యవేక్షించిన శ్రీ జ్వాలానరసింహారావు గారికి, చిత్తుకాపీ నుండి క్రోడీకరించిన శ్రీమతి అయితరాజు కరుణగారికి పరిచయ వాక్యాలు రాసిన శ్రీభండారు పర్వతాలరావు గారికి నాకృతజ్ఞతలు. ముచ్చటైన ముఖపత్రాన్ని రూపొందించిన యువకళాకారుడు శ్రీగణేష్‌ని, మరియు అన్ని విషయాలు చూచుకున్న నేషనల్ ఇన్‌ఫర్‌మేషన్ సర్వీసెస్, అడ్వర్టైజింగ్ విభాగం డైరెక్టర్ కుమారి ప్రేమమాలినిని అభినందిస్తున్నాను. ఆలస్యం లేకుండ అందించిన ముద్రాపకులు మనోరూప ప్రింటర్స్ వారికి మాకృతజ్ఞతలు.

మా యీ ప్రయత్నాన్ని పాఠకులాదరించగలరని ఆశస్తూ -

జె. హరినారాయణ ఐ.ఎ.ఎస్,
నేషనల్ ఇన్‌ఫర్ మేషన్ సర్వీసెస్
హైదరాబాద్.

శుభమస్తు

సమస్త దేవి దేవతాభ్యోనమః

మాతృభ్యోనమః!

పితృభ్యోనమః!

గురుభ్యోనమః!

మా ఉత్తర భారత యాత్రలు

(14-4-1978 నుంచి **18-6-78**వరకు)

అయితరాజు రాంరావు

సైర్‌కర్ దునియాకి గాఫిల్ జింద్‌గాని ఫిర్ కహాఁ
జిందగీగర్ కుఛ్ రహీతో నౌజవాని ఫిర్‌కహాఁ
ఓ మూఢా ! ఇప్పుడే ప్రపంచమంతా తిరిగి చూడు
నీ మరణకాలం సమీపించుచున్నది
నీవు కొంతకాలం జీవించియున్నా అప్పటికి నీలో
జవసత్వాలు ఉండవు.

కృతజ్ఞతలు

శ్రీ నారాయణ రావు గారి యాత్ర స్పెషల్‌లో ఉత్తరదేశ యాత్ర సలిపి అనేక పుణ్య క్షేత్రాలు, నదులు, పట్టణాలు, ప్రకృతి సౌందర్యం అంతా కనులార చూచి ఆనందించి తరించాం.

మొదలు నా సతీమణి శ్రీ|ల|రాధ నాలో యాత్ర ప్రేరణ కలిగించి యాత్రలలో నాతో అన్నివిధముల సహకరించినందులకు నాశుభాశీస్సులు తెలుపుచున్నాను.

గాయత్రీ యాత్రా స్పెషల్ Train వేసి సుమారు 100 మంది యాత్రికులుకు అన్ని వసతులు కలిపించి చక్కని రుచికరభోజనం, ప్రయాణం చేస్తున్నా, వేళకు భోజనము పెట్టుతూ మమ్ముల మొదలు యిచ్చిన ప్రోగ్రామ్ ప్రకారం అన్ని దర్శింపచేసి, క్షేమంగా మమ్ముల ఇల్లు చేర్చి మమ్ముల తరింపచేసిన శ్రీనారాయణరావు గార్కి మాకృతజ్ఞతా సుమాంజలులు.

యాత్రలో అనేక మంది తెలిసినవారు, అనేక మంది తెలియనివారు వున్నారు. వారందరు మాతో అన్నివిధముల సహకరించినందులకు మా అభివందనములు తెలుపుచున్నాము.

మా యాత్రికులలో ముఖ్యులు శ్రీహరి వెంకట్రామయ్య (నా Class mate) వారి సతీమణి మాతో సహకరిస్తూ మాకు చేదోడువాదోడ్లుగా వుంటూ వున్న ఆ పుణ్య దంపతులకు నా అభివందనములు తెలుపుచున్నాను.

మాతోటి యాత్రీకులలో ముఖ్యులైన నారాజకీయ మిత్రుని సతీమణి శ్రీమతి సరస్వతి మాయిద్దరు పెద్ద వాండ్లను పితృమాతృ గౌరవంతో కంటికి రెప్ప మాదిరి మాతోడునీడగా మమ్ములకనిపెట్టుతూ మమ్ముల క్షేమంగా యిల్లుచేరేవర్కు చూచుకున్నందులుకు వారికి కృతజ్ఞతలుతెలుపుతూ ఈశ్వరుడు వారికి వారి కుటుంబసభ్యులకు అన్ని విధముల తోడ్పడవలెనని ప్రార్థించుచున్నాము. మరియు మాతో ప్రయాణం చేసిన హిందీ టీచరు గారికి, పసుమర్తి వెంకటలక్ష్మయ్య గార్కి, వారి సతీమణికి, మర్ల జానకిరామయ్య గార్కి, వారి సతీమణికి మరియు మర్ల

సూర్యనారాయణగారికి, మాతో ప్రయాణంచేసిన యితర యాత్రికుల్కు, యాత్రాస్పెషల్ బృందంలో వంట చేసిన మరియు తదితర మనుష్యులందరికి మాధన్యవాదములు తెలుపుచున్నాము.

అన్నిటి కంటే ముఖ్యంగా మాగ్రామహైస్కూలు తెలుగు టీచరు గారు శ్రీమాన్ మంక నరశింహాచార్యులు గార్కి ఈ పుస్తకము వ్రాయుటలో నాకు ఎంతో తోడ్పడినందుల్కు కృతజ్ఞతలు తెలుపుచున్నాను. వారికివే నాకృతజ్ఞతాపూర్వక కుసుమాంజలులు అర్పించుచున్నాము.

— అయితరాజు రాంరావు

తొలిపలుకు

నా సతీమణికి తీర్థయాత్రలు సేవించుదామనే అభిలాష చిన్నప్పటి నుండి వుంది. ఆమె నన్ను ఎన్నాళ్లనుండో "మనం తీర్థ యాత్రలు వెళ్లదామని" ప్రోత్సహిస్తూవచ్చింది. నేను అనేక వ్యాపకాలవల్ల చూదాంలే ,వెళ్లదాంలే అంటూ వచ్చాను.

క్రిందటి సంవత్సరం మాచివరి అమ్మాయి వివాహం జరిగినప్పటినుంచి మాకు కొంత తీరిక అనిపించింది. అప్పటి నుండి ఆమెప్రోత్సాహం ద్విగుణీ కృతమైంది. ఆమె ప్రోత్సాహానికి మావియ్యపురాలు శ్రీమతి జూపూడి వరలక్ష్మమ్మగారి మద్దతు కూడ తోడైంది. అప్పుడప్పుడూ మాకుటుంబంలో ఈ ప్రస్తావన వచ్చినపుడల్లా మా కుటుంబ సభ్యులంతా ఆమోదముద్రవేస్తూ వచ్చారు. ఇందరి ప్రోత్సాహంతో నాలోకూడ యాత్రాభిలాష బాగా అంకురించింది.

మా అదృష్టవశాత్తు ఉభయులము ఒక రోజు యాత్రావిశేషాలు తెలుసుకుందామని "గాయత్రి యాత్రాస్పెషల్" మేనేజరు శ్రీ నారాయణ రావుగారి యింటికి వెళ్లాం. వారొక కరపత్రం యిచ్చారు. ఆ కరపత్రం చదివి వారితో అన్ని విషయాలు చర్చించి తెలుసుకున్నాం. ఈ యాత్రలో ముఖ్యంగా నేపాల్, పంచద్వారకలు, కాశ్మీరు, పండరీపురం, బదరీ మరియు కేదార్ లాంటి ముఖ్యక్షేత్రాలు వుండటం వల్ల మమ్ములను బాగా ఆకర్షించింది.

నా బాల్యమిత్రులు శ్రీ హరి వెంకటరామయ్య, శ్రీ మర్ల సూర్యనారాయణ, శ్రీ మర్ల జానకిరామయ్య మరియు నా రాజకీయ సహచరులు శ్రీ పసుమర్తి వెంకట లక్ష్మయ్యగార్లు కూడ యిదేయాత్రరైలులో ప్రయాణం సాగించబోతున్నారని తెలుసుకొని చాల సంతోషించాను. వారి సాహచర్యం మాప్రోత్సాహాన్ని యినుమడింపజేసింది. మా సతీమణి ఆనందానికి అంతులేకుండా పోయింది. అప్పటికప్పుడే నాతో గట్టిగా వాగ్దానం తీసుకుంది. ఇలామొదలైంది మా ఉత్తరదేశ యాత్రాప్రయాణం.

నారాయణరావుగారు మాకు యిచ్చిన కరపత్రంలో ఈ ముఖ్యవిషయములు వివరముగా వ్రాసి యున్నవి: " యాత్రారైలు ఖమ్మం రైల్వేస్టేషను నుండి చైత్ర శుద్ధ సప్తమి 14-4-78 శుక్రవారం రోజు ఉదయం 11-30 గం॥కు బయలుదేరుతుంది. 65రోజులు యాత్రా ప్రయాణం - మంచి భోజన సదుపాయములతో టిక్కెట్టు వెల రు 1150/- బస్‌చార్జీలు, రిక్షా చార్జీలు యాత్రికులే భరించవలయును."

ప్రతి యాత్రికుడు రు.250/- అడ్వాన్సుగా చెల్లించి టిక్కెట్టు రిజర్వు చేయించుకోవలయును. రైలులో బ్యాంకు సౌకర్యములు కూడకలవు. అప్పుడే మేము యాత్రలు వెళ్లుటకు నిర్ణయించుకున్నాం.

అప్పటికి మాప్రయాణము పదిహేనురోజులు మాత్రమే వున్నది - ఇంటికి వచ్చి మరొకసారి దృఢసంకల్పం చేసుకున్నాం - మా పిల్లలకు బంధుమిత్రులకు ఉత్తరాలు వ్రాయడం ప్రారంభించాము. తెల్లవారి టిక్కెట్టుకు అడ్వాన్సు డబ్బు చెల్లించాం. ప్రయాణసన్నాహాలు చురుకుగా సాగించాం. వెంటనే వల్లభి వెళ్లాం. 10-4-78 వరకు వల్లభిలో పనులు అన్ని చూచుకొని సుమారు10,000ల రూ॥పైకం సిద్ధం చేసుకుని 11-4-78 వరకు ఖమ్మం వచ్చాం.ఆరోజునుంచి మా పిల్లలు, బంధు మిత్రులు రాసాగారు. ప్రయాణపు గడియలు దగ్గరకువస్తూవున్నకొద్ది వచ్చిపోయే బంధు మిత్రులతో మాయిల్లు కళకళలాడి పోతున్నది. ఆడపిల్లలు, అల్లుళ్ళు, మగపిల్లలు, కోడళ్లు, మనుమలు, మనుమరాండ్రు రావలసిన వారంతా వచ్చారు. మాకు దాచుకొందామన్నా దాగని పరవశం - ఆనందాబ్ధిలో మునిగి తేలుతున్నాం. వల్లభివ్యవహారాలు, వ్యవసాయం అన్నీ నా మిత్రుడు కొడాలి వెంకయ్యకు అప్పగించాం. నా పెద్ద కుమారుని మధ్యమధ్య వల్లభివెళ్లి నిగరాని చేస్తూ వుండమని చెప్పాం. వ్యవసాయానికి కావలసిన Fertilizers జూపూడి నరసింహారావుగారి కొట్లో వెంకయ్యవుత్తరం వ్రాస్తే యివ్వమనిచెప్పాం.

-యాత్రా ప్రయాణ ప్రారంభం-

14-4-78 ఖమ్మంనుండి ప్రయాణం.ప్రయాణ శుభముహూర్తం చాల దగ్గరలోకి వచ్చింది. ఇతర ప్రాంతాల యాత్రీకులంతా ఖమ్మం చేరుకున్నారు. అందరికి శిరం వారి సత్రంలో బసేర్పాటు చేసారు. అందరూ భోజనకార్యక్రమాలు పూర్తి చేసుకుని 10-30 గంllల వరకు ప్రయాణానికి సన్నాహమయినారు. సరిగా 11గంllలకు యాత్రికులందరూ ఊరేగింపుగా రైల్వేస్టేషనుకు బయలుదేరినారు. మంగళవాయిద్యాలు, వేదఘోష, జైజై ధ్వానాలు మిన్ను ముట్టాయి. భగవన్నామ సంకీర్తనలతో ఊరేగింపు సాగిపోతున్నది. దారిపొడవునా మా ఉత్సాహానికి ప్రోత్సాహంగా అందరు వీడ్కోలు పలికేవారే. ఇదేమి విడ్డూరమో అని చూచి తెలుసుకొని సంతోషపడి వీడ్కోలు చెప్పేవారు కొందరు, తాము యాత్రలు చేయలేక పోయినా యాత్రికులకు వీడ్కోలు చెప్పి సాగనంపి కొద్దోగొప్పో యాత్రా ఫలితాన్ని సంపాదించు కొందామనుకొన్నవారు కొందరు మొత్తంమీద అశేషప్రజానీకంతో మాఊరేగింపు సుమారు 11-30గంటలకు స్టేషన్ చేరుకుంది. పచ్చని మామిడితోరణాలతో, రంగురంగుల దైవచిత్రాలతో అక్కడ ఆగివున్న రెండు రైలు డబ్బాలు మమ్ములను చేతులు జాచి ఆహ్వానిస్తున్నట్లు అనిపించింది.

ఆనాడురైలుస్టేషనంతా మాయాత్రీకులతోను మాకు వీడ్కోలు యివ్వటానికి వచ్చిన బంధుమిత్రులతోను కిటకిటలాడిపోయింది. మేమందరం మాకు నిర్దేశింపబడిన సీట్లలో మా సామానులు భద్రపరచి రైలుకోసం ఎదురు చూస్తూ బంధుమిత్రులతో కబుర్లు చెప్పుకుంటూ వున్నాము.యాత్రలలో తమ పూర్వానుభవాలు చెప్పుతూ వున్నారు కొందరు. యాత్రల మెలకువలన్ని బోధిస్తున్నారు, కొందరు. ఫలానా ఫలానా వస్తువులు తెచ్చిపెట్టుమని ఫర్మాయిస్తున్నారు మరికొందరు. ఇలా ఎవరికి వారు ప్రయాణముహూర్తాన్ని నిరీక్షిస్తూ కబుర్లు చెప్పుకుంటూ వున్నాము. ఆరోజు ఎండ తీవ్రంగావున్నప్పటికి మాబంధు మిత్రులు అంతా రైలు వచ్చేవరకు ఓపికతో మాతోనే వున్నారు. ఎట్లాగైతేనేం మా రైలు తన సహజమైన రెండు గంటల ఆలస్యంతో వచ్చింది. మా యాత్రీకులందరు జయజయధ్వనుల మధ్యరైలు డబ్బాలలో ప్రవేశించారు. ఎవరి

బంధుమిత్రులు వారి వారికి వీడ్కోలు పలికారు. రైలు కూత వేసింది. యాత్రికులు, బైటవారు చేతులూపటంతో రైలు బయలుదేరి రెప్పపాటులో ప్లాటుఫారం దాటింది. యాత్రికులందరు ఎవరెవరి సీట్లమీద వారు అసీనులై స్తిమితపడ్డారు. కొద్దిక్షణాలలోనే అందరూ పాత వాతావరణం నుంచి కొత్త వాతావరణంలోనికి మారిపోయారు. మా రైలు సుమారు ఒక గంటలోమధిర స్టేషన్ చేరుకుంది. మా అక్కగారు మా అన్నగారు మరియు మావదినె గారు మడుపల్లె నుండి మండుటెండలో వచ్చి మా రైలు కొరకు నిరీక్షిస్తున్నారు. రైలు ప్లాటుఫారం మీద ఆగగానే మేము ఉభయులమూ రైలు దిగాం. మేము వారితో కలిసి మాట్లాడి వారికి పాదాభివందనాలు చేసి ఆశీర్వచనాలు పొందాం. రైలు కేక వేసింది. మేము డబ్బాలలోకి ఎక్కాం. మా రైలు విజయవాడ సుమారు 6గంటల వరకు చేరుకుంది. రైలు ఆగటం తోనే నేను రైలుదిగి మాకు తెల్సిన వారెవరైనా వచ్చారేమోనని చూస్తూన్నాం. ఇంతలో మా తోడల్లుడు శ్రీ తుర్లపాటి హనుమంతరావుగారు, మా మరదలు సరస్వతి మేమున్నరైలు డబ్బా వద్దకు మాకొరకు వెతుకుతూ వచ్చారు. మేమంతా కలిసి రెండుగంటల సేపు ప్లాటు ఫారం మీద కబుర్లు చెప్పుకున్నాం. హనుమంతరావు గారు మాకు బనారస్ లాంటిప్రదేశాలలోతమ అనుభవాలు, చూడ తగినముఖ్య ప్రదేశాల గురించి వివరంగా చెప్పారు. మేము అక్కడనే ఆరాత్రి భోజనం ముగించుకున్నాం. మారైలు అన్నవరంకు తెల్లవారి ఉదయం 9గంIIల ప్రాంతంలో చేరుకుంది.

అన్నవరం 15-4-78

చేరవలసిన టైముకు (సమయానికి) రెండు గంII ఆలస్యంగా చేరింది మా రైలు తునిస్టేషన్‌కు, అన్నవరంలో రైలు డబ్బాలు ఆగటానికి యార్డులేనందున మా డబ్బాలు తునిలో ఆపవలసి వచ్చింది. తుని లేత తమలపాకులకు ప్రసిద్ధిచెందిన పట్టణం. తునిపట్టణం నుండి అన్నవరం ఆరు మైళ్లు. బస్‌లలో తుని నుండి అన్నవరం చేరుకున్నాం.

శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంతో ప్రసిద్ధమైన గ్రామం అన్నవరం - భారత స్వాతంత్ర్య విప్లవ యోధుడు శ్రీ అల్లూరి

సీతారామరాజును ప్రప్రథమంగా సన్మానించిన గౌరవం పొందినటు వంటి గ్రామం అన్నవరం.

యాత్రికులందరం పవిత్ర పంపానదిలో స్నానాలుచేసి బస్‌లలో యెక్కి కొండపైకి వెళ్లాం. దేవాలయసమీపములోనే బస్‌లు ఆగుతాయి. క్రిందనుంచి పైవరకు అంతా ఘాట్ రోడ్డు. ఈరోడ్డు సుమారు 3,4 కిలో మీటర్లు వుంటుంది. 2,3 సత్రాలు ఉండటానికి యోగ్యంగా వున్నాయి. మారాకకు ముందుగనే మా రెండవపిల్ల వాడు మనోహర్ మరియు మా మూడవ కూతురు విజయలక్ష్మి పిల్లలు అక్కడికి వచ్చివున్నారు. మేము బస్‌లు దిగటంతోనే అందరము కలుసుకొని వారు విడిదిచేసియున్న సత్రంలోకి వెళ్లాం. పిల్లలతో కబుర్లు చెప్పుకుంటూ ఒక గంట సుమారు కాలం గడిపాం. అన్నవరం మా కుటుంబమిత్రులైన శ్రీ B.కామేశ్వరరావుగారి స్వగ్రామం. శ్రీ కామేశ్వరరావు గారు మా రాకను ముందుగా వారి సోదరులకు తెలిపి మాకు అన్ని సదుపాయాలు చేయించారు. వారికి వారి కుటుంబ సభ్యులకు మేము ఎంతో కృతజ్ఞులము. ఇక్కడస్థల దైవం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి. శైవ, వైష్ణవ సాంప్రదాయాలకు అనువైనది శ్రీ స్వామివారి విగ్రహం. తక్కినప్రదేశాలలోని సత్యనారాయణ స్వామి మూర్తులకు భిన్నంగా యిక్కడ స్వామి వారికి మీసాలు వుంటవి. బహుశ ఈ మూర్తి యిలావుండటానికి కారణం ఈ ప్రాంతీయ క్షత్రియకులాల వారి ప్రాబల్యం కావచ్చు.

ఈ దేవస్థానంలో రెండు విధాలుగా శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రతం నిర్వహించుకుంటారు. కొందరు సామూహికంగా వ్రతమాచరిస్తారు. ఆ ప్రదేశం దిగువలో వుంది. కొందరు ప్రత్యేకంగా స్వామి వారి సన్నిధిలో వ్రతం జరుపుకుంటారు. దిగువలో సామూహికంగా ఒకే పర్యాయం ఒక వెయ్యి (1000)మంది వ్రతమాచరించవచ్చు. మా యాత్రికులు ఎవరెవరి యిష్టప్రకారం వారు వ్రతమాచరించాం. మేము వ్రతం చేసుకుని తీర్థప్రసాదములు తీసుకునే వరకు 2గంllకావచ్చింది. మా యాత్రికులందరు వెంటనే తుని తిరుగుప్రయాణం కట్టి, తునిస్టేషన్‌కు చేరుకుని, భోజనాలు చేసారు. మేము మా పిల్లలు బసచేసిన సత్రంకు వెళ్లి, భోజన కార్యక్రమాలు పూర్తి చేసుకుని, కొంత సేపు విశ్రాంతి

తీసుకుని, మరొకసారి మనసార కనులార స్వామి దర్శనం చేసుకుని కొండపై నలు వైపుల తిరిగి చూచాం. కొండపై నుండి ఎంతో దూరంనుండి ప్రవహిస్తున్న పంపానదిని చూడవచ్చు. ఆ పచ్చిక బయళ్లు, తోటలు చూచుటకు ఎంతో అహ్లాదకరంగా కనిపించాయి. మేము కొండపై నుండి క్రిందికి బస్‌లలో వచ్చి శ్రీకామేశ్వరరావుగారి యింటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు, యితరులకు కృతజ్ఞతలు తెలిపి బస్‌స్టాండ్‌కు వచ్చాం. మాకు సాయంత్రం 6-30 - 7గంllవరకు బస్ దొరకలేదు. చివరకు ఏదోబస్‌లో తుని చేరుకున్నాం.

ఇక్కడ మాకు ఒక చిన్న అనుభవము జరిగింది. ఈ అనుభవముతో మళ్లా మేము యిటువంటి పొరపాటు తిరిగి మా యాత్రాజీవితములో చెయ్యలేదు. యాత్రికులందరు మా యీకొద్ది పాటి అనుభవాన్ని గుణపాఠంగా స్వీకరిస్తారని తలుస్తున్నాను.

మా అనుభవమేమిటంటే మేము మాతోటి యాత్రికులతో రాకుండా మాపిల్లలతో కొంతసేపు కాలం గడిపి బస్‌స్టేషన్‌కు వచ్చాం. టైముకు బస్‌లు రాక మేము రైలుస్టేషన్‌కు వచ్చేవరకు ఆలస్యం జరిగింది. రైలు సరియైన వేళకు వచ్చి మేము తుని స్టేషన్ చేరుకునే వరకు వెళ్లిపోయింది. యాత్రలలో యాత్రికులు మేనేజిమెంటు వారిని మరియు తోటి యాత్రికులను వదిలిపెట్టి ఒంటరిగా ఎటూ వెళ్లకూడదు. మా ఈ అనుభవాన్ని ప్రతి యాత్రికుడు ఒక గుణపాఠంగా తీసుకోవాలి.

మేము కొంత ఆందోళన, చికాకు చెందినా, తరువాత శాంతించి గంట తర్వాత వెళ్లే East Coast Expressలో విశాఖపట్టణానికి టికెట్టుకొని వెళ్లాం. మేము వెళ్లిన సుమారు ఒక గంట తరువాత మా రైలు అక్కడికి రావటం జరిగింది. మళ్లీ మేము మా సహయాత్రికులతో కలుసుకుని ఒకరి అనుభవాలు ఒకరికి చెప్పుకొని నవ్వుకున్నాం. మా యాత్రాప్రోగ్రాం తెలుసుకుని రైలు స్టేషన్‌కు విశాఖలో Information department లో డిప్యూటీ డైరక్టర్‌గా పనిచేస్తున్న మా బావమరది భండారు పర్వతాలరావు, A.L.నరసింహారావుగారి అల్లుడు, కుమార్తె

మా తోడల్లుని కుమారుడు శ్రీ కె.జి.కె. మూర్తి (పెనుగంచిప్రోలు గోపి)అంతా వచ్చారు. మేము ఆ రాత్రి బావమరది యింట్లో మకాం వేశాం.

విశాఖపట్టణం 16-4-1978

తెల్లవారి ఉదయం మేము కాలకృత్యాలు తీర్చుకొని మా బావమరది పర్వతాలరావు జీపులో సింహాచలం వెళ్లాం. విశాఖపట్టణానికి చేరువగావున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యిది. ఇక్కడ వున్నది శ్రీ వరాహ నృసింహస్వామి. ఈ స్వామిని ఉగ్రనరసింహ స్వామి అనికూడ అంటారు.హిరణ్యకశిపుణ్ణి సంహరించి విష్ణువు ప్రహ్లాదుని కోరికపై యిక్కడ వెలసినట్లు స్థలపురాణం కలదు. స్వామి విగ్రహానికి చందనపూత వేస్తారు. నృసింహ జయంతినాడు మటుకు స్వామి నిజరూపంలో దర్శనం యిస్తారు. సింహాచలం దేవాలయం ఎత్తైన కొండపైవుంది. విశాఖపట్టణం నుండి 7,8 మైళ్లు రోడ్డు ప్రయాణం తరువాత 5,6 మైళ్లు ఘాట్ రోడ్డు మీద వెళ్లవలసి వస్తుంది. యాత్రికులు కాలినడకన వెళ్లుటకు కొండపైకి దారి పొడవునా మెట్లు వున్నాయి. ఘాట్ రోడ్డుకు యిరు వైపుల ఉన్నాయి, పనస చెట్లు, జీడిమామిడిచెట్లు ఆ ప్రకృతి రామణీయకత మనస్సుల నెంతో ఆహ్లాదపరుస్తుంది. కొండపైనుండి విశాఖపట్టణాన్ని, సముద్రాన్ని చక్కగా తిలకించవచ్చు.

కొండపై గోముఖంలో నుంచి వచ్చు జలధారలలో భక్తులు స్నానాలు చేసి స్వామిని దర్శిస్తారు. స్వామివారికి వజ్రవైడూర్యములు పొదిగిన ఎన్నో విలువైన బంగారు నగలు గలవని ప్రతీతి.

తరువాత మేము చూసింది ప్రభుత్వ పాల సరఫరా కేంద్రము. యంత్ర సహాయంతో ఖాళీసీసాలు నడవడం, పాలునింపటం, మూతలు బిగించడం, వాటంతట అవే బయటకు వెళ్లటం ఎంతో చూడ ముచ్చటగా కనుపిస్తుంది. తరువాత మేము హిందుస్తాన్ షిప్ యార్డు, అవుటర్ హార్బరు, ఇన్నర్ హార్బరులను దర్శించాం. అక్కడ నుండి రామకృష్ణ బీచ్‌మీదుగా సముద్రం పొడవునా వేసిన రోడ్డు మీద జనరల్ హాస్పిటల్, జంతు ప్రదర్శనశాలకు వెళ్లాం. అక్కడవున్న అన్ని మృగములు, పక్షులలో మమ్ములనొక చిన్నపక్షి చాల ఆకర్షించింది. దానిపేరు

మైనా. మైనా మాటలు పలుకుతుంది. మేము "టాటా మైనా!" అన్నాం. మైనా తిరిగి అవే మాటలు వల్లించింది. ఈజూలో అనేక మృగములు, పక్షులు వున్నవి. ఈజూ చాల అభివృద్ధి మార్గంలో వెళ్లుతూవుంది. ఇవన్నీ చూచుకొని మేము యింటికి వచ్చేవరకు సుమారు 2గంIIలు అయింది. వెంటనే భోజనకార్యక్రమాలు పూర్తి చేసుకుని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, అక్కడ వున్న మా గోపి, A.L.నరసింహారావుగారి అమ్మాయి యిండ్లకు వెళ్లి సాయంత్రం 6గంIIవరకు రైలుస్టేషన్ చేరుకున్నాం. మా తోటి ప్రయాణీకులను కలుసుకున్నాం. మా రైలు విశాఖపట్నం నుంచి రాత్రి 7,8 గంIIల మధ్యలో పూరికి బయలుదేరింది. ఆ రాత్రంతా రైలులో ప్రయాణం చేసాం. విశాఖపట్నంలో యింకా అనేకమైన యాత్రాస్థలాలు వున్నప్పటికి ఆదివారం అవటం వల్ల చూడ లేకపోయాం.

17-4-78

మా యాత్రా ప్రయాణం నాల్గవరోజు గడిచిపోతోంది. రైలులో పాతస్నేహితులు కూడ ఒకరికొకరు పరిచయం అవుతున్నారు. మా ప్రక్క సీటులోనే జగ్గయ్యపేట షాహుకార్లు,బట్టల వ్యాపారస్థులుమానాన్నగార్కిబాగా తెలిసిన వారు పరిచయమయ్యారు. ఖమ్మం వాస్తవ్యులు నాకు రాజకీయ సహచరులైన శ్రీ బసవ నారాయణగారి సతీమణి శ్రీమతి సరస్వతి, మాకు దూరపు బంధువులు ఆంధ్రగర్ల్స్ స్కూలు హిందీటీచరు స్వరాజ్యలక్ష్మి, మరియు, వరంగల్ కాపురస్తులు భూపతి గౌరీశంకర్ మరియు వారి సతీమణి బాగాపరిచయమయ్యారు. ఈ రోజు శ్రీరామ నవమి. ఈ రోజల్లా రైలు ప్రయాణం చేస్తూనేవుంది. రైలులోనే భజన కార్యక్రమాలు పూర్తి చేసుకున్నాం. మా రైలు పూరీ స్టేషన్ పగలు 2గంIIవరకు చేరుకుంది. కొద్ది విశ్రాంతి తరువాత బస్‌లలో మొదలు మేము కోణార్క దేవాలయాన్ని దర్శించాం. ఈ దేవాలయం ఒక నట్టడవిలో సముద్ర ప్రాంతాన సుమారు20కిమీ దూరంలో వుంటుంది ప్రపంచంలో వున్న ఆరు అద్భుతాల తరువాత యిది ఏడవది అని చెప్పవచ్చు. ఇది సూర్య దేవుని దేవాలయం. దీనికి పూజ పునస్కారములు లేవు. కొంతభాగం శిధిలావస్థలో వుంది. పురావస్తు శాఖవారు దీని బాగోగులు గురించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కనిపిస్తున్నది.

దేవాలయం మొత్తంరాతి కట్టడం. దెవాలయం అక్కడక్కడ కూలిపోవటం వల్లబీటలు వారినందున దేవాలయంలోనికి వెళ్లటానికి ఆటంకాలు పెట్టివుంచారు. దేవాలయం పైకి వెనుక భాగంనుంచి ఎక్కి చుట్టు తిరిగి చూసి వచ్చాం. ఈ దేవాలయం 13వ శతాబ్దంలో నరసింహరాజుచే నిర్మించబడుట చరిత్ర చెప్తోంది. ప్రస్తుతం శిథిలావస్థలో వున్నప్పటికి తన శిల్పకళావైభవంచేత చూపరులను ఆకట్టుకోగలుగుతున్నది. మన దేశీయులనే కాక విదేశీయాత్రీకులను కూడ విపరీతంగా ఆకర్షించే ప్రదేశాలలో కోణార్క దేవాలయం అతి ముఖ్యమైనదని చెప్పవచ్చు. పురావస్తుశాఖవారు ఈ దేవాలయాన్ని ఉన్నదివున్నట్లుగా పునర్ నిర్మాణం గావిస్తున్నారు. నలుదిక్కులనుంచి రాత్రులు పెద్దగా కాంతి నిచ్చే కరంటు బల్బుల వెలుతురులో ఈ దేవాలయం ముఖ్యంగా పౌర్ణమి నాటి వెన్నెలలో చూపరుల నెంతో ఆకర్షిస్తుంది. దేవాలయపుశిల్పశోభ వర్ణించనలవి గానిది. కామసూత్రముల ఆధారముగా చెక్కబడిన శిల్పాలకు ప్రసిద్ధిగాంచిన దేవాలయము. సాయంత్రం 6గం॥ వరకు అక్కడ వున్నాం. వ్యవధిలేనందున లైట్ల వెలుగులో, శోభాయమానంగా కనబడే ఈ దేవాలయాన్ని రాత్రి సమయంలో దర్శించే భాగ్యం మాకు కలుగలేదు.

తరువాత ఒరిస్సా రాష్ట్ర రాజధానియైన భువనేశ్వర్‌కు బయలుదేరాం. అక్కడకు సుమారు20కి.మీ దూరంలో వున్న భువనేశ్వరానికి సుమారు 7గం॥వరకు చేరుకున్నాం. ఈ పట్టణంలో ప్రసిద్ధి చెందినది శ్రీభువనేశ్వరాలయం. అతిప్రాచీనమైనది. పూర్వకాలంనుంచి వున్నటువంటి ఈ దేవాలయంవల్లనే ఈ పట్టణమునకు భువనేశ్వరమని పేరు పెట్టివుండవచ్చు. ఈ దేవాలయ ప్రాంగణంలో అనేక దేవాలయాలు కలవు. వాటిలో ముఖ్యమైనవి లింగ రాజేశ్వరాలయం. ఈ ఆలయం చాల పురాతనమైనది.

తరువాత మేము రాత్రి 8గం॥కు సమీపంలో వున్న కేదార్ గౌరీ ఆలయం దర్శించాం."కేదార్, గౌరీ" అనే యిద్దరు ప్రేమికులు. వారి వివాహమునకు పెద్దలు అంగీకరించనందున వారిద్దరు ఈ ప్రదేశము చేరుకుని పెళ్లి చేసుకొనవలెనని నిశ్చయించుకున్నారట. వారి నిర్ణయం ప్రకారం విడివిడిగా బయలుదేరి ఆ ప్రదేశం చేరుకోవాలని నిర్ణయించుకున్నారు. నిర్ణీతసమయానికి ముందుగా ఒక్కత్తే వచ్చిన

గౌరి పులి వాత పడినందున కొద్ది ఆలస్యంగావచ్చిన కేదార్ ప్రేయసి మరణవార్తను తెలుసుకొని విరక్తిచెంది ఆత్మాహుతి చేసుకుని స్వర్గలోకంలో గౌరిని చేరుకున్నాడని స్థలపురాణం చెప్పుతున్నది. ఆ ప్రేమికుల స్మృతి చిహ్నంగా ఈదేవాలయనిర్మాణం జరిగినట్లు ప్రతీతి. అక్కడ నుంచి బయలుదేరి మార్గమధ్యంలో వున్న సాక్షిగోపాలం దేవాలయం చూచుకొని రాత్రి 10గంIIవరకు తిరిగి వూరు చేరుకున్నాం. మేము చాల అలసిపోయాం.

పూరి జగన్నాథం 18-4-78

అందరం ఉదయాన్నే లేచి కాలకృత్యాలు ముగించుకొని సముద్రస్నానానికి వెళ్లాం. స్నానాలు చేసి, తడి బట్టలతో పట్టణ మధ్యంలో వున్న కోనేరు వద్దకు వచ్చాం. కోనేరు చాల శిధిలావస్థలో వుండటమేకాక చాల అపరిశుభ్రంగా వుంది. నేను అక్కడ స్నానం చేయలేదు. మూఢనమ్మకాలు వున్నవారు కొద్దిమంది కోనేరులో రెండు చెంబులు నీళ్లు పోసుకున్నారు. తర్వాత జగన్నాధస్వామి ఆలయానికి చేరుకున్నాం. ఇక్కడకూడ ఒక చిన్న కోనేరు వుంది. అనేక చిన్న చిన్న దేవాలయాలు మార్కండేయస్వామి దేవాలయము, సాక్షిగోపాల దేవాలయము వున్నాయి. ఇవిఅన్ని చాల శిథిలావస్థలో వున్నాయి. ఇక్కడ పరిశుభ్రత బొత్తిగా మృగ్యము. కోనేరులోని నీరు వాడుకలో లేక పాడుబడివుంది. ఈ దేవాలయాలన్ని బయటినుంచే దర్శించి ప్రసిద్ధిచెందిన జగన్నాథస్వామి దేవాలయానికి వెళ్లాం. ఇది పూర్తిగా శ్రీకృష్ణదేవాలయమే. శ్రీకృష్ణునకు మరో పేరు జగన్నాధుడు. అందు వల్ల ఈ దేవాలయానికి జగన్నాధ దేవాలయమనే పేరు ప్రసిద్ధి కెక్కింది. ఈ దేవాలయము యొక్క చుట్టూ ప్రాకారము చాలపెద్దది. ఆలయములో శ్రీకృష్ణ, బలరామ, సుభద్ర విగ్రహములు మొండెములుగా వున్నవి. అనగా కాళ్లు చేతులు లేవు. దీనికొక ఇతిహాసం కలదంటారు. ఆ దేశాన్ని పాలించే రాజు సముద్రస్నానానికి వెళ్లగా అక్కడొక గంధం మొద్దు దొరికెనని ఆమొద్దును యింటికి తీసుకురాగా, అదే రాత్రి స్వామి ఆ రాజుగారికి కలలో కనుపించి తమ విగ్రహములు తయారు చేయించమని ఆజ్ఞాపించాడట!. ఆ విగ్రహములు పూర్తిగా తయాయ్యేవరకు ఎవరూ లోనికి రాకూడదని వాటిని

చూడకూడదని నిషేధములు పెట్టాడట. అంతట ఆ రాజు కొందరు శిల్పులను ఒక గదిలో ప్రవేశ పెట్టి అన్ని సౌకర్యములు చేసాడు. శిల్పుల కోసం బయట తాను వేచివుండి చివరకు విసుగుచెంది తాను స్వయంగా ఏమిజరుగుచున్నదోనని తలుపులు తెరిచాడట. ఆ సమయానికి విగ్రహములు మొండెములవరకే తయారయి వున్నందున అవి అట్లగనే నిలచి పోయినవని ప్రతీతి. ఇప్పటికి ప్రతి పుష్కరాని కొక పర్యాయం గంధం చెక్కతో కొత్త విగ్రహములను తయారు చేసి పాత విగ్రహముల స్థానే కొత్త విగ్రహములను ప్రతిష్ఠించి పాతవిగ్రహములను సముద్రమధ్యమందు నిమజ్జనంచేయు సాంప్రదాయము వుంది. గయలో పిండ ప్రదానం ఎంత ముఖ్యమో పూరీలో అన్నదానం కూడ అంతే ముఖ్యం. మేమంతా ఎవరెవరి శక్త్యానుసారం వారు మా మానేజిమెంటువారు ఏర్పాటు చేసిన ప్రకారం అన్నదానాలు చేసుకుని పగలు2గంIIవరకు మార్కెలు వద్దకు చేరుకున్నాం. భోజనాలు కావించుకొని విశ్రాంతి తీసుకుని సాయంత్రం సముద్రపుఒడ్డున వున్న శంకర మఠమునకు వెళ్లాం. ఇది ఆది శంకరుల వారిచే ఏర్పాటు చేయ బడింది. ఇటీవల కొత్తగా తిరిగి నిర్మించబడింది. పూర్వపు పీఠం అక్కడ వున్నదని తెలుసుకున్నప్పటికి, సమయము లేనందున అక్కడికి వెళ్లలేకపోయాం. మేము శంకర మఠానికి వెళ్లిన సమయములో శ్రీ జగద్గురు శంకరస్వాముల వారు లేరు. దేశపర్యటనలో వున్నారని తెలుసుకున్నాం. చీకటి పడేలోపు తిరిగి స్టేషన్ చేరుకున్నాం. తరువాత సంగతులు మామూలే.

పూరిజగన్నాథం 19-4-78

మా రైలు 18-4-78 రాత్రి 8.30 గంllలకు పూరి నుంచి కలకత్తాకు బయలు దేరింది. మేము హౌరా స్టేషన్ చేరుకునే వరకు 19-4-78 సాయంత్రం 4-30 గంllలు అయింది. ఈ రోజు ప్రయాణబడలిక వల్ల హౌరా బ్రిడ్జి మరియు పెద్ద బజారులో కొంత దూరం వెళ్లి, తిరిగి హౌరా బ్రిడ్జి మీద నిలబడి అంతా చూచి సాయంత్రం 7గంllలకు రైలు డబ్బాలు చేరుకున్నాం. హౌరా బ్రిడ్జి బ్రిటిష హయాంలో కట్టబడింది. ఈ బ్రిడ్జి పొడవు సుమారు 500 గజాలు లేకరెండు ఫర్లాంగులు తక్కువ లేకుండా వుండవచ్చు. ఈ బ్రిడ్జిలోని విశేష మేమంటే ఈ బ్రిడ్జి వున్న రెండు ఫర్లాంగుల పొడవు కూడ స్థంభములు (Pillars) లేవు. రెండు దిశలకు చివరలో రెండు (abetments) ఎబెట్‌మెంట్స్ మాత్రమే వున్నాయి. ఆ ఎబెట్‌మెంట్స ఆధారం మీదనే మొత్తం బ్రిడ్జిలోడు (load) పడుతున్నట్లు, ఆ ఎబెట్‌మెంట్లు మాత్రమే పూర్తి బరువు మోస్తున్నట్లు అర్థమౌతున్నది. ఈ బ్రిడ్జి హౌరానది నీటి మట్టమునకు సుమారు 40, 50 అడుగుల ఎత్తు వుండవచ్చు. ఈ బ్రిడ్జి నడిపట్టణంలో వున్నందున రద్దీ చాల అధికంగా వుంటుంది. ఈ బ్రిడ్జి మీద ట్రాంలు వెళ్లుటకు దారి ప్రత్యేకంగా నిర్మించ బడియున్నది. కలకత్తా రేవునకు వచ్చిన పెద్ద పెద్ద ఓడలు హౌరానది గుండా కలకత్తా పట్టణానికి, అపైన వెళ్లేందుకు వీలుగా ఈవంతెన నిర్మించ బడింది. బ్రిడ్జిపై నుండి లారీలు, ట్రాములు, బస్‌లు కార్లు మరియు క్రిక్కిరిసిన ప్రజానీకం ఏక కాలంలో వెళ్లుతూ వుండటం చూడగల్గుతాం. క్రింది నదిలో ఓడలు, పడవలు నిరాటంకంగా పయనిస్తూ వుంటాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం బ్రిటిష్ యింజనీర్ల ప్రతిభా నైపుణ్యాన్ని చాటుతుందని చెప్పవచ్చు. ఇది వారి మేధా సంపత్తికి ప్రతీక.

కలకత్తా 20-4-78

ఈ రోజు ఉదయం 8 గంll వరకు మా భోజన కార్యక్రమాలు ముగించుకొని కలకత్తాలో వున్న ముఖ్యమైన యాత్రా స్థలాలు చూచుటకు బస్‌లలో బయలు దేరాం. పశ్చిమ బెంగాల్ రాజధాని నగరం కలకత్తా. ఆంధ్రులతో సమానమైన

సాంప్రదాయం కలిగిన వారు వంగీయులు. కట్టు బట్టలోనే కాక సాంఘిక రాజకీయాలలో కూడ చాల వరకు పోలికలు కలిగి వున్నవనుటలో సందేహం లేదు. త్యాగశీలతలో ఎవరికి వారేసాటి. విశ్వకవి రవీంద్రనాధ్ టాగూర్, అజాద్ హింద్ ఫౌజ్ నిర్మాత సుభాష్ చంద్ర బోస్, చిత్తరంజన్ దాస్, రాజా రాం మోహన్ రాయ్ వంటి మేధావులు, త్యాగ పురుషులు, సంఘ సంస్కర్తలు జన్మించిన కీర్తి ఈ గడ్డకేదక్కింది.

ఈ రోజు మేము మొదటగా దర్శించిన ప్రదేశము బొటానికల్ గార్డెన్. వివిధ ఫల పుష్ప జాతుల పరిశోధనా కేంద్రంమిది, రకరకాల చెట్లను కొత్తవి తెచ్చి, నాటి పెంచే ప్రయోగశాల యిది. ప్రవేశద్వారము వద్దనే ఒక విశాలమైన వట వృక్షమును తిలకించాము. ఈ వృక్షము యొక్క మొదలు చివర అంతుదొరకదు. మద్రాసు పట్టణంలోని అడయార్‌లో వున్న వృక్షము, మహబూబ్ నగర్ జిల్లాలోని పిల్లల మర్రి వట వృక్షము, ఇదీ దాదాపు ఒకే మాదిరిగా వున్నట్లు నాకు అనుపించింది. తదుపరి కొబ్బరి, లవంగము ఇతర రకరకాల చెట్ల సముదాయము మరియు కొబ్బరి చెట్లతో ఏర్పరచిన చిత్ర విచిత్ర అల్లకములు, పందిళ్లు చూచి మేము ఎంతో ఆనందించాము. అక్కడ నుంచి బేలూరు రామకృష్ణ మఠమును దర్శించు కున్నాము. ప్రపంచ దేశాలకు హిందూ మత ఔన్నత్యాన్ని బహిరంగ పరచిన మహా యోగి శ్రీ రామకృష్ణ పరమహంస. ఆయన సిద్ధి చెందిన ప్రదేశము యిదే - ఒక పెద్ద భవనములో ఆయన సమాధి గలదు. ఆయన సమాధికి సమీపముననే మరొక భవనములో ఆయన సతీమణి శ్రీ శారదామాయి యొక్క సమాధి గలదు. ఇది హౌరా నది ఒడ్డున కలకత్తా పట్టణమునకు కొద్ది దూరంలో ప్రశాంత మైదానములో నిర్మింపబడిన మహా గొప్ప ఆధ్యాత్మిక స్థలం. రోజూ వేలాది మంది భక్తులు ఇచ్చటికి వచ్చి దర్శించుకొని నిశ్శబ్దంగా ప్రార్ధనలు జరిపి తరించుతారు. తర్వాత మేము దర్శించిన ప్రదేశము దక్షిణేశ్వరాలయం. శ్రీ రామకృష్ణపరమహంసఅక్కడకాళీదేవినిపూజించిభగవత్‌సాక్షాత్కారంపొందింది యిక్కడే. ఆయన చిరకాలముగ శ్రీ దేవిని ఆరాధించుతూ తన భక్తి ప్రపత్తులతో నాస్తికులను ఆస్తికులుగా మార్చగలిగాడు.

సాంప్రదాయం కలిగిన వారు వంగీయులు. కట్టు బట్టలోనే కాక సాంఘిక రాజకీయాలలో కూడ చాల వరకు పోలికలు కలిగి వున్నవనుటలో సందేహం లేదు. త్యాగశీలతలో ఎవరికి వారేసాటి. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్, ఆజాద్ హింద్ ఫౌజ్ నిర్మాత సుభాష్ చంద్ర బోస్, చిత్తరంజన్ దాస్, రాజా రాం మోహన్ రాయ్ వంటి మేధావులు, త్యాగ పురుషులు, సంఘ సంస్కర్తలు జన్మించిన కీర్తి ఈ గడ్డకేదక్కింది.

ఈ రోజు మేము మొదటగా దర్శించిన ప్రదేశము బొటానికల్ గార్డెన్. వివిధ ఫల పుష్ప జాతుల పరిశోధనా కేంద్రంమిద్ది రకరకాల చెట్లను కొత్తవి తెచ్చి, నాటి పెంచే ప్రయోగశాల యిది. ప్రవేశద్వారము వద్దనే ఒక విశాలమైన వట వృక్షమును తిలకించాము. ఈ వృక్షము యొక్క మొదలు చివర అంతుదొరకదు. మద్రాసు పట్టణంలోని అడయార్‌లో వున్న వృక్షము, మహబూబ్ నగర్ జిల్లాలోని పిల్లల మర్రి వట వృక్షము, ఇదీ దాదాపు ఒకే మాదిరిగా వున్నట్లు నాకు అనుపించింది. తదుపరి కొబ్బరి, లవంగము ఇతర రకరకాల చెట్ల సముదాయము మరియు కొబ్బరి చెట్లతో ఏర్పరచిన చిత్ర విచిత్ర అల్లకములు, పందిళ్లు చూచి మేము ఎంతో ఆనందించాము. అక్కడ నుంచి బేలూరు రామకృష్ణ మఠమును దర్శించు కున్నాము. ప్రపంచ దేశాలకు హిందూ మత ఔన్నత్యాన్ని బహిరంగ పరచిన మహా యోగి శ్రీ రామకృష్ణ పరమహంస. ఆయన సిద్ధి చెందిన ప్రదేశము యిదే - ఒక పెద్ద భవనములో ఆయన సమాధి గలదు. ఆయన సమాధికి సమీపముననే మరొక భవనములో ఆయన సతీమణి శ్రీ శారదామాయి యొక్క సమాధి గలదు. ఇది హౌరా నది ఒడ్డున కలకత్తా పట్టణమునకు కొద్ది దూరంలో ప్రశాంత మైదానములో నిర్మింపబడిన మహా గొప్ప ఆధ్యాత్మిక స్థలం. రోజూ వేలాది మంది భక్తులు ఇచ్చటికి వచ్చి దర్శించుకొని నిశ్శబ్దంగా ప్రార్ధనలు జరిపి తరించుతారు. తర్వాత మేము దర్శించిన ప్రదేశము దక్షిణేశ్వరాలయం. శ్రీ రామకృష్ణపరమహంసఅక్కడకాళీదేవినిపూజించిభగవత్‌సాక్షాత్కారంపొందింది యిక్కడే. ఆయన చిరకాలముగ శ్రీ దేవిని ఆరాధించుతూ తన భక్తి ప్రపత్తులతో నాస్తికులను ఆస్తికులుగా మార్చగలిగాడు.

తదుపరి మేము డండం విమానాశ్రయము, మార్వాడిగుడి, జంతు ప్రదర్శనశాల,(Z00) శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, భారత దేశంలో ప్రసిద్ధి చెందిన కాళికాలయం దర్శించుకున్నాం. సాయంత్రం 7 గంIIలకు బిర్లా ప్లానిటోరియంకు వెళ్లాం. ఈ రోజు ఎండ చాల తీక్షణంగా వుంది. ప్లానిటోరియం ఏర్ కండిషన్‌ది అగుటవల్ల దినమంతా ఎండలో తిరిగిన మాకు కొంత సేద తీర్చుకున్నట్లు అనిపించింది. ఖగోళ రహస్యములను బహిరంగపరిచే మానవ నిర్మిత నక్షత్రశాల యిది. మేము చూచిన ప్రదర్శన సుమారు 2గంIIలు పట్టింది. విశ్వాంతరాళములో గ్రహాల స్థానములు వాటి చలనము, గ్రహణములు ఏర్పడే విధములు వివరంగా చూపించారిక్కడ. స్వయముగా అంతరాళములో విహరించి గ్రహములను దగ్గరగా చూడగలిగిన అనుభూతిని పొందగలిగాం. విక్టోరియా మెమోరియల్ యిక్కడికి సమీపంలో వుంటుంది.

కలకత్తా 21-4-78

తెల్లవారి విక్టోరియా మహారాణి స్మృతి చిహ్నంగా నిర్మింపబడిన "విక్టోరియా మెమోరియల్" దర్శించాం. ఇది ఒక సువిశాల మైదానంలో నిర్మించ బడ్డ పాలరాతి భవనం. భారత దేశమును పాలించిన వైస్రాయిలు, గవర్నర్లు, గవర్నర్ జనరల్స్ యొక్క పాలరాతి విగ్రహములు, తైల వర్ణ చిత్రాలు, అప్పటి కాలంలో వారు వాడిన ఆయుధాలు, ఆనాటి బ్రిటిష్ వారి యుద్ధ రీతులను వర్ణించే చిత్రాలు లెక్కకు మించి ఈ భవనంలో వున్నటువంటి మ్యూజియంలో వున్నవి. భారత దేశాన్ని పాలించిన మొగలాయీ చక్రవర్తుల చిత్రాలు కూడ ఈ మ్యూజియంలో చూడ వచ్చును. వాటి దర్శనము వల్ల ఆనాటి చరిత్ర మరొకసారి స్ఫురణకు వచ్చింది. తరువాత పట్టణమంతా తిరిగి చూచి స్టేషన్‌కు చేరుకున్నాం.

22-4-78

ఈ రోజు మేము బీహార్ రాష్ట్రంలోని ముజఫర్ పూర్‌కు బయలు దేరాం. ఇక్కడ నుండి మా రైలు డబ్బాలు వేరు వేరు trains కు తగిలించ బడ్డాయి. టూరిస్టు

క్యారేజ్ ప్యాసింజర్ రైలుకు తగిలించి ఉదయమే బయలు దేర తీసారు. మేము కూర్చున్న డబ్బా two tyre కాబట్టి express trainకు attach చేసి మమ్ములను రాత్రి 10గంllలకు బయలు దేర తీసారు. మా రెండు రైళ్ల కొద్ది వ్యత్యాసంతో తెల్లవారి 10గంll వరకు ముజఫర్‌పూర్ చేరుకున్నాయి. దారిలో దూరం నుంచి భిలాయ్ ఉక్కు కర్మాగారం చూచాం. మార్గమధ్యంలో వున్నటు వంటి సమస్తిపూర్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం మీద L.N. మిశ్రాగారి సమాధి దర్శించుకున్నాం. ముజఫర్‌పూర్ బీహార్ రాష్ట్రంలోని ఒక ముఖ్యమైన జిల్లా మరియు ఇండస్ట్రియల్ కేంద్రము. ఈ రోజంతా ముజఫర్‌పూర్‌లో వున్నాం. సాయంత్రం స్థానికంగా వున్న దేవాలయాలను దర్శించుకున్నాం.

ముజఫర్‌పూర్ 23-4-78

ఈ రోజు రాత్రి 2గంllకు ముజఫర్‌పూర్ నుంచి నేపాల్ రాజధాని ఖాట్మండూకు రెండు బస్‌లలో బయలు దేరాం. ముజఫర్‌పూర్ నుండి ఖాట్మండుకు సుమారు330కి.మీ. వుంటుంది. ఇందులో అధికభాగం ఘాట్ రోడ్డు. మేము తెల్ల వారే వరకు భారత దేశ సరిహద్దు భాగమైన "రెక్సాల్" చేరుకున్నాం. నేపాల్ మనకు ఫారన్ దేశము. అక్కడికి వెళ్లి వచ్చుటకు ఇరు ప్రభుత్వముల తరపున కొన్ని కట్టు బాట్లు వున్నవి. ఇక్కడి వస్తువులు అక్కడికి, అక్కడి వస్తువులు యిక్కడికి తీసుకొని వెళ్లరాదు. అందుకుగాను ఉభయ దేశాల సరిహద్దులలో గట్టి నిఘా ఏర్పాట్లు వున్నవి. భారతదేశ సరిహద్దు గ్రామమైన రెక్సాల్ మరియు నేపాల సరిహద్దు గ్రామమైన బీర్‌గంజ్‌లో వున్న కస్టమ్స్ వీరి అనుజ్ఞతో మా ప్రయాణం ముందుకు సాగి పోయింది.

మధ్యాహ్నం 1గంllకు ఒక సెలయేటి ప్రక్కన ఒక గుడిలో భోజన ఏర్పాట్లు చేసుకొని భుజించి వెంటనే మా ప్రయాణం ముందుకు సాగించాం. ఉత్తుంగహిమవన్నగ సౌందర్యాన్ని కన్నుల పండుగగా తిలకిస్తూ పోతున్నాం. ఇది దుర్గ పర్వత ప్రాంతం. ఎత్తైన పర్వత శిఖరాల మీదికి ఎక్కుతూ దిగుతూంది మా బస్. ఒక వైపు ఉన్నత హిమవన్నగశృంగం. రెండవ ప్రక్కన అగాధమైన లోయ. ఇంతటి ఎత్తైన పర్వత చరియలలో రైతులు కష్టపడి పని చేస్తూ వరి,

గోధుమ, అలుగడ్డ మొ॥గు పంటలు పండించటం మాకెంతో ఆనందాన్ని కలిగించింది.

మార్గమధ్యంలో ఖాట్మండుకు 100కి.మీ. దూరంలో 8200 అ.ల. ఎత్తైన ప్రదేశం మీద ఒక'వ్యూ' పాయింట్ నిర్మాణం చేసారు. అక్కడ నుండి హిమాలయ పర్వత శ్రేణులేగాక ప్రపంచానికి మకుట ప్రాయమైన గౌరీ శంకర్ శిఖరం కూడ చూడగలిగాం. దీని ఎత్తు నిర్ణయించ గలిగిన బ్రిటిష్ శాస్త్రవేత్త పేర దీనిని"ఎవరెష్టు" శిఖరమంటారు. వెండి కొండలాగా మెరసిపోతున్న ఈ శిఖరమే శివపార్వతుల నివాస స్థానమైన కైలాసమని హిందువుల విశ్వాసం. ఎంతో సేపు తనివితీరా చూచాం ఆ దృశ్యాన్ని.

సాయంత్రం 6గం॥ కావచ్చింది. మా ప్రయాణం సాగి పోయింది.

ఖాట్మండూకు 260 కి.మీ. దూరంలో "నాబిసే" అను గ్రామం వద్ద చైనాకు వెళ్లేరోడ్డు కలుస్తుంది. ఇచట నుండి మనకు, చైనా వారికి "ఖాట్మండు" వెళ్లటానికి ఒకే రోడ్డు. రాత్రి 12 గం॥కు "ఖాట్మండు" చేరుకున్నాం. సుమారు 22గం॥ నిరవధికంగా ప్రయాణం చేయటం వలన యాత్రికులందరూ చాల అలసి పోయారు. అందరం అల్పాహారం తీసుకుని నిద్రించాం. మా బస "పశుపతి నాథ్" దేవాలయమునకు సమిపంలో వున్న "గోశాల"లో ఏర్పాటు చేసారు. ఇది విశాలమైన రెండతస్థుల భవనం. ఈ సత్రంలో అన్ని సదుపాయాలు వున్నవి. భౌగోళికంగా "నేపాల్ దేశము" 80-88ల తూర్పు రేఖాంశల మీద 26-39ల ఉత్తర అక్షాంశముల మధ్యగ వున్నది. "పగోడా" పద్ధతి శిల్ప కళతో ఈ దేశమంతా వ్యాపించి యున్న దేవాలయాల సంఖ్య చాల ఎక్కువగా వున్నవి. ఇవన్ని కొన్ని వేల సంవత్సరాల క్రితం అప్పటి రాజులచే నిర్మించబడిన సజీవ శిల్పాలకు నిలయాలైన కట్టడాలు.

"పశుపతినాథ్" దేవాలయం తప్ప మేము ఏ యితర దేవాలయాలకు వెళ్ల లేదు. యాత్రికులు ఎక్కువ భాగం విదేశీ వస్తువులు (Foreign goods) తెచ్చుకుందామని వస్తారే తప్ప దైవచింతన, ఆధ్యాత్మిక దృష్టికలవారు వారిలో

తక్కువ అందువల్ల మేము వున్న మూడు రోజులు మా తోటి యాత్రికులు చీరెలు, క్యాసెట్లు, రేడియాలు కొనటానికి కాలం వృధా పుచ్చారు.

ఖాట్మండు 24-4-78

ఈ రోజు పశుపతినాథ్ దేవాలయంలో అభిషేకం చేయించుకున్నాం. అర్చకులు బాగా చదువుకున్న వారు. పూజలు, అభిషేకాలు సక్రమ పద్ధతిలో చేయించారు. నేపాల్‌లో ఎక్కడ చూసినా హైందవత్వం వుట్టి పడుతూ వుంటుంది. ప్రపంచంలో హిందూ దేశమని ప్రకటించిన దేశం యిది ఒక్కటే నేపాల్ యితర దేశమైనా స్వదేశంలో వున్న దాని కంటె ఎక్కువ అనుభూతిని, ఆనందాన్ని పొందాము.

1969లో 'షా' వంశస్థులు సింహాసనాన్ని అక్రమించు కున్నారు. ప్రస్తుత రాజు"బీరేంద్ర వీర విక్రమ షా". నేపాల్ ప్రజలకు తమ ప్రభువు మరియు దేశం పట్ల ఎనలేని భక్తి ప్రపత్తులు వున్నాయి. 1951లో రాణాలనే మంత్రులకబంధ హస్తాల నుండి రాజు మహేంద్ర నాయకత్వంలో స్వతంత్రులైనారు నేపాలీయులు. మహేంద్ర అనంతరం ప్రస్తుత రాజు వీరేంద్ర రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల మీద నడిపిస్తున్నారు. ఈ రాజులు, రాజ వంశీయులు తరచుగా దేవాలయాలకు, ముఖ్యంగా పశుపతినాథ్ దేవాలయానికి రావటం సాంప్రదాయం.

పశుపతి నాథ్ దేవాలయం లోని లింగం జ్యోతిర్లింగం. ఇది స్వయంభూ ఆయిన పంచ ముఖేశ్వర లింగం. ఇది యావత్ప్రపంచములోని ప్రసిద్ధి చెందిన హిందూ దేవాలయములలో నొకటి. పంచముఖేశ్వరుడని చెప్పటమేకాని దేవాలయంలో చతుర్ముఖేశ్వరుని దర్శనం మాత్రమే అవుతుంది. ప్రక్కన వున్న దేవాలయంలో ఒక్క ముఖం గల ఈశ్వరుడు వున్నాడు. మొదలు అక్కడ దర్శనం చేసుకుని అసలు దేవాలయంలోని చతుర్ముఖేశ్వరుడిని దర్శనం చేసుకుంటారు. భాగ్‌మతి నదీతీరంలో నిర్మించ బడిన ఈ దేవాలయంలో మహా శివ రాత్రి నాడు గొప్ప వుత్సవం జరుగుతుంది. ప్రపంచంలోని అనేక మంది హిందువులు ఈ ఉత్సవాన్ని తిలకించటానికి వస్తారు. తర్వాత దక్షాధ్వరధ్వంసి శ్రీ వీరభద్రాలయం

దర్శించాం. దక్షుని సంహరించి ప్రేగులు గుంజుతున్న వీర భద్రుని విగ్రహం చాల భయంకరంగా వుంది. భోజనానంతరం కొంత విశ్రాంతి తీసుకుని మహేంద్రరాజు సతీమణి రత్నాదేవి పేరుతో నిర్మించ బడిన "రత్నాపార్కు"ను దర్శించాము.

ఇక్కడ మాకు కలిగిన ఒక చిన్న అనుభవాన్ని వ్రాస్తున్నాను. రాజు బీరేంద్ర పూర్వులు నివసించిన ప్రదేశం పాత భవనం. రత్నపార్కుకు సమీపంలో వున్నందున అక్కడికి నడిచి వెళ్లి చూచాం. తరువాత రాజు బీరేంద్ర నివసించుచున్న యిప్పటి భవనాలు చూడటానికి వెళ్లాం. చాల పెద్ద భవనం. చుట్టు గట్టి బందోబస్తు వున్నది. గేటు ప్రక్కనే కొత్తగా నిర్మించబడిన ఒక శివాలయం వున్నది. బయట నించి దేవాలయంలోనికి వెళ్ల బాట వున్నది. దేవాలయంలోనికి వెళ్లుటకు ఎట్టి ఆటంకం లేదు. మేమంతా దేవాలయంలోనికి వెళ్లి శంకరుని దర్శించాం. అక్కడి నుంచి బస్ స్టాప్ మైలు దూరం వుంటుంది. అప్పటికి సాయంత్రం 6.30 గంllలు అయింది. అక్కడ విచారించగా మేము బస చేసిన గోశాల దగ్గరనే వుందని చెప్పారు. దగ్గర అంటున్నారు కాబట్టి మాకు మా బసకు నడిచి వెళ్లుదామని బుద్ధి పుట్టింది. అందరం హుషారుగా నడవ సాగాం. రాత్రి 8గంllలైనా గమ్యానికి చేరుకోలేక పోయాము. వాస్తవంగా రాజభవన్ నుండి గోశాలకు 6కి.మీ. వుంటుందని తరువాత మేము తెలుసుకున్నాం. మాలో ఆడవారి సంఖ్య యెక్కువ. అంతా కలిసి 10-12 మంది వున్నాం. దారి తెలుసు కుంటూ త్వరత్వరగా నడవసాగాం. ఏ అపాయం లేకుండా రాత్రి 9గంllల వరకు మా బస చేరుకున్నాం. మేము వెళ్లే వరకు మాతోటి ప్రయాణికులు, మా మేనేజిమెంటు వారు ఎంతో ఆదుర్దా చెందుతున్నారు. అంతా కలుసు కొని ఒకరి అనుభవాలు వేరొకరికి చెప్పుకుని సంతోషించాం.

26-4-78

తెల్లవారు జామున మేము తిరుగు ప్రయాణం సాగించాం. వెళ్లే రోజు భోజనాలు చేసిన చోటనే మా మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేసారు. సాయంత్రం 6గంllవరకు నేపాళ్ భారత దేశ సరిహద్దు గ్రామ మైన 'రెక్సాల్' చేరుకున్నాం. అక్కడ మరియు బీర్‌గంజ్‌లో కస్టమ్స్ వారు మా బస్‌లో వున్న సామాన్లు పూర్తిగా పరీక్షించారు. ఖాట్మండూలో వారు కొన్న వస్తువులకు

ముడుపులు చెల్లించ వలసి వచ్చింది. రాత్రి 3-4 గం|| వరకు ముజఫర్‌పూర్ చేరుకున్నాం. దాదాపు 25గం|| ఏక ధాటిగా ప్రయాణం చేయటం వల్ల మేమంతా బాగా అలసి పోయాం.

27-4-78

నిన్నటి ప్రయాణం వలన అలసి పోయిన మేము ఈ రోజంతా విశ్రాంతి తీసుకున్నాం. తిరిగి ఈ రోజు రాత్రి 8గం|| లకు మా రైలు గయకు ప్రయాణం సాగించింది. మేము నేపాల్‌లో వున్న మూడు రోజులలో ముజఫర్‌పూర్‌లో ఒక రోజు మతకలహాలు జరిగి ఒక రోజు కర్ఫ్యూ విధించారు. మా మానేజిమెంటు వారు చాల భయపడి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

గయ 28-4-78

మా రైలు గయ చేరేవరకు పగలు 1 గం|| అయింది. ఎండ చాల అధికంగా వుంది. సాయంత్రం 4 గం|| లకే మేము బస్‌లలో సమీపంలో వున్న బుద్ధగయకు వెళ్లాం. అది చాల ప్రశాంతమైన ప్రదేశం. గౌతమ బుద్ధుడు తాను జ్ఞానోదయం పొంది తొలి ప్రవచనం సలిపిన ప్రదేశమిది. భారత దేశంలో పుట్టి తూర్పు ఆసియా దేశాల్లో బహుళ వ్యాప్తంగా వున్న మతం బౌద్ధమతం. టిబెట్, బర్మా, థాయ్‌లాండ్, జపాన్ మొదలగు దేశాల వారిచే అతి సుందరంగా నిర్మించ బడిన భవనాలు, ఆరామాలు ఎంతో కన్నుల పండుగగా వున్నాయి. సిద్ధార్థునకు జ్ఞానోదయం కలిగిన ప్రదేశంలోని బోధి వృక్షము నేటికి యిక్కడ నిలచి యున్నది. అక్కడ నుంచే బుద్ధ దేవుడు పలికిన ప్రవచనాలు:

"ధర్మం శరణం గచ్ఛామి"

"సంఘం శరణం గచ్ఛామి"

బౌద్ధ యుగంలోనే గాక నేటికి వ్యాప్తిలో వున్నాయి. అనేక మంది బౌద్ధ భిక్షువులు కాషాయ వస్త్రాలు ధరించి ముండిత శిరస్కులై బుద్ధుని కరుణా మృతాన్ని యాత్రికులపై వెదజల్లుతూ తిరిగి వారి ప్రేమ ఆదరాభిమానాలను,

చూరగొంటున్నారు. తిరిగి రాత్రి 8గంll వరకు మేము స్టేషన్‌లో వున్న మా డబ్బాలోకి చేరుకున్నాం.

గయ 29-4-78

గయ చాల పెద్ద పట్టణం. ఇది జిల్లా కేంద్రము. దీని జనాభా 4,5 లక్షలు వుండ వచ్చు. ఇది ఫల్గుణి నది ఒడ్డున వున్నది. ఇక్కడ ప్రధానంగా చూడదగిన కేంద్రము విష్ణుపాద మందిర్. ముఖ్యముగ చేయవలసిన పని పితౄలకు పిండ ప్రదానం. గయలో శ్రాద్ధకర్మ లాచరించిన పితరులకు మరియు తరతరాల వారికి సద్గతులు కలుగునని ఆస్తికుల విశ్వాసము. అందుకే గయను "పితౄతీర్థమని" "పితౄగయ" అనికూడ అంటారు. మా కార్యక్రమాలన్ని సక్రమంగా ముగించు కోవాలని ఉదయాన్నే ఫల్గుణి నది ఒడ్డున శ్రీ విష్ణు పాదమందిరమునకు వెళ్లాం. ఆంధ్ర దేశపు పాండాలెవరైనా దొరకుతారేమోనని గాలించాం. అనేక మంది పాండాలను కలిసాం. అక్కడ అసలే మన తెలుగు నాటి పాండాలు చాల తక్కువ. వున్న వారు ఒకరిద్దరు అయినా అక్కడి సాంప్రదాయములకు అలవాటు పడ్డవారే కాని మన ప్రాంతపు శ్రాద్ధ కర్మలు చేయించు వారు కాదు. వారిని గవయీలని అంటారు. మత్స్యాహారులు. భోక్తలకు మన వంట వండించి భోజనాదులు పెట్టించాలని నేను నా మిత్రుడు హరి వెంకట్రామయ్య గారు ఎంతో ప్రయత్నించాం. కాని అటువంటి ఏర్పాట్లు జరుగుట దుర్లభమని తెలుసుకున్న తరువాత మా ప్రయత్నం విరమించాం.

అక్కడ చేయించే శ్రాద్ధ కర్మలను "కటికశ్రాద్ధ" మంటారు. గత్యంతరము లేక మేము కూడ అక్కడి పద్ధతిలోనే శ్రాద్ధ కర్మలు చేయించుకొనుటకు సిద్ధపడ్డాం. ఫల్గుణి నదిలో నీరు లేదు. ఈ నదిలో నీరు అంతర్వాహిని. ఈ నదిలో ఇసుక తప్ప నీరు కనిపించదు. నదిలో బోరింగుల ద్వారా, చలమల ద్వారా నీరు తోడు కుంటున్నారు. ఈ ఫల్గుణి నది యిక్కడ అంతర్వాహిని కావటానికి ఒక పురాణగాధ చెపుతారు. రావణవధానంతరము శ్రీరాముడు పట్టాభిషిక్తుడై తన తండ్రి

దశరథునకు సద్గతులు కలిగించుటకు గయలో శ్రాద్ధకర్మ నిర్వహించదలచి సతీ సమేతంగా యిక్కడికి వచ్చాడట. ఫల్గుణీ నది ఒడ్డున వారు విడిది చేసి శ్రాద్ధ కర్మలకు కావలసిన సామగ్రి తెచ్చుటకు శ్రీరాముడు బజారుకు వెళ్లెనట. అపరాహ్ణ సమయము వరకు రాముడు తిరిగి రానందున దశరథుడు సమయమునకు విచ్చేసిన వాడై అపరాహ్ణ సమయము దాటి పోతున్నదని తొందర పెట్టాడట. అప్పుడు జగన్మాతయైన సీతమ్మ ఇసుకతో మూడు పిండములు చేసి అర్పించగా వానిని గ్రహించి దశరథుడు అంతర్ధానమైనాడని, తదుపరి శ్రీ రాముడు విచ్చేసి జరిగిన వృత్తాంతము తెలుసుకొని నమ్మజాలక సీతమ్మను రుజువు పరచమని కోరెనట. ఆ మహా సాధ్వి తన చర్యకు సాక్షులుగా 1) ఆ ఫల్గుణీ నదిని 2) ఒక బ్రాహ్మణుని 3) మరియు ఒక గోవుని కోరుకొనెనట. దురదృష్టవశాత్తు పై ముగ్గురు వాస్తవానికి వ్యతిరేకముగా సాక్ష్యమిచ్చిరట. సీత ఆగ్రహము చెంది ఫల్గుణీ నదిని అంతర్వాహినిగాను, బ్రాహ్మణుని నిత్యయాచకునిగాను, గోవు ముఖము అపూజనీయముగాను శపించెనట.

ఇక్కడ శ్రాద్ధ మొనరింప వలసిన ఘట్టములు ఎన్నో వున్నవి. మేము ముఖ్యమైన ఫల్గుణీ నది ఒడ్డున విష్ణు పాద ఘట్టమనే అక్షయ వట వృక్షము క్రింద శ్రాద్ధకర్మ, పింగ ప్రదానము లాచరించుట జరిగినది. తుదకు జీవితంలో అతి ముఖ్యమైన, మరియు జీవితాంతము ఆచరించు ఒక కర్మ ఘట్టము ఆచరించితిమని తృప్తి చెందాం. సాంప్రదాయం ప్రకారం ఆ చోట ప్రతి ఒక్కరు తనకు అన్నిటిలో అతిప్రీతికరమైన ఒక పండు, ఒక కాయ మరియు ఒక కూరను ఆ రోజు నుండి జీవితాంతము త్యజించుటకు వాగ్దానము చేయవలసి వుండును. యాత్రికులందరు వారి వారి యిష్టానుసారం త్యజించినారు. ఈ నియమాలన్ని ఎందరు పాటింతురో తెలియదు. పై కార్యక్రమాలన్ని ముగించుకునే వరకు కాలా తీతమైంది. ఈ రోజు కూడ ఎండ చాల తీక్షణంగా వుంది. నేను గయలో నాకు అతిప్రీతికరమైన గోంగూర, వంకాయ, జామ పండు త్యజించుటకు విష్ణు పాదముల దర్శనం చేసుకొని తీర్థప్రసాదములు స్వీకరించి రిక్షాలలో అక్కడికి 3,4 కిలోమీటర్ల దూరంలో వున్న రైలు స్టేషన్ చేరుకొని డబ్బాలలోనే భోజనాలు చేసుకొని విశ్రాంతి తీసుకున్నాం.

మా రైలు సాయంత్రం 5 గం ||లకు పవిత్ర గంగా నదీ తీరమందున్న విశ్వనాథ క్షేత్రము కాశి (వారణాశి) నగరాభి ముఖంగా పయనించింది. మేము వారణాశి చేరే వరకు తెల్లవారు ఝూమైంది. తెల్లవారే వరకు ప్లాట్‌ఫారమ్ మీదనే విశ్రాంతి తీసుకున్నాం.

30-4-78 వారణాశి (కాశి)

ఉదయాన్నే లేచి టాక్సీలలో రాంకుమార్ జోషి పాండా గారి గంగాధర శాస్త్రి సత్రానికి వెళ్లి బస ఏర్పాటు చేసుకున్నాం. ఈ సత్రం పవిత్ర గంగా నది ఒడ్డున మణి కర్ణిక ఘాట్ సమీపంలో వున్నది. అన్ని వసతులు కలిగిన గదులు యిందులో వున్నాయి. విశ్వనాథ దేవాలయానికి సమీప దూరములో వున్నది. మా జీవితంలో మొదటి సారిగా పవిత్ర గంగానదిలో అందరం స్నానమాచరించాం. విశ్వనాథ దేవాలయానికి వెళ్లి దర్శించు కున్నాం. ఇరుకైన బాటలు, రిక్షాలు గాని, టాంగాలు గాని వెళ్ల వీలు లేదు. ముసలి వారైనా, పసి పిల్లలైనా, చేత కానివారైనా నడిచి వెళ్ల వలసిందే. సర్వేశ్వరుని మా జీవితంలో మొదటి సారిగా మనసారా సేవించి ప్రక్కనే వున్నటు వంటి విశాలాక్షి, అన్నపూర్ణ దేవాలయాలను కూడ దర్శించు కున్నాం. ఎక్కడ చూచినా శివమయమే. దారి పొడవునా, అడుగడుగునా శివలింగాలే. ఈ రోజు కూడ ఎండ తీక్షణంగా వున్నప్పటికి వారణాశికి పది కిలో మీటర్ల దూరంలో గంగకు ఆవలి ఒడ్డున వున్న వ్యాసకాశి దర్శించుటకు పడవలలో ప్రయాణించాం. పడవలలో ప్రయాణం చేయటం యిది మాకు ప్రధమ అనుభవం. అందులో గంగ మీద కాబట్టి మొదలు నాకు భయం వేసింది. తరువాత మా ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా అనుపించింది. వ్యాసకాశిలో అష్టాదశ పురాణాలను భారత భాగవతాదులను రచించిన వేదవ్యాసుడనే పేరు గాంచిన సాత్యవతేయుని దేవాలయం వున్నది. వేద వ్యాసుని పుత్రుడు, పరీక్షిన్మహారాజుకు భాగవతాన్ని వినిపించిన శుక మహర్షి ఆలయం కూడ యిచ్చట కలదు. పూర్వం కాశీ దేశాన్ని పాలించిన మహా రాజుల కోట ఎంతో వైభవో పేతంగా వుంది. ఈ కోటలో ఆనాటి రాజులు ఉపయోగించిన వస్తు సముదాయంతో ఒక మ్యూజియం వుంది. వెనుకటి రాజులు ఉపయోగించిన

విచిత్ర సామగ్రి, మేనాలు, పల్లకీలు, దుస్తులు, తుపాకులు, ఖడ్గములు వగైరా ఈ మ్యూజియంలో చూడ వచ్చును. ఈ కోటకు అనుకొని గంగానది ప్రక్కనే మూడు శివాలయాలు కలవు. ఈ ఆలయములలోని లింగాలు తామ్ర లింగాలు.

భారత దేశ మాజీ ప్రధాని కీ॥శే॥ లాల్ బహదూర్ శాస్త్రి గారి జన్మ స్థానం వ్యాసకాశి. అయన నివసించిన చిన్న భవనం దర్శనీయ స్థలంగా వుంది. వ్యాసకాశి వద్ద గంగా నదిపై ఒక విచిత్రమైన వంతెన నిర్మించబడి యున్నది. ఈ వంతెన పెద్ద పెద్ద పొడవైన ఇనుపరేకు పీపాలతో జోడించి నిర్మించ బడివున్నది. డ్రమ్ములతో నిర్మించ బడ్డ వంతెన ఒకే లెవల్ (levelలో) నీళ్లపైన తేలి వుంటుంది. డ్రమ్ములపై భాగం మీద చెక్కల తో మరియు రేకుతో చదునుగా అమర్చబడ్డది. అట్టి డ్రమ్ముల ప్రక్కభాగములు బలమైన తీగలతో జాయింటు చేయబడి రెండు వరుసలలో కట్టబడిన abetments తో ఈ తీగలు గట్టిగా కట్ట బడినవి. ఈ వంతెనపై ఏక కాలములో జన సమూహము, లారీలు, కార్లు, బస్‌లు వెళ్లుతూ వుంటవి. ఈ వంతెనలోని విచిత్రమేమంటే గంగానదిలో ప్రవాహం వచ్చి నీటి మట్టం ఎంత స్థాయికి పెరిగినా, అదే లెవల్ (level) కు మొత్తం డ్రమ్ములు, బ్రిడ్జి పెరుగుతూ వుంటుంది. బహుశ ఇది బ్రిటిష్ వారి హయాంలో నిర్మించ బడి వుంటుంది. ఈ వంతెన నిర్మాణంలో గొప్ప సాంకేతిక నైపుణ్యం లేనప్పటికీ ప్రతి మానవుడిని, ఊహ ప్రపంచంలో పడవేస్తుంది. మేమంతా తిరుగు ప్రయాణం గావించుకుని 7గం॥ సమయమునకు మా వసతి గృహమునకు చేరుకున్నాం. వ్యాసకాశి దర్శించనిదే కాశి యాత్ర ఫలితం లభించదని అంటారు. మేము వ్యాసకాశి దర్శించుకొని తృప్తి చెందాం. ముక్తిని యివ్వటం ఆ విశ్వేశ్వరుని దయ.

బనారస్ 1-5-78

కాశీలో కూడ శ్రాద్ధకర్మ లాచరించటం ముఖ్యం. యాత్రికులందరూ మణికర్ణికా ఘట్టంలో శ్రాద్ధకర్మ లాచరించుతారు. మేము కూడ అదే ఘట్టంలో జరుపుకున్నాం. ఇక్కడ శ్రాద్ధ తంతు అంతా ఒక పల్లెటూరి బడిలాగ వుంటుంది. యాత్రికులందరిని వరసగా కూర్చో పెట్టటం, ఒకే బ్రాహ్మణుడు తాను చెప్పిన మంత్రం అందర్నీ చెప్పమనటం, తాను పలికిన మాటలు అందరితో పలికించటం తాను క్రియ చేస్తూ అందరిని అలా చెయ్యమనటం జరుగుతుంది. నచ్చినా, నచ్చక పోయినా , ఇష్టం వున్నా, లేక పోయినా చెయ్య వలసినదే. అందరూ యిదే పద్ధతులనుసరిస్తారు. మేము ఈ తంతు అంతా పూర్తి చేసుకొని అక్కడే వున్న నూతిలో నీళ్ల చేదుకొని స్నాన మాచరించి దశదానములు వగైరా కొన్ని ప్రత్యక్షముగాను కొన్ని పరోక్షముగాను చేసుకొని అందరం సత్రమునకు చేరుకున్నాం. ఈ రోజు సాయంత్రం బనారస్‌లో వున్న ముఖ్య దేవాలయాలు, ఇతర ముఖ్య ప్రదేశాలను దర్శించుటకు బయలు దేరాం. మొట్ట మొదటగా కాల భైరవుడి దేవాలయాన్ని దర్శించు కున్నాం. తర్వాత దర్శించింది హరిశ్చంద్ర ఘట్టం. హరిశ్చంద్ర మహారాజు కాశిరాజునకు తాను అమ్ముడు పోయి, ఈ ప్రదేశమందే కాటి కాపరిగా నియమింపబడతాడు. తుదకు తన కుమారుడైన లోహితుడిని దహన సంస్కారములు జరుపుటకు చంద్రమతి తీసుకొనిరాగా, ఆమె వద్ద డబ్బు లేక కాటి సుంకము చెల్లించలేని స్థితిలో వుండగా హరిశ్చంద్రుడు ఆమె మెడలోని మంగళ సూత్రము అమ్మి సుంకము క్రింద యిమ్మని కోరినట్లు ఇతిహాసము కలదు. అందుకే ఈ ఘట్టానికి హరిశ్చంద్ర ఘట్టమని పేరు వచ్చి వుండ వచ్చు. తదుపరి కామ కోటీశ్వరాలయం, హిందూ విశ్వవిద్యాలయం, దాని ప్రక్కన వున్న బిర్లా మందిరం దర్శించుకున్నాం. బిర్లా మందిరం ప్రముఖ పారిశ్రామిక వేత్త G.D. (Birla) బిర్లాచే నిర్మింప బడిన పెద్ద భవనము. ఈ మందిరములో అనేక పాలరాతి విగ్రహములున్నవి. ఈ మందిరం ముందు భాగమున శ్రీ మదన మోహన్ మాలవ్యా గారి పాల రాతి విగ్రహ మున్నది. తదుపరి సంకట విమోచన హనుమాన్ దేవాలయాన్ని దర్శించాం. ఎక్కడో మూలన హరిజనవాడలో వున్న గవ్వలమ్మ దేవాలయాన్ని కూడ దర్శించాం.

ఎక్కడో మూలన హరిజనవాడలో వున్న గవ్వలమ్మ దేవాలయాన్ని కూడ దర్శించాం.

దుర్గ, లక్ష్మి, కాళి ఆలయాలను దర్శించాం. మేము తుదకు దర్శించింది శ్రీ లక్ష్మి నారాయణ తులసీ మానస మందిరం. ఇది రెండతస్థుల భవనం. పై అంతస్థులో రామాయణ భారత భాగవతాలలోని చిత్రాలు విద్యుత్ సహాయంతో ఆడుతూ పాడుతూ, నృత్య గానములు సలుపుతూ వుండటం దర్శించాం. వాటిలో ముఖ్యమైనవి కంసుని వధ, శ్రీ కృష్ణ లీలలు, వసుదేవుడు యమునా నదిని కృష్ణుని తీసుకొని దాటుట మరియు రామాయణంలోని అనేక గాధలు, భక్త మీరా బాయి కృష్ణ భక్తితో తన్మయత్వం చెంది నృత్యం, గానం చేయుట మొదలగు ఎన్నో ఘట్టాలు కనుల పండుగగా చూచి ఆనందించాం.

కాశి 2-5-78

ఈ రోజు విశ్వనాధునకు రుద్రాభిషేకం, విశాలక్ష్మి, అన్నపూర్ణలకు కుంకుమార్చన చేయించాం. పూజలు నిర్వహించుటలో మనకు ఔత్తరాహులకు ఎంతో భేదం వుంది. పట్టుమని పది నిమిషాలైనా పూజ చేసినట్లు వుండదు. అందుకే కాబోలు ఉత్తరాదిలో స్థల ప్రాముఖ్యమేకాని క్రియా ప్రాముఖ్యం వుండదంటారు. ఈ రోజు పగలు మా మానేజిమెంటు వారు బీదలకు ఏర్పాటు చేసిన అన్నదానంలో యాత్రికులు చాలమంది వారి వారి శక్త్యనుసారం వెచ్చించి పాల్గొని కృతార్థులైనట్లు అనుభూతి పొందారు. కాశీలో అన్నదానానికి చాల ప్రాముఖ్యత వున్నది. సత్రంలో అన్నాలు వండి, వండిన అన్నం కుప్పగా పోసి ముత్తైదువలు పూజలు జరిపి, బీదలకు, కుంటి, గ్రుడ్డి వారికి స్వయంగా చేతుల మీదుగా వడ్డించి వారిని తృప్తి పరచామన్న సంతృప్తిని చెందటం ఎంతో ఆనందం కలిగించింది. అన్నదానం పద్ధతి ఏర్పాటు చేసిన మా మేనేజరు నారాయణరావు గారికి మా కృతజ్ఞతలు తెలుపు కున్నాము. కొందరు బీదలకు తమ చేతనైన వస్త్రదానాలు కూడ చేసారు.

ఈ రోజు సాయంత్రం శ్రీ రామ తారక ఆంధ్రాశ్రమంను దర్శించాం. ఈ ఆశ్రమం శ్రీరామ ధర్మేంద్ర సరస్వతీ స్వాములవారి ఆధ్వర్యంలో వుంది. ఈ స్వాముల వారు వయో వృద్ధులు. వీరు ఎంతో శ్రమపడి, ఆంధ్రరాష్ట్రం ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, వరంగల్, హైద్రాబాదు జిల్లాలలో చందాలు వసూలు చేసి గొప్ప సత్రం అన్ని వసతులతో నిర్మించి ఆంధ్ర జనావళికి శాశ్వతంగా ఎనలేని సేవ చేసారు. బహుశ ఆంధ్రుడైన వాడు ఈ సత్రానికి వెళ్ళకుండా, ఈసత్రంలో మకాము పెట్టకుండా వుండటం అరుదు. యాత్రకై వచ్చే ప్రతి ఆంధ్రుడూ ఈ ఆశ్రమాన్ని తప్పక దర్శిస్తాడు. ఆంధ్రులు ఇదొక మహద్భాగ్యంగా భావిస్తారు.

బనారస్ 3-5-78

ఈ రోజు వారణాశికి 5, 6 మైళ్ళ దూరంలో వున్న సారనాథ్‌కు వెళ్లాం. ఇచ్చట బుద్ధ భగవానుడు తొలిసారిగా తన అహింసా వాణిని శిష్యులకు వినిపించాడు. బుద్ధ భగవానుని అనుయాయుడైన అశోక చక్రవర్తి తన మత విజృంభణకు చిహ్నంగా యిక్కడ ఒక విజయ స్తంభం ప్రతిష్ఠించాడు. దానినే మన భారత ప్రభుత్వం ప్రభుత్వ చిహ్నంగా (symbol) స్వీకరించింది. ఈ చిహ్నంపై నాలుగు వైపుల నాలుగు సింహాలు, మధ్యలో ధర్మచక్రం వుంటుంది. బుద్ధ గయలో మాదిరి యిక్కడ కూడ థాయ్‌లాండు, జపాన్ మొదలగు దేశాల వారు ఏర్పరచిన బౌద్ధారామాలు, చైత్యాలు ఎన్నో వున్నాయి. వాటిలో యెక్కువగా పాలరాతితో నిర్మింప బడినవే.

వారణాశి 4-5-78

ఈ రోజు ఉదయం పవిత్ర గంగానదిలో పడవ ప్రయాణం చేశాం. ఈ ప్రయాణం కేవలం విహారం కోసమే కాక వారణాశిలో గంగా భవానిపై గల అరుదైన స్నాన ఘట్టాలను దర్శించాం. దర్శించటమే కాక అన్ని ఘట్టాలలో స్నానం చేశాం. వీటిలో హరిశ్చంద్ర, మణి కర్ణిక మొదలైన పౌరాణిక ఘట్టాలే కాక లాల్ బహదూర్

శాస్త్రి లాంటి భారతా వని ముద్దు బిడ్డల పేర్లు కూడ కొన్ని ఘట్టాలకు వున్నాయి. ఇవన్నీ గంగా నదీ తీరంలో 5, 6 మైళ్ల పొడవున వుంటాయి. మా యీ ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఆనందదాయకంగా సాగింది. మా బసకు చేరుకుని, భోజనాలు చేసి, సామాన్లు సర్దుకొని, సాయంత్రం వరకు రైలుస్టేషన్‌కు చేరు కున్నాం. మా రైలు బయలు దేరి 12 గంll వరకు ఫైజాబాద్ చేరుకుని అక్కడ నుండి అయోధ్యకు చేరే వరకు బాల భానుని అరుణ కిరణాలు భాస్కర వంశ సంభూతుడైన శ్రీ రామునికి మేలుకొలుపులు పాడుతున్నాయి.

అయోధ్య 5-5-78

అయోధ్య చాల పురాతనమైన పట్టణం. అయోధ్య అంటే యోధులకు కూడ అలవి కానిది అని అర్థం. చరిత్ర ప్రసిద్ధులైన ఇక్ష్వాకు వంశస్థులు పాలించిన పట్టణం అయోధ్య. శ్రీరామచంద్రుని పాద ధూళితో పవిత్రమైన స్థల మిది. ఇది సరయూనది యొడ్డున వుంది.

ఈ సరయూ నదే శ్రీ రామచంద్రుని తనలో ఐక్యము చేసుకున్నది. మేమంతా పవిత్ర సరయు నదిలో స్నాన మాచరించి రఘుకుల తిలకుని దర్శించు కున్నాం. అంతా రామ మయమే. పట్టణ మంతా రామాలయాలే. అన్నీ పురాతన కట్టడములుగా నిలచి వున్నవి. ఈ పట్టణంలో తిరుగుతుంటే రామాయణ గాధ కనులకు కట్టినట్లు కానవస్తుంది. ఇక్కడ మేము ఒక విచిత్రమైన విశేషాన్ని తెలుసుకుని, ఆ ప్రదేశాన్ని కండ్లతో చూశాం. హిందువులు పవిత్రంగా భావించే శ్రీ రామ జన్మ భూమిలో మహమ్మదీయ చక్రవర్తి బాబరు కాలంలో ఒక మసీదు నిర్మించారట. మహమ్మదీయ సామ్రాజ్య పతనానంతరం ఆంగ్లేయ ప్రభువుల కాలంలో హిందువులు కొంత చోటు ఆక్రమించుకుని ఆ స్థలంలో అఖండ జ్యోతిని వెలిగించారు. అప్పటి నుండి యిరు వర్గాల వారికి కోర్టులో వ్యవహారములు నడుస్తున్నవని నేటి వరకు అవి అపరిష్కృతముగానే వున్నాయని తెలుసుకున్నాం. అక్కడి దేవాలయాలకు గోపురాలు లేవు. అయోధ్యలోని దేవాలయాలు అన్నీ డాబాల వలె వుంటాయి. మిగతా చోట్ల దేవాలయాలకు అయోధ్యలోని దేవాలయాలకు గల యీ తేడాను అయోధ్య యొక్క ప్రత్యేకతగా గమనింప

వచ్చును. బాబరు కాలం నుండి ఔరంగజేబు వరకు హిందువులపై మొగలాయి చక్రవర్తులు జరిపించిన హింసా కాండలో అధిక భాగం సిక్కులు పాల్గొని బలైపోయినట్లు శ్రీ రామ జన్మ భూమి గురించి చరిత్ర తెలుపుతోంది. శ్రీ రామ జన్మ స్థానమైన ప్రదేశంలో బాబరు చక్రవర్తి మసీదు నిర్మించటానికి అభ్యంతర పరచిన హిందువులను వేల సంఖ్యలో హతమార్చినట్లు స్వయంగా బాబరు నామాలో వ్రాయ బడివున్నది. స్థానిక కార్యకర్తల అభ్యర్ధనపై మా యాత్రీకులు ఎవరంతట వారు తమకు తోచిన ఆర్థిక సహాయం చేసారు.

అయోధ్యా నగరంలో అనేక వందల కట్టడములున్నాయి. కొన్ని శిధిలావస్థలో వున్నాయి. కొన్ని పునర్నిర్మాణములో వున్నాయి. శిధిలావస్థలో వున్న కట్టడాలు త్రేతాయుగం నాటి వేమో నన్న సందేహం యాత్రికులకు కలుగక మానదు. వెడల్పైన వీధులు ఎత్తైన రాజభవనాలు, ఎత్తైన ప్రహరీ గోడలతో ప్రతి భవనానికి ఏదో ఒక పేరు కలిగి వుంటాయి. ఉదాహరణకు కౌసల్యా భవనమని, కైకేయి అలంకార గృహమని యింకెన్నెన్నో పేర్లుగల భవనాలు అన్ని శిధిలావస్థలోనే వున్నాయని చెప్పవచ్చు. భోజనానంతరం మా రైలు అలహాబాదుకు బయలు దేరింది. రాత్రి పదిగంటలకు అలహాబాదు చేరుకుని ఆ రాత్రి స్టేషన్‌లోనే వున్నాం. విశ్రాంతి తీసుకుంటూ కాలం గడిపాం.

అలహాబాద్ 6-5-78

స్టేషన్ లోనే కాలకృత్యాలు తీర్చుకొని, చీకటిలోనే రిక్షాలలో బయలుదేరి త్రివేణీ సంగమానికి వెళ్లాం. రిక్షాలు యమున ఒడ్డు వరకే వెళ్లాయి. అక్కడ నుండి పడవలలో యమునా గంగా నది సంగమించిన ప్రదేశం ఆవలి ఒడ్డుకు వెళ్లాం ఇది ప్రశాంతమైన ప్రదేశం. యమున గంగా నదుల పైనుంచి వచ్చే చల్లని పిల్లగాలులు మనసుకు ఆహ్లాదం కలిగిస్తుంటే ప్రాతః కాలంలో పడవలపై ప్రయాణం ఆనంద కరంగా వుంది. ఇక్కడ మేము పితరులకు పింద ప్రదానం చేసాం. వేణీ గంగా పూజలు చేసాం. వేణీ పూజ, దానం విచిత్ర మైన తంతుతో జరిగే చిత్రమైన పూజ. కొద్దో గొప్పో చిన్న నాటి వివాహ మధుర స్మృతులను జ్ఞప్తికి తెస్తాయి. ఈ ప్రదేశంలోనే పురుషుడు తన భార్యను తన తొడపై కూర్చోపెట్టుకుని

బ్రాహ్మణుడు మంత్రాలు చెపుతుండగా కత్తెరతో చిటికెడు వెంట్రుకలు జడనుంచి కత్తిరించి ఆ ప్రవాహంలో వేస్తాడు. ఆ వెంట్రుకలు ఆ ప్రవాహంలో గుండ్రంగా తిరుగుతూ మునుగుతూ తేలుతూ చివరకు అంతర్ధానమై పోతాయి. గంగా యమునల సంగమం మనం కళ్లారా చూడగలుగుతాము కాని సరస్వతి అంతర్వాహిని అవటం చేత మనకు కనుపించదు. గంగా జలం ఎరుపుగను, యమున జలం నీలివర్ణంలోను కన్పిస్తూ రెండు నదీ జలాల కూడలి కన్నుల పండువుగా వుంటుంది. అక్కడ మా కార్యక్రమాలన్ని పూర్తి చేసుకుని పడవలలో తిరిగి ఒడ్డుకు చేరుకున్నాం.

ఇక్కడికిసమీపంలోయమునఒడ్డునఒకదేవాలయంవుంది.అక్కడదర్శనం చేసుకుని తిరిగి టాంగాలలో అలహాబాదు పట్టణం చూడటానికి బయలు దేరాం. అలహాబాద్‌లో చెప్పుకో తగ్గ పెద్ద దేవాలయా లేమి వున్నట్లు తెలీదు. భరద్వాజ ఆశ్రమానికి వెళ్లి దర్శనం చేసుకున్నాం. ఇది అతి సామాన్య మైన ప్రదేశమే ఆనంద భవన్, స్వరాజ్య భవన్ యీ రెండూ అలహాబాదులో చూడ దగిన ముఖ్య ప్రదేశాలు. ఈ రెండూ స్వతంత్ర భారత దేశపు తొలి ప్రధాని పండిత జవహర్ లాల్ నెహ్రూ గారి తండ్రి మోతీలాల్ నెహ్రూ గారిచే నిర్మించబడ్డాయి. వీటికి ఎంతో రాజకీయ చరిత్ర వుంది. స్వరాజ్య భవనంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కార్యాలయం పెట్టి నడపటానికి మోతీలాల్ నెహ్రూ అనుమతి నిచ్చారు. స్వరాజ్యము వచ్చేవరకు ఆ కార్యాలయము ఆ భవనంలోనే వుండేది. ఆనంద భవన్‌లో ఎ.ఐ.సి.సి. కమిటీ సమావేశాలు తరచుగా జరుగు తుండేవి. ఆనంద భవన్‌లోనే శ్రీ మతి ఇందిరా గాంధీ పుట్టి, పెరిగి, పెద్దదైంది. స్వరాజ్య భవనాన్ని పండిత జవహర్ లాల్ నెహ్రూ, ఆనంద భవనాన్ని శ్రీమతి ఇందిరా గాంధీ దేశానికి అంకితం చేసారు. ఇప్పుడు ఈ రెండు భవనాల్లో మ్యూజియంలు నడప బడుతున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే యీ భవనాలు నిర్మించిన మోతీలాల్ నెహ్రూ, వాటిని దేశానికి అంకితం చేసిన పండిత జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ధన్యజీవులు. అక్కడ నుండీ హైకోర్టు, యూనివర్శిటీ భవనాలు చూస్తూ స్టేషన్ చేరుకున్నాం. అదే రాత్రి మా రైలు ఆగ్రా చేరుకునే వరకు చాల పొద్దు పోయింది.

ఆగ్రా 7-5-78

ఈ రోజు ఉదయం 10 గంll ల వరకు భోజనాలు ముగించుకుని టాక్సీలలో బయలు దేరాం. అక్కడ వున్న కట్టడాలలో అధిక భాగం ఆగ్రా రాజధానిగా దాదాపు 200 సంll లు పరిపాలించిన మొగలాయీ చక్రవర్తులు నిర్మించినవే. మొదలు మేము యిక్కడకు 30 మైళ్ల దూరంలో వున్న ఫతేపూర్‌కు వెళ్లాం. ఈ పట్టణం అక్బర్ చక్రవర్తి నిర్మించింది. ఇక్కడ ఆయన తన నివాసానికి అనువుగా ఒక కోట నిర్మించుకుని రాజ్యపాలన చేసారు. నేటికీ అది చెక్కు చెదర కుండా వుంది. దర్బార్ ఆమ్, దర్బార్ ఖాన్, రాజులు, రాణులు వుండే గదులు అనేకం వున్నాయి. పురావస్తు శాఖ వారు ఈ కోటను ఎప్పటి కప్పుడు మరమ్మతు చేస్తూ మంచి స్థితిలో వుంచారు. అక్బరు చక్రవర్తి ఈ కోటలో సుమారు పది సంll కాలమే నివసించినట్లు చరిత్ర తెలుపు తోంది. తరువాత దైవికంగా ఏర్పడిన నీటి కొరత వల్ల తప్పని సరిగా మకాం ఆగ్రాకు మార్చవలసి వచ్చింది. ఆగ్రాకు మార్చుకుని, యమునా నది పక్కనే మరొక కోట నిర్మించు కున్నారు.

ఫతేపూర్ కోట పక్కనే మరో పెద్ద భవనం వుంది. దీన్ని "సిక్రీ" అంటారు. అక్బరు చక్రవర్తి తన సంరక్షకుడు, గురువు ఆయిన "బహరాంషాసిక్రి" సమాధి ఈ భవనంలో నిర్మించాడు. ఇక్కడి దర్శనీయ స్థలాల్లో యిది ముఖ్యమైనది. దీనికి చుట్టూ ఎత్తైన ప్రాకారం వుంది. లోపల ఒక ప్రక్కన బహరాంషా ఖాన్ సమాధి వుంది. ముస్లింలచే యిది పవిత్ర స్థలంగా భావింప బడుతోంది. సమాధి ఎదురుగా 350 అ.ల. ఎత్తుగల ఒక ముఖ ద్వారం యిప్పటికి చూపరుల నాకర్షిస్తోంది. ఈ భవనం కట్టబడి సుమారు మూడు వందల సంll అయినప్పటికీ ఏ మాత్రం చెక్కు చెదర లేదు.

తర్వాత ఆగ్రా పట్టణానికి 4, 5 మైళ్ళ దూరంలో ఢిల్లీకి వెళ్లే మార్గంలో అక్బరు చక్రవర్తి సమాధిని దర్శించాం. ఇది కూడ చాల గొప్ప హర్మ్యం. దీని చుట్టూ పెద్ద ప్రాకారాలు, మధ్యన అక్బరు చక్రవర్తి సమాధి వుంది. దీని చుట్టు తోటలు, పచ్చిక బయళ్లు వున్నాయి. అక్బరు చక్రవర్తి జీవిత కాలం లోనే చాలవరకు ఈ సమాధి

నిర్మింప బడినట్లు చరిత్ర చాటు తోంది. అక్బరు తదనంతరం ఇది అతి సుందరంగా పూర్తి చేయ బడ్డది.

హస్త కళల శాఖ (Handl Crafts Department) నకు సంబంధించిన వ్యాపార కేంద్రంలో పాలరాతితో చేయ బడ్డ అనేక చిత్ర విచిత్రమైన బొమ్మలు, పనిముట్లు అమ్ముతారు. వాటి విలువ కూడ చాల ఎక్కువగా వుంటుంది. శ్రీమంతులు తమ భవనాలలో ప్రదర్శన కొరకు వాటిని తీసుకు వెళ్తారు. మేము రెండు చపాతి రాళ్లు కొన్నాం.

తరువాత ఆగ్రాకోటను దర్శించాం. భారత దేశంలో వున్న కోటలలో అతి పెద్దది, గొప్పది అయిన ఈ కోట అక్బరు చక్రవర్తిచే నిర్మింప బడింది. అక్బరు చక్రవర్తి తరువాత పాలించిన మొగలాయీ చక్రవర్తులు కూడ ఈ కోటలో వుండి రాజ్యము పరిపాలించారు. ఈ కోటలో దర్బార్ అమ్, దర్బార్ ఖాస్ హాళ్లు, స్వర్ణ మణి ఖచిత మయూరసింహాసనం నెల కొల్ప బడ్డ ప్రదేశం, ఔరంగజేబు చక్రవర్తి తన తండ్రి షాజహాన్ చక్రవర్తిని ఖైదు చేసిన ప్రదేశం, పెద్ద పెద్ద నేరస్థులను సింహాలతో పోరాడటానికి నిర్మించిన "ఎరీనా" చూసాం. షాజహాన్ తనను బంధించిన ప్రదేశంలో అక్కడ గోడకు అమర్చిన ఒక చిన్న అద్దము గుండా తన ప్రేయసి స్మృతి చిహ్నంగా నిర్మించిన తాజ్ మహల్ భవనాన్ని కళ్లారా చూస్తూ తన చివరి రోజులు గడిపినట్లు వాడుక. దీనిని యింకా వివరంగా విమర్శనాత్మకంగా చూడాలంటే వారం రోజులు పడుతుంది.

అక్కడ నుంచి మేము కోట్ల రూపాయల ఖర్చుతో, పాలరాతితో నిర్మించ బడుతున్న "రాధా స్వామి" వారి సమాధి వద్దకు వెళ్లాం. దీని నిర్మాణం సుమారు 50సం॥ క్రితమే మొదలైంది. నేటి వరకు అవిరామంగా నిర్మాణం సాగుతున్నా ఇది పూర్తయేసరికి యింక 30, 40 సం॥ పట్టు వచ్చునని అక్కడి శిల్పులు చెప్పారు. దీని నిర్మాణం పూర్తయ్యే వరకు అప్పటికి భారతదేశంలో వున్న గొప్ప కళా ఖండాల్లో కెల్ల గొప్పదిగా వుంటుందని అక్కడ పని చేసే కళాకారులు చెప్పారు.

తర్వాత చేతి పనుల ప్రదర్శన శాల చూసి తాజ్‌మహల్‌కు వెళ్లాం. ఇది ప్రపంచంలో వున్న ఏడు వింత కట్టడములలో ఒకటి. ఇది షాజహాన్ చక్రవర్తి

తన ప్రియమైన భార్య ముంతాజ్ బేగం స్మృతి చిహ్నంగా దీనిని నిర్మించాడు. యమునా నది ఒడ్డున పచ్చిక బయళ్లతో విలసిల్లే వందల యెకరాల మైదానంలో పలుదేశముల నుండి వచ్చిన కళాకారుల చేత కోట్ల రూపాయల ఖర్చుతో అత్యంత సుందరంగా నిర్మించ బడ్డ గొప్ప హర్మ్యం. ఇందులో షాజహాన్, బేగంల సమాధులున్నాయి.ఈ కట్టడంపూర్తిగాపాలరాతితోకట్ట బడింది. వెన్నెల రాత్రులలో ఈ తాజ్ మహల్ చూడటానికెంతో కన్నుల పండుగగా వుంటుందని అంటారు. అక్కడ నుండి మేము మొగల్ గార్డెన్సు బయట నుంచే చూచి దీపాలు పెట్టే సమయానికి స్టేషనుకు చేరుకున్నాము. ఆగ్రా పట్టణం, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలు ముస్లిం సంస్కృతికి ఆట పట్టు. వైభవో పేతంగా వున్న భవనరాజాలతో విలసిల్లే ఈ సుందర నగరం దర్శించడం జీవితంలో మరపురాని మధురానుభూతి. మా రైలు రాత్రి 10 గంllలకు బయలు దేరి బృందావన విహారి గోకుల కృష్ణుని నివాస నగరం మధురవైపు ప్రయాణం సాగించింది.

మధుర, గోకుల్ బృందావనం 8-5-78

మేము మధుర చేరే వరకు ఉదయం 5-6 గంటలైంది. వెంటనే యమునా నదికి వెళ్లి స్నానాలు చేసి దేవకీ వసుదేవుల దేవాలయం దర్శించాం. తరువాత సమీపంలో వున్న మరొక కృష్ణ దేవాలయాన్ని దర్శించి, అక్కడికి సుమారు పదిమైళ్ల దూరంలో వున్న గోకుల్‌ను దర్శించాం. ప్రస్తుతం ఈ ప్రదేశ మంతా పాడు బడి వున్నది. అక్కడక్కడ కూలిపోయిన కట్టడాలు కన్పించినప్పటికి పల్లె ప్రాంతంలో మిగిలి వున్న నంద యశోదల దేవాలయంతో పాటు అనేక చిన్న చిన్న దేవాలయాలు వున్నాయి. అన్నీ కృష్ణ భగవానుని దేవాలయాలే. ఎటు చూసినా పాటిదిబ్బలే. ఆ దిబ్బలను చూస్తే ద్వాపర యుగంలో యిది ఒక మహా పట్టణమై వుండవచ్చునని కాలక్రమేణ శిథిలమై దిబ్బలుగా మిగిలి వుండ వచ్చునని తెలుస్తోంది.

నందుడు ఈ దేశమును పాలించేటప్పుడు శ్రీ కృష్ణ భగవానుని తండ్రి వసుదేవుడికి ఆశ్రయ మిచ్చాడని, వసుదేవుడూ కృష్ణునకు బదులు మాయను వుంచి కృష్ణునితో యమునా నదిని దాటి గోకుల్ చేరాడని పురాణేతి హాసము

వుంది. ఈ రోజు ఎండ చాల తీవ్రంగా వున్నప్పటికీ పగలు 2 గంIIలకే బయలు దేరి 10 మైళ్ల దూరంలో వున్న బృందావనం చేరాము. పదహారు వేల గోపికలతో శ్రీ కృష్ణుడు రాసక్రీడ లాడి ఆనందించిన ప్రదేశం యిది. కాళీయ మర్దనం చేసిన మడుగు, గోపికా వస్త్రా పహరణం చేసిన వృక్షం చూసాం. పురాణేతి హాసమంతా జ్ఞాపకం వచ్చి ఆనందాబ్ధిలో మునిగి పోయాం. బృందావన్‌లో అనేక భజన మందిరాలు, ఆశ్రమాలు వున్నాయి. వేల మంది భక్తులు ఒకే చోట కూర్చుని నిశ్శబ్దంగా భగవధ్యానంలో జపం చేయటం చూసి పరవశించాం. మరొక చోట భక్తులు భజనలు అహర్నిశంగా చేయటం చూసి ఆనందించాం. అంతా కృష్ణమయం. ఆ ప్రదేశమంతా అడుగడుగునా కృష్ణ భగవానుడు తాండవిస్తున్నట్లు వుంటుంది. ఇక్కడ ఒక వేంకటేశ్వర స్వామి దేవాలయం కూడ వుంది. శ్రీనివాసుని దర్శనం చేసుకుని తిరుపతిలో ఏడు కొండల స్వామి దర్శనం చేసుకున్న అనుభూతిని పొందాం. ఒక ప్రదేశంలో విద్యుత్ సహాయంతో కృష్ణ లీలలు, రాధాకృష్ణ రాస క్రీడలు, భక్త మీరాబాయి ఇంకా అనేక సంఘటనలు బొమ్మల రూపంలో చూసి ఆనందించాం. ఆ ప్రదేశంలో యింకా అనేక కృష్ణ దేవాలయాలు నవీన పద్ధతిలో పాలరాతితో కట్టబడుతున్నవి.

కొత్తఢిల్లీ 9-5-78

ఈ రోజు ఉదయం బయలుదేరి మా రైలు భారత రాజధాని ఢిల్లీ నగరం సాయంత్రం 3గం॥ వరకు చేరుకుంది. ఎండ తీవ్రత తగ్గిన తర్వాత పాత ఢిల్లీ రైల్వే స్టేషను సమీపంలోవున్న ఒక హనుమంతుని దేవాలయం దర్శించాం.

క్రీపూ॥మనదేశాన్ని పాలించిన "దిల్లూ"అనే మహారాజుచే నిర్మింపబడ్డ నగరం కావటం వల్ల "ఢిల్లీ" అనేపేరు వచ్చిందని చరిత్ర చెప్తోంది. ప్రస్తుతంవున్న పాత, కొత్త ఢిల్లీలు 15 పట్టణాల కలయిక అంటారు. పాండవుల నాటి హస్తినాపురమే ఢిల్లీ పట్టణం. మొగలాయీ చక్రవర్తి షాజహాన్ తనపేర యీపట్టణాన్ని షహజహాని ఆదాడ అనిపేరు పెట్టాడు కాని అది వాడుకలోకి రాలేదు. షాజహాన్ ఈ పట్టణానికి 5మైళ్లుచుట్టూ పెద్దగోడను, యమునానది ఒడ్డున ఎర్ర రాతితో ఒకకోటను నిర్మించాడు. ఈ కోట అనేక బురుజులతో 14 గేట్లతో నిర్మింపబడింది. దీనినే యిప్పుడు మనం ఎర్రకోట అంటాం. ఈ కోట ముందు బురుజుపై నిలబడి మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి నేటివరకుఆగష్టు 15వ తేదీన మన ప్రధానమంత్రి జాతీయ జండా ఎగురవేసే సాంప్రదాయం ఏర్పడింది. ఈ కోట ముందు సువిశాలమైన మైదానం వుంది. కోట ముందు భాగంలో వెండి బంగారం, ముత్యాల వజ్రాల నగర దుకాణాలున్నాయి. కోట చాల విశాలమైంది. కోటలో అనేక భవనములు ఈ రోజు వరకు చెదరకుండా వున్నాయి. ఈ కోట యమునానది ఒడ్డున వుంది. అనేక విషయాలలో ఈ కోట ఆగ్రాకోటను పోలివుంది. రాజకీయంగా ఆగ్రా కోట కంటె ఢిల్లీ లోని ఎర్రకోటకు ఎక్కువ ప్రాముఖ్యం వుంది. మనకు స్వాతంత్ర్యము రాకముందు ఆజాద్‌హింద్ ఫౌజ్ వారిని దేశద్రోహులనే నేరం మోపి ఈ కోటలోనే న్యాయ విచారణ జరిపారు. ఆ కేసులో భారతదేశంలోని ప్రజ్ఞావంతులైన న్యాయవాదులే కాక పండిత జవహర్‌లాల్ నెహ్రూ కూడా న్యాయవాది దుస్తులు ధరించి వాగ్వాదములు చేసి విప్లవసమర యోధులను విడిపించారు.

కొత్తఢిల్లీ10-5-78

ఉదయాన్నే భోజన కార్యక్రమము ముగించుకుని టాక్సీలలో ముఖ్యప్రదేశాలు చూడడానికి బయలు దేరాము. మొదట మేము చూసింది జంతర్ మంతర్ భవనం. ఇది చాల పురాతనమైన ఖగోళ పరిశోధనశాల. జయపూర్ మహారాజు రెండవ జయసింగ్ చేత 1699-1743 మధ్య కాలంలో నిర్మించ బడింది. ఢిల్లీ లోనే కాక జయపూర్‌లో కూడ యిటువంటిదే మరొక నిర్మాణం జరిగింది. పూర్వం యిటువంటి కట్టడాలతోనే కాలపరిమాణం కొలుస్తూ వుండేవారు. గ్రహ చలనాలు, నక్షత్ర పరిమాణాలు, మొదలుగాగల అనేక ఖగోళ శాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని ఈ జంతర్ మంతర్ భవనాలలో స్పష్టంగా చూడవచ్చు.

ఇక్కడ నుండి మేము బిర్లా వారిచే నిర్మింప బడ్డ లక్ష్మీ నారాయణ దేవాలయాన్ని దర్శించుకున్నాం. ఇది పాలరాతితో నవీన పద్ధతిలో నిర్మింప బడ్డ గొప్పదేవాలయం. ఇక్కడనుంచి మేము పార్లమెంటు భవనానికి వెళ్లాం. భారత దేశానికి చట్టాలు చేసే అధికారం గల లోక్ సభ, రాజ్యసభలు ఈ భవనంలో సమావేశ మౌతాయి. ఇదొక చంద్రా కారం లాంటి కట్టడం. ఈ భవనానికి సమీపంలోనే రాష్ట్రపతి భవనముంది. రాష్ట్రపతి నిలయం చుట్టు మొగల్ గార్డెన్స్ అనే పేరుతో ఉద్యానవనం, పచ్చిక మైదానం వున్నాయి. రాష్ట్రపతి గౌరవనీయశ్రీ నీలం సంజీవరెడ్డి గారు ఆరోజు టూరు వెళ్లినందున వారి దర్శనం చేసుకోలేక పోయినాం. అక్కడికి సమీపంలో వున్న "ఇండియా గేట్"ను దర్శించాం. ఇది 1914 మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్న భారత సిపాయిల స్మృతి చిహ్నంగా నాటి పాలకులైన ఇంగ్లీషువారిచే నిర్మింపబడ్డ ఎత్తైన నాలుగు కమాన్‌లు కలిగి నటువంటి కట్టడం. అక్కడనుండి భారత దేశ ప్రధాని పండిత జవహర్ లాల్ నెహ్రూ గారి అధికార నివాస గృహము "తీన్ మూర్తి భవన్" దర్శించుకున్నాం. ఈ భవన మందే ఆయన అఖండభారత ప్రజానీకానికి సేవ చేస్తూ కన్ను మూసారు. ఈ భవనానికి వెనుక వైపు వున్న ఉద్యానవనంలో పండిత జవహర్ లాల్ నెహ్రూ గారి అఖండ జ్యోతి వెలుగుతూ వుంటుంది. ఈ భవనం వారి స్మృతి

చిహ్నంగా దేశానికి మ్యూజియంగా అంకితం చేయబడింది. నెహ్రూ గారి వందలాది ఛాయాచిత్రాలు, ఆయన గారు నిత్యం వాడుకునే వస్తువులు, సామానులు యిందులో భద్రపరిచారు. ఈ భవనం చాల పవిత్రంగా చూడ బడుతుంది. తర్వాత హుమయూన్ చక్రవర్తి సమాధిని దర్శించాం. హుమయూన్ చక్రవర్తి మరణానంతరం ఆయన భార్య "హమిదా బాను బేగం" 14సంll రాలకాలంలో యీసమాధిని నిర్మింప జేసింది. అక్కడ నుంచి కుతుబ్ మీనార్‌ను దర్శించాం. ఈ మీనార్ పైకి ఎక్కటానికి లోపలి నుంచే మెట్లు నిర్మింపబడివున్నాయి. ఈ మీనార్ ఎత్తు240'లు. క్రీ. శ.1200 సంllలో బానిస వంశపు రాజు కుతుబుద్దీన్ దీనికి శంకుస్థాపన చేసాడు. ఆ తర్వాత సింహాసనానికి వచ్చిన సుల్తాన్ అల్తమష్(1211-1238) చే ఈ మీనార్ నిర్మాణం పూర్తి చేయబడ్డది. ఇదే ఆవరణలో ఒక యినుపస్తంభం కుతుబ్ సాహెబ్ కీ లాల్ అనే పేరుతో వుండివుంది. ఎంతో కాలం క్రితం పాతిన స్తంభం అయినప్పటికి చెక్కు చెదరలేదు. చిలుము, త్రుప్పు పట్టలేదు. మెరువులు మెరుస్తూవుంది. దీనికి కారణం ఈ స్తంభంలో ఉక్కు శాతం100కి నూరుపాళ్లు వుందని అంటారు. తర్వాత ఢిల్లీ పాతకోటను దూరంనుంచి దర్శించాం. ఈ కోట శిథిలావస్థలో వుంది. తర్వాత శిథిలావస్థలో వున్న "ఇంద్రప్రస్థ"ను దర్శించాం. ఎత్తైన మట్టిగోడలు, కూలిపోతున్న కట్టడాలు. అక్కడ నుంచి ఫిరోజ్‌షా కోట్ల వస్తు ప్రదర్శన శాల National Museumను దర్శించాం. ఆ తర్వాత అంతర్జాతీయ బొమ్మల ప్రదర్శన శాలను దర్శించాం. ఈ ప్రదర్శన శాలలో మొత్తం ప్రపంచంలో వున్న మానవ జాతుల బొమ్మలను చూడ గలుగుతాం. ఈ మనుష్యుల బొమ్మలు వివిధరకాల ఆకారాలతో ఎంతో చూడముచ్చటగా వున్నాయి. ఆ తర్వాత భారత జాతి పిత మహాత్మాగాంధి సమాధి "రాజ్ ఘాట్," నెహ్రూ సమాధి "శాంతివన్", లాల్ బహదూర్ శాస్త్రి గారి సమాధి వున్న "విజయఘాట్" లను వరుసగా చూసాం. ఇవన్నీ యమునానది ఒడ్డునే వున్నాయి. తర్వాత ఎఱ్ఱకోటను దర్శించాం. ఎరుపురంగు గల రాతితో నిర్మింపబడ్డది ఈ కోట. ఈ కోట పురాతనమైనదైనప్పటికీ చెక్కు చెదరలేదు. ఈ కోటముందు ప్రాంగణంలో విలువైన వెండి, బంగారు, ముత్యాలు పగడాలు పొదిగిన ఆభరణాల వ్యాపారస్థులు అంగళ్లు

ఏర్పాటు చేసుకుని నగలు, యితర విలువైన వస్తువుల వ్యాపారాలు చేస్తూవుంటారు. ఈ ఎఱ్ఱకోట ముందు సువిశాలమైన మైదానం వుంది. ప్రతి సంవత్సరం ఆగష్టు 15న,ఈకోటపైనున్న బురుజు పైనుంచి భారత ప్రధాని జాతీయ పతాక మావిష్కరించి జాతినుద్దేశించి ఉపన్యసించటం, రేడియోల ద్వారా మనం వింటూనే వున్నాం. తర్వాత జుమ్మా మసీదును దర్శించాం. ఇది భారతదేశంలోని మసీదులలో కెల్ల అతిపెద్దదైన మసీదు. పదిలక్షల వ్యయంతో మొగలాయీ చక్రవర్తి షాజహాన్ కాలంలో నిర్మింపబడ్డది. ఈ మసీదులో ఒక లక్షమంది భక్తులు ఏకకాలంలో నమాజు చేయవచ్చు. చీకటి పడేవరకు ఢిల్లీ నగరం వీధులన్ని చూచాం. స్టేషన్ చేరుకున్నాం. ఢిల్లీ నుండి రైలు రాత్రి గం 8ల్కు బయలు దేరింది. తెల్లవారి గం11.00ల్కు జమ్ము తావి వెళ్లాం.

జమ్ముతావి 11-5-78

ఇది వరలో "కాశ్మీర్" వెళ్లాలంటే పఠాన్కోట వరకు రైలులో ప్రయాణం చేసి అక్కడ నుండి బస్‌లలో వెళ్లవలసి వచ్చేది. కాని యిప్పుడు జమ్ము తావి వరకు రైలు వెళ్తుంది. పఠాన్ కోటనుంచి భూమి ఎక్కుడుగా వుండటం వల్ల రైలు రెండు ఇంజన్లతో నడపబడుతుంది. అయినా చాలనెమ్మదిగా వెళ్లటం గమనించాం. అందువల్ల తెల్లవారి వుదయం 10గంllకు చేరింది మా రైలు, జమ్ము తావికి. పఠాన్కోట నుంచి పాకిస్థాన్ సరిహద్దు అతిసమీపంలో వుంది. హిమవత్పర్వత ప్రాంగణంలోకి చేరుకున్నాం. కాని జమ్ము తావిలో వేడి చాల అధికంగావుంది. ఆ రోజంతా అధిక వేడివల్ల బాధతో గడిపాం.

జమ్ముతావి 12-5-78

జమ్ము రైల్వే స్టేషన్ కొత్తగా నిర్మింప బడ్డది. స్టేషన్ నగరానికి 3,4 కిllమీll దూరంలో వుంటుంది. పగలంతా ఎండ చాల తీవ్రంగా వుండటాన చాల కష్టంగా కాలం గడిపాం. ఎండ తీవ్రత తగ్గింతర్వాత దగ్గరలోని ఒక దేవాలయాన్ని దర్శించాం. పూర్వం జమ్ము కాశ్మీర్ సంస్థానాధీశులు శీతాకాలంలో చలి ఎక్కువగా

వుండటం చేత జమ్ములో కొంత కాలం వుంటూ వుండేవారు. వారికి జమ్ములో రాజ భవనాలు వుండేవి. జమ్ములో హిందువుల సంఖ్య అధికం.

శ్రీనగర్ 13-5-78

ఈ రోజు ఉదయం 5గం||కు కాశ్మీరు రాజధాని శ్రీనగర్‌ను దర్శించటానికి బస్‌లలో బయలు దేరాం. జమ్ము నుండి కాశ్మీర్‌కు 300 కి.మీ. దూరం మధ్యాహ్నం 1.00గం||కు మార్గ మధ్యంలో ఒక రహదారి బంగళాలో భోజన కార్యక్రమాలు పూర్తిచేసుకుని తిరిగి వెంటనే ప్రయాణం సాగించాం. దారి పొడవునా ఎత్తైన చెట్లు. ఎక్కువ ఘాట్ రోడ్డు. చాలా దూరం నది ఒడ్డునే పోతుంటుంది. ఈ రోడ్డు నేపాల్ రోడ్డు కంటే చాలమెరుగు. లోగడవున్న పాత వంతెనలు కూలగొట్టి కొత్తగా విశాలమైన బ్రిడ్జిలను కట్టారు. రోడ్డు అక్కడక్కడా ఇరుకుగావున్నా, మొత్తం మీద విశాలమైన రోడ్డనే చెప్పవచ్చు. 200కి.మీ. వెళ్లాక మా బస్‌లు రెండుమైళ్ల పొడవున్న ఒక టన్నల్‌లోంచి వెళ్లాయి. టన్నల్‌లో ప్రయాణం ఒక ప్రత్యేకమైన అనుభూతితో ఆనందంగా మరుపురానిదిగా వుంటుంది. ఈ టన్నల్‌లో రోడ్డు రెండు బాటలుగా వుంది. ఈ అడవులలో ముఖ్యమైనవి చినార్ చెట్లు. ఈ చెట్లు అతిగుంద్రం గాను చాల ఎత్తుగాను, నిటారుగాను వుంటాయి. చెట్టుకు చెట్టు ఆనుకుని వుంటాయి. శ్రీనగర్ యింకా 30-40 మైళ్ల దూరం వుండగానే విశాలమైన మైదానాలు, పంటపొలాలు వుంటవి. ఇక్కడి పంటలలో ముఖ్యమైనవి శేపులు, కుంకుమపువ్వు, పిస్తా, అఖరోషీ వగైరా. మేము ఈ రోజు సాయంత్రం 7గం||వరకు శ్రీనగర్ చేరుకున్నాం. మా బస జీలం నది సమీపాన బినార్ హోటల్‌లో ఏర్పాటు చేసారు. నిన్నటి రోజు మేము వేడిప్రదేశమైన జమ్ము లోవున్నాము. ఈ రోజు మేము అతి శీతల ప్రదేశమైన శ్రీనగర్‌లో జీలం నది ఒడ్డున ప్రకృతి సౌందర్యావలోకనంలో ఆనంద డోలికలలో వూయల లూగుతున్న అనుభూతిని పొందుతున్నాం. కొంత సేపు విశ్రాంతి తీసుకుని భజన కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఒక రౌండ్ శ్రీనగర్ వీధులలో తిరిగి బస చేరుకున్నాము. చలి అధికంగా వుంది. ఈ రోజు ఒకదుకాణం లోకి అనుకోకుండా చూచి వద్దామని వెళ్లిరూ. 100కు ఒక గట్టి శాలువా కొన్నాం.

శ్రీనగర్ 14-5-78

ఈ రోజు ఉదయం చాలరోజుల తర్వాత వేడి నీళ్లస్నానాలు చేశాం. చలిలో వేడినీళ్ల స్నానం ఎంతో హాయిగా వుంది. తర్వాత మేమంతా ఎవరంతట వారు బ్యాచీలు బ్యాచీలుగా శ్రీనగర్ పట్టణం చూడటానికి వెళ్లాం. శ్రీనగర్ చాల సుందరమైన పట్టణం. భారత దేశానికి యిది తలమానికం వంటిది. ఎక్కడ చూసినా, ఎటు చూసినా ప్రకృతి సౌందర్యం ఉట్టిపడుతూనే వుంటుంది. ఈ పట్టణానికి యింత శోభ చేకూరడానికి కారణం జీలం నది ఈ పట్టణం మధ్యలో నుంచి ప్రవహించటమే. ఈ నదికి రెండువైపుల గట్లు, గట్లపై దట్టమైన చెట్లు, నదిలో పడవలు. ఈ పడవలు ఒకటి నుండి మూడు అంతస్థుల వరకు వుంటాయి. ఇక్కడి ప్రజలు ఈ పడవలలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని వుంటారు. ఈ పడవలలో వుండే వర్తక వ్యాపారాలు, హోటళ్లు, లాడ్జింగులు నడుపుతారు. యాత్రికులను యివి చాల ఆకర్షించుతాయి. కాశ్మీరు, శ్రీనగర్ వెళ్లిన వారిలో ఈ పడవలలో ఒకటి రెండు పూటలు వుండకుండా తిరిగివచ్చిన వారు అరుదు. ఈ రోజు పగలు భోజనాల తర్వాత ముఖ్యస్థలాలు చూడటానికి బస్‌లలో బయలుదేరాం. మొదలు మేము దర్శించుకున్నది ఎత్తైన కొండపైన వున్న ఒక శివాలయం. ఈ దేవాలయానికి కూడ ఘాట్‌రోడ్డుపైన వెళ్లాల్సివస్తుంది. ఈ దేవాలయం వద్ద నిలబడి చూస్తే శ్రీనగర్ పట్టణం మొత్తం చూడవచ్చు. ఈ దేవాలయానికి 1000 మెట్లు ఎక్కాల్సివుంటుంది. ఈ దేవాలయంలోని లింగాన్ని ఆదిశంకర భగవత్పాదులు ప్రతిష్ఠించారని స్థలపురాణం చెప్తోంది. అందుకే కాబోలు ఈ దేవాలయాన్ని "శంకర మఠం" "శంకరేశ్వర మఠ్" అని అంటారు. లింగం చాలపెద్దగా వుంది. ఈ పర్వతం క్రింది భాగాన జీలంనది (జీహలం) వచ్చి దాల్ సరస్సుగా ఏర్పడు తుంది. ఈ దేవాలయం నుంచి ఒక పక్కగా చూస్తే మొత్తం దాల్ సరస్సు, రెండవ పక్క తోటలు, పచ్చిక బయళ్లు మిగత రెండు పక్కల శ్రీనగర్ పట్టణం అతి సుందరంగా కనపడుతుంటాయి. దాల్ సరస్సు పక్కనే నెహ్రూ పార్కు వుంది. ఈ దేవాలయం నుంచి చూస్తే దాల్ లేక్ దృశ్యం పూర్తిగా చూడొచ్చు. దాల్ లేక్‌లో అనేక వందలాది పడవలు, వీధులు (బారులు) తీర్చి వుంటాయి. ఈ వీధులలో నుంచి పడవలు నడుస్తూ వుంటాయి. అనేక మంది యాత్రికులు ఈ

పడవలద్వారా దాల్ సరస్సు తిరిగి చూస్తారు. మనం నేలపై యిండ్లు కట్టు కున్నట్లు యిక్కడి ప్రజలు ఈ దాల్ లేక్‌లో పడవలపై యిళ్లు కట్టుకుని స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటారు. భారత దేశం నుంచే కాక యితరదేశాల నుంచి కూడ యాత్రికుల జంటలు హనీమూన్‌కు వచ్చి వెళ్లుతుంటారు. ఈ దాల్ లేక్‌లో ఒక ప్రదేశాన్ని చార్‌చినార్ అంటారు. అక్కడ నాలుగు చినార్ వృక్షాలు మాత్రమే వున్నాయి. దాల్ లేక్‌లో విహరించిన ప్రతి యాత్రికుడు చార్ చినార్ దగ్గరకు వెళ్లి, అక్కడ నుంచి దాల్ లేక్ యొక్క దృశ్యము, తోటలు. శ్రీనగర్ పట్నం చూసి తన్మయత్వం చెందుతారు. ఈ సరస్సు మధ్య భాగంలో ఒక విశ్రాంతి మందిరం వుంది. అంతపెద్ద సరస్సులో యిది ఎంతో శోభాయమానంగా కనిపిస్తుంది. ఈ దాల్ లేక్ పక్కన ఈ చివరినుంచి ఆ చివర వరకు విశాలమైన రోడ్డు వుంది. ఈ రోడ్డు పక్కన అనేక వుద్యానవనాలు చూపరులను ఆకర్షిస్తూ వుంటాయి. పర్వతాలనుండి మంచుకరిగి ప్రవహించే ఎన్నో సెలయేళ్లు యీ ఉద్యాన వనాలగుండా ప్రవహిస్తూ దాల్ సరస్సులో పడతాయి. మేము మొట్టమొదటగా చూసింది చాషంషాహి. దీనిలో అనేక రకాల వృక్ష సముదాయం, లాన్లు, రంగురంగుల పూలచెట్లు, ఒకే జాతికి చెందిన పువ్వులు అనేక రంగులలో వుండటం ఎంతో చూడ చోద్యంగా కనిపించింది. అక్కడి చెట్లపూలు, వాటి పెంపకం, అధునాతన పద్ధతిలో జరుగుతుంది. కొండలలోనుంచి ప్రవహించే సెలయేళ్లు ఈ ఉద్యానవనాల్లో ప్రవహిస్తుంటే సెలయేళ్ల అడుగు భాగాన ప్రతిబింబించే రంగుల విద్యుద్దీపాలు అవి దీపాల మధ్యనుంచి వస్తున్నట్లు మమ్మల్ని ఆశ్చర్యంలో ముంచాయి. దాల్ లేక్ పొడవునా వున్న రోడ్డు నానుకుని ఎన్నో ఉద్యానవనాలున్నాయి. ప్రతి ఉద్యాన వనానికి ఏదో ఒకపేరు వుంది. ఉద్యానవనాలన్ని తిరిగి, తిరిగి అలసి పోయాం.

అక్కడ నుంచి 6గంllలకు అక్కడి సమీపంలో వున్న ఖీర్ భవానిని దర్శించటానికి బయలుదేరాం. అక్కడికి సుమారు 30నిమిషాల ప్రయాణం. దారి పొడుగునా దట్టమైన చెట్లు. ఖీర్ భవన్ చాల ప్రకృతి సుందరమైన ప్రదేశం. అక్కడ యాత్రికులు బసచేయటానికి విశ్రాంతి భవనాలున్నాయి. ఈ దేవాలయం ఒక పెద్ద మైదానంలో క్రిక్కిరిసిన చెట్ల మధ్యలో ఒక పెద్ద కొలను మధ్యలో వుంది. ఈ

కొలనుకు నాలుగు వైపుల నుంచి కాలువలున్నాయి. కొలనుమధ్యలో శివాలయం. ఈ శివాలయం చక్కగా అలంకరించివుంది. అర్చకులు కొలనువద్దున కూర్చుని అభిషేకం చేస్తువుంటారు. అభిషేకం చేసిన పాలు, పాయసం, పూలు వగైరా అన్ని అర్చకులు కొలనులో వేస్తారు. అక్కడ ప్రకృతి సౌందర్యం చూసి తీరవలసిందే. రాత్రి 8గంIIవేరొక దారిద్వారా మాబసకు చేరుకున్నాం.

శ్రీనగర్ 15-5-78

తెల్లవారిం తర్వాత కాలకృత్యాలు పూర్తిచేసుకుని ఎవరంతటవారు బట్టలు, చీరలు, శాల్వాలు ఖరీదుకు బయలుదేరాం. కాశ్మీరు వెళ్లిన వారు ముఖ్యంగా కొనేది ఉలన్ దుస్తులు, పట్టుచీరలు. అందులో అతి ముఖ్యమైనవి కాశ్మీరు శాలువలు. కాశ్మీరు శాలువలు ప్రపంచంలోనే ప్రసిద్ధి. చెట్టు పేరు చెప్పి,కాయలు అమ్మే వ్యాపారస్తులు ఇక్కడ చాల ఎక్కువ. అసలు సరుకు కంటే నకిలీ సరుకు అమ్మే వ్యాపారస్తులే ఎక్కువ. కొన్న వారిలో అధిక శాతం మోసపోయినట్లు చాల మంది చెప్పారు. మాతో వచ్చిన కొందరు బట్టల వ్యాపారస్తులు మటుకు ఏమీకొన్నట్లు చెప్పలేదు. మొత్తం మీద అందరూ కొద్దోగోప్పో బట్టలు కొని నష్టపరచుకొన్న వారే. ఈ వ్యాపారంలో కుంకుమపువ్వు వ్యాపారం కూడ ఒకటి నకిలీకుంకుమపువ్వు చూపించి సొమ్ము చేసుకుంటారు. అక్కడ వీధిన తిరిగి అమ్మే వ్యాపారస్థుల చేతుల్లో అనేక మంది మోసపోతారు.

కాశ్మీరు - శ్రీనగర్ 16-5-78

ఈ రోజు ఉదయాన్నే తిరిగి మేము జమ్ము తావికి ప్రయాణమయ్యాం. 50కి.మీ ప్రయాణం చేసిన తర్వాత కాశ్మీరులోయను సస్యశ్యామలం చేసి కాశ్మీరు దేశ ప్రకృతి సౌందర్యాన్ని యినుమడింప చేసిన జీవనది "జీలం" జన్మస్థలాన్ని దర్శించాం. ఈ ప్రదేశాన్ని "వీరనాగు" అంటారు. ఇక్కడి హిమవత్పర్వతాల ఎత్తైన శిఖరాలనుండి వచ్చే ఒక సెలయేరును జీలం అంటారు. ఈ సెలయేరు భూమిపై పడే ప్రదేశంలో ఒక కోనేరు నిర్మింపబడినది. ఇక్కడ ప్రకృతి రమణీయత ఎంతో

వైభవంగా వుంది. ఈ కోనేరు చుట్టూ రాతితో ఒక గోడ, మరియొకవైపు ఒక ఆర్చి నిర్మించబడ్డాయి. ఈ ఆర్చిలో నుంచి కోనేరు వరకు వెళ్లాలి. కొంత దూరం వరకు ఈ నదికి రెండు ప్రక్కల గోడకట్టివుంది. ఈ ప్రదేశమంతా చక్కని చీనార్, దేవదార్, అనేక చిత్ర విచిత్రమైన దట్టమైన చెట్లతో శోభిల్లుతూ వుంది. బాల్యావస్థలో వున్న జీలంనది ఒడ్డునే ఒక శివాలయం ఎంతో అందంగావుంది. ఒక్కమాటలో చెప్పాలంటే యిది ఎంతో మనోజ్ఞమైన, అతి రమణీయమైన ప్రదేశం. ఈ ప్రదేశం జాతీయ రహదారినుంచి 10కి.మీ. వుంటుంది.

ఈ ప్రదేశానికి వీరనాగు అనే పేరు ఎట్లా వచ్చిందో తెలుసుకో లేక పోయాం. ఈ రమణీయ ప్రదేశాన్ని వీడలేక వీడి, పగలు మార్గ మధ్యంలో వున్న గవర్నమెంటువారి వసతి గృహంలో భోజనాలు చేసి సాయంత్రం 7గంIIవరకు జమ్మూ చేరుకున్నాం. పగలంతా ప్రయాణం వల్ల చాలా అలసి పోయాం. రాత్రి భోజనానంతరం మా రైలు రాత్రి 11గంIIకు అమృతసర్ బయలు దేరింది.

అమృతసర్ 17-5-78

ఈ రోజు ఉదయం 10గంIIకు సిక్కుల పవిత్ర స్థలం, సువర్ణదేవాలయం వున్న "అమృతసర్"చేరాం. చరిత్ర ప్రసిద్ధి చెందిన "జలియన్ వాలా బాగ్" ఈ పట్టణంలో సువర్ణదేవాలయానికి ఒక ఫర్లాంగు దూరంలో వుంది. మేము రైలు దిగిన వెంటనే యిక్కడ ప్రసిద్ధ స్థలాలను దర్శించటానికి బయలు దేరాం. మొదట మేము దర్శించింది శ్రీలక్ష్మీనారాయణ దేవాలయం. మేము ఎంత త్వరపడి బయలు దేరినప్పటికి కొద్ది మందికి మాత్రమే ఈ దేవాలయంలో భగవద్దర్శనం లభించింది. 11గంIIవరకే ఈ దేవాలయం తెరచివుంటుంది. వెంటనే అక్కడికి సమీపంలో వున్న సిక్కుల ప్రసిద్ధి చెందిన సువర్ణదేవాలయం దర్శించాం. ఇది సిక్కు మతస్థులకు పవిత్ర యాత్రాస్థలం. ఇదే గురు నానక్ సమాధి. ఇదొక విశాలమైన ఆవరణంలో వుంది. చుట్టూ ఎత్తైన ప్రహారీగోడ. దీనికి ఎత్తైన ఒకే ఒకద్వారం వుంది. లోపలి అవరణలో కొద్దిపాటి చెరువు అంత కోనేరువుంది. ఆ కోనేరు మధ్యలోనే రెండంతస్తుల దేవాలయం. ఆ దేవాలయం పైభాగ మంతా బంగారంతో పోత వేయబడ్డ తొడుగు ఎండవేళలో ఈ దేవాలయం దైదీప్యమానంగా కళ్లు మిరుమిట్లు గొల్పుతూ

వుంటుంది. అందుకే స్వర్ణదేవాలయం గా ప్రసిద్ధి చెందింది. భారతదేశం లోనేకాక ప్రపంచదేశాలన్నిటిలోని యావన్మంది శిక్కులు ఈ దేవాలయానికే ప్రధమ స్థానం యిస్తారు. ఇండియా లోనే కాక ప్రపంచంలోని ఏ సిక్కు గురుద్వారా దేవాలయమైనా ఈ దేవాలయానికి అనుబంధమే.

ఈ దేవాలయానికి చుట్టూవున్న ఎత్తైన ప్రహరీ గోడకు అనుకొని లోపలి భాగంలో వరుసగా విశాలమైన గదులు నిర్మించ బడివున్నాయి. ఈ గదులలో అనేక మంది మతస్థులకు సంబంధించిన గురు శిష్య సాంప్రదాయకమైన మఠాధి పతుల నిలయాలు, ఆఫీసులు వున్నాయి. దేవాలయ సిబ్బంది నివాసానికి వందల సంఖ్యలో గదులున్నాయి. గదులముందు కోనేరు వరకు వున్న ఆవరణమంతా బండలు పరచివున్నాయి. కోనేరు ముందు నుంచి దేవాలయానికి వెళ్లటానికి వంతెన కట్టివుంది. మేము దేవాలయపు క్రింది, పై అంతస్థులు అంతా తిరిగి చూసాం. క్రింది అంతస్థులో సిక్కు భక్తులంతా "గురుగోవింద్ సింగ్" వ్రాసిన గ్రంధ పఠనం చేస్తూ భక్తి తన్మయత్వంతో వుంటారు. దేవాలయాన్ని దర్శించే వారికి కొన్ని ముఖ్య నియమాలు వున్నాయి. ఎంతటి వారైనా అవి పాటించి తీరాలి. భక్తులు చెప్పులతో దేవాలయంలోకి ప్రవేశించరాదు. స్త్రీలు తలపై మేలిముసుగు ధరించాలి. కాళ్లు శుభ్రపరచుకోటానికి వసతులున్నాయి. లోపల త్రాగటానికి పరిశుభ్రమైన మంచినీళ్లు యిస్తారు. త్రాగిన గ్లాసులను పనివాళ్లు ఎప్పటి కప్పుడు సోడా, పిండి వగైరాలతో శుభ్రం చేసి మంచినీళ్లు అందిస్తుంటారు.

ఆ తర్వాత మేము ముఖద్వారం దగ్గరికి నడిచి వెళ్లాం. ముఖద్వారాని కిరుప్రక్కలా ఒక ప్రదర్శనశాల (Musium) వుంది. ప్రదర్శన శాలలో అనేక వందల ఫోటోలు, తైల చిత్రాలు వున్నాయి. సిక్కుల మతగురువు గురునానక్ చిత్రం ప్రముఖ స్థానంలో వుంది. మొగలు చక్రవర్తులు జరిపిన హింసాకాండ అంతా చిత్రరూపంలో చూపబడ్డది.

స్వతంత్ర భారతదేశం ఏర్పడ్డ తొలిరోజుల్లో పాకిస్థాన్‌లో హిందువులపై జరిగిన హింసాకాండ అత్యాచారాలు, వారికి కలిగించిన అవరోధాలు కళ్లకు

కట్టినట్లుగా చిత్రరూపంలో చూడవచ్చు. ఆ సన్నివేశాలు చూసిన ప్రతి హిందువు హృదయం చలిస్తుంది.

సిక్కులు మొదలు అహింసావాదులు. కాని మొగలు చక్రవర్తులు హిందువులను దౌర్జన్యంగా ఇస్లాంమతం స్వీకరించమని జరిపిన హింసాకాండను ఎదుర్కోటానికి ప్రతి హింసావాదులుగా మారవలసివచ్చింది. ఆత్మరక్షణ కోసం సిక్కులచే ఆయుధధారణచేయించిన ఏడవగురువు "గురుగోవిందసింగ్" చరిత్రపురుషుడు, ప్రశంస నీయుడే కాక పూజనీయుడు కూడ.

సువర్ణ దేవాలయం ముఖద్వారం చాలా ఎత్తుగా, విశాలంగా వుంది. ఇనుపమేకులతో చాల గట్టి పనితనంలో చేయబడ్డది. దేవాలయానికి ఆనుకుని చుట్టూ 10-15'ల రోడ్డుమాత్రమే వుంది. ఆ రోడ్డుపైనే వ్యాపారస్థులు కొద్ది కొద్ది దుకాణాలు పెట్టుకుని వ్యాపారం చేస్తుంటారు. దేవాలయానికి చుట్టూ సుమారు 30అడుగుల ఎత్తైన గోడవుంది. అందువల్ల దేవాలయం ముందు నుంచి కనపడదు. గేటు పక్కన వున్న ప్రదర్శన శాల రెండంతస్థుల మేడ. స్వర్ణ దేవాలయం పట్టణం నడిబొడ్డున వుండటం వల్ల, ఇక్కడ జన సమ్మర్ధము వల్ల రద్దీ ఎక్కువ. దేవాలయం ఆవరణలో యింకా అనేక కట్టడాలు వున్నాయి. వాటి కన్నింటికి వేరు వేరు పేర్లున్నాయి.

సువర్ణ దేవాలయం నుంచి నడిచిపోయే దూరంలో జలియన్ వాలాబాగ్ వుంటుంది. భారతస్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఈ జలియన్ వాలాబాగ్ కు ఒక విశేషస్థానముంది. బ్రిటీష్ సామ్రాజ్య సేనాని జనరల్ డయ్యర్ మారణ హోమం గావించిన చారిత్రక ప్రదేశం ఈ జలియన్ వాలా బాగ్. వేలాది స్వాతంత్ర్య యోధులు ప్రాణాలను బలిచేసిన ప్రదేశం యిది. ఇప్పుడిది ఒక రాజకీయ చారిత్రక ప్రదర్శన శాలగావుంది.

ఒక నాటి సాయంసమయంలో అమృతసర్ ప్రజానీకం ఒక బహిరంగ సభ ఏర్పాటు చేసుకుని జనమంతా ఈ ప్రదేశంలో గుమిగూడారు. సభాకార్యక్రమం ప్రశాంతంగా జరిగిపోతున్నది. ఈ సమయంలో భారతీయుల స్వాతంత్ర్య పిపాసను హింసద్వారా తుడిచి పెట్టగలమనే దురుద్దేశ్యపు బ్రిటీష్ సామ్రాజ్య

వాదులతోత్తైన జనరల్ డయ్యర్ జరిపించిన [illegible] ప్రదేశమంతా [illegible] తూటాలు
పేర్లు పారాయి. తుపాకి ధ్వనులకు పట్టణమంతా దద్దరిల్లింది. వందలమంది హతులయ్యారు. అనేక మంది దిక్కుతోచక తమ ప్రాణసంరక్షణార్థం అక్కడవున్న ఒక బావిలో దూకారు. పీనుగులతో బావినిండిపోయి, నెత్తురు నీరు కలిసి, పొంగి పొర్లింది. క్రూరుడైన డయ్యర్ కొంత మంది శిపాయీలతో ఆ ప్రదేశానికి వచ్చి అక్కడ నుండి బయటికి రావటానికి వున్న ఒకే ఒక ఇరుకైన దారికి అడ్డంగా నిలబడి సమావేశమైన ప్రజానీకాన్ని వెంటనే వెళ్లి పోవలసిందిగా ఆజ్ఞాపించాడు. నిర్ణీత కాలం ముగిసిందనే నెపంతో బాటకెదురుగా నిలబడి వున్న సిపాయిలకు కాల్పులకు అనుజ్ఞయిచ్చాడు. ఎన్ని వందలసార్లు కాల్చింది లెక్కలేదు. ఆ ప్రదేశమంతా తుపాకి గుండ్ల మయమైంది. జనం వెళ్లటానికి వేరేమార్గంలేదు. ఉన్న ఒకే ఒక మార్గంలో అడ్డంగా సిపాయిలు నిలబడి కాల్పులు జరిపారు. సిపాయిలు కాల్చిన బుల్లెట్లు అక్కడి గోడలకు తగిలి లేచిన చెక్కలు, విరిగిన పెళ్లలు నేటికి చూడవచ్చు. ఆనాటి జలియన్ వాలా బాగ్ ఉదంతాన్ని విని కన్నీరు కార్చని భారతీయుడుండడు. ఇదంతా ఒక ఫలకముపై వ్రాసి ఒక ప్రదేశంలో వుంచబడింది. ఈ ఉదంతంలో ప్రాణాలర్పించిన వారు అధికభాగం సిక్కులే. ఆడ,మగ, వృద్ధ, బాల తారతమ్యం లేదు.

అదిచూచిన పిదప, సమీపాన రోడ్డు పొడవునవున్న దుకాణాలలో కొందరు చీరెలు కొన్నారు. మేము స్టేషన్ చేరే వర్కు గం 2.00 లు అయింది.

హరిద్వారం 18-5-78

ఈ రోజు రాత్రంతా మా రైలు ప్రయాణం చేస్తూనే వుంది. మేము హరిద్వారం చేరేవరకు ఉదయం 10గంIIలు అయింది. నామసార్ధక్యం గలపట్టణం యిది. పవిత్రగంగానది ఒడ్డున వుండటం వల్ల, యాత్రాస్థలమవటం వల్ల గొప్ప వ్యాపార కేంద్రంగాను, జనబాహుళ్య కేంద్రంగాను విలసిల్లుతోంది. గంగానది గట్టు పొడవునా అనేక దేవాలయాలు, ఆశ్రమాలు, అనేక మంది స్వాములు, సన్యాసులు, యతీంద్రులు వున్నారు. ఈ దేవాలయాలలో విగ్రహాలు పాలరాతితో చెక్కబడి చూపరుల నాకర్షిస్తూ వుంటాయి. ఈ పట్టణానికి పురాణ ప్రసిద్ధి కూడ వుంది. మైత్రేయుడు విదురుడికి మహాభాగవతాన్ని ఇక్కడే వినిపించాడుట. దేవర్షి నారదుడు సప్త ఋుమలతో భాగవత సప్తాహం ఇక్కడ చేసాడట. ఇక్కడున్న అనేక ధర్మశాలల్లో "రామఘట్ట" మనే ప్రదేశంలో హైద్రాబాదు వారి ధర్మశాల వుంది. ఇక్కడ గంగానది వైభవం చూడవలసిందేకాని వర్ణించ శక్యముగానటువంటిది. గంగానది యిక్కడ చాల వేగంగా ప్రవహిస్తుంది. మోకాళ్లలోతు నీళ్లల్లో కూడ నిలబడి స్నానము చేయలేము. అందువల్ల యాత్రికుల సౌకర్యార్థం ఒక పాయను పక్కకు మలిపి ఒక కుండుగా ఏర్పాటు చేసి ఇనుప కమ్మీలు పాతారు. నదిలోకి దిగటానికి మెట్లు కట్టి వున్నాయి. ఈ ప్రదేశానికి "బ్రహ్మకుండ్" అని "హర్‌కీ పైడీ" అనీ పేర్లున్నాయి.

ఈ హరిద్వార నగరానికి "కపిల స్థానమని"మరో ఇతిహాస నామం కూడ వుంది. పూర్వము కపిల మహాముని ఇక్కడ నివసించి కైవల్యం పొందాడు. 17వ శతాబ్దంలో యీ నగరానికి మరొక పేరు కూడ ఏర్పడ్డది. గంగానది పర్వత ప్రాంతం వదిలి మైదాన ప్రాంతంలోకి ఇక్కడ నుంచి ప్రవేశిస్తుంది. అందుకే దానికి "గంగాద్వార"మనే పేరు కూడ ఏర్పడ్డది. ఈ ప్రదేశంలో 'శ్రీహరి" పాదముద్రలున్న ఒక కొండరాయి వుండటంవల్ల దీనిని "హరికీపైడి" అనటానికి కారణం అయింది.

బ్రహ్మ కుండంలో ఎక్కడ స్నానం చేసినా నడుములలోతు నీరు మాత్రమే వుంటుంది. రాజా విక్రమాదిత్యుడు తన తమ్ముడు భర్తృహరి జ్ఞాపకార్థం ఈ

బ్రహ్మకుండానికి మెట్లు కట్టించాడట. ఈ కుండకు పక్కన ఎత్తైన ప్రదేశంలో విష్ణుమూర్తి పాదుక, మనసాదేవి, సాక్షీశ్వరుడు, గంగాధర మహాదేవుల మందిరాలు నిర్మింపబడివున్నాయి. ఇక్కడ సాయంసమయంలో భక్తులు గంగాదేవికి ఆనంద గానాలతో మంగళ హారతులు యిస్తారు. మేము కూడ యీ కార్య క్రమంలో పాల్గొని తోటి యాత్రికులతో దీపాలు వెలిగించి గంగానదిలో వదిలి పెట్టాం. సంధ్య వెలుగులో ప్రవహిస్తున్న గంగానదిలో వేలకొద్ది దీపాలుకదులుతూ వుంటే దృశ్యం కనులపండుగగా ఆనందదాయకంగావుంటూ జీవితంలో మరుపురాని అనుభూతి కలిగిస్తుంది. మా సతీమణి ఆనందానికి అవధులు లేవు.

హరి ద్వారంలో పుష్కరము (12సంll) లకొక సారి బృహస్పతి మేషరాసిలో సంచరించేటప్పుడు "కుంభమేళా" జరుగుతుంది.బ్రహ్మగుండానికి దక్షిణ దిశగా గోఘట్టము వుంది. ఇక్కడ స్నానము చేసిన వారికి గోహత్యా దోష ముండదని వాడుక.

గోఘట్టానికి దక్షిణంగా "కుశావర్త"మనే ఘట్టముంది. ఇక్కడదత్తాత్రేయుడనే ముని పుంగవుడు పదివేల సంవత్సరములు తపస్సు చేసాడట. ఈ ముని తన వస్త్రములు, దండకమండలములు గంగానది ఒడ్డున పెట్టి తపస్సు చేసు కుంటుండగా గంగా ప్రవాహములో అవి కొట్టుకొనిపోయినవట. ఆ ముని తపఃప్రభావము వల్ల అవి ఎక్కువ దూరం పోకుండా దగ్గరలోనే గుండ్రంగా తిరుగుతూ వున్నవట. దత్తాత్రేయుడు కోపించి గంగానదిని శపించబోగా దేవతలందరూ వచ్చి ప్రార్థించగా మునివారి నందరిని అక్కడే నివసింపుమని కోరెనట. వారక్కడేవుండి పోయారు. అందువల్ల యీ ఘట్టానికి కుశావర్త ఘట్టమని పేరు వచ్చినట్టు స్థలపురాణం చెప్తోంది. ఇక్కడనే యాత్రీకులు పిండప్రదానం చేస్తారు. ఈ ప్రదేశానికి దక్షిణంగా మూడు తలలున్న దుర్గాదేవి విగ్రహం వుంది. ఇది అతి పురాతన మైన విగ్రహం. ఇది భైరవ పూజా సాంప్రదాయము లోనిదని చెప్తారు.

హరిద్వారం గొప్ప వ్యాపారస్థలమే గాక గొప్పగొప్ప యంత్రాలు తయారు చేసే కర్మాగారాలు వున్నవి. ఇక్కడ వున్నదేవాలయాలు చిన్నవి పెద్దవి కలిపి

వేలసంఖ్యలో వున్నవి. వాటన్నింటిని వివరంగాచూచి తెలుసుకోవాలంటే అక్కడ కొన్నివారాలు వుండవలసి వస్తుంది.

హరిద్వారము నుండి ఋషికేశం 19-5-78

ఈ రోజు ఉదయమే మేము గంగానదిలో స్నానాలు చేసి హరికీపైడీ ఘట్టంలో పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని స్టేషన్ చేరుకున్నాం. ఈ రోజు సాయంత్రం మా రైలు హరిద్వారం నుండి బయలుదేరి సాయంత్రం 6గంllకు ఋషీకేశం చేరుకుంది. ఇది బదరి, కేదార్ వెళ్లే తుది రైలుస్టేషన్. ఇక్కడనుంచి ఎటువెళ్లినా అంతా ఘాట్ రోడ్డే. మంచుకురుస్తుంటుంది. విపరీతమైన చలిగాలులు వీస్తూవుంటాయి. ఈ ఘాట్ రోడ్డు మీద ప్రయాణం ఏ కాస్త పొరపాటు జరిగినా ప్రాణాపాయమే. ఇక్కడ రైలు దిగగానే నేను ఇక్కడి వాతావరణం చూసి పిరికిపడి మాతోటి ప్రయాణీకులు బదరినాథ్, కేదార్‌నాథ్ వెళ్లి తిరిగి వచ్చేవరకు నేను ఋషికేశ్ లోనే రోజూ పవిత్ర గంగానదిలో స్నానం చేస్తూ, అక్కడున్న ఆశ్రమాలను, ముని పుంగవులను దర్శిస్తూ ఆ సజ్జన సాంగత్యంలో గడపవలెననుకున్నాను. కాని ఈశ్వరానుగ్రహం నాయందుండి నాకు బదరి కేదార్‌నాథ్ దేవాలయాల దర్శన భాగ్యం ఏ జన్మలో చేసుకున్న పుణ్యాన్నో నాకు రాసి పెట్టివుంది. అందు వల్లనే, నాసతీమణి గాక తోటి ప్రయాణీకులు నాకెంతో ఆత్మీయులైన శ్రీ భూపతి గౌరీశంకర్ గారు, హరి వెంకటరామయ్య, మర్ల జానకి రామయ్య, మరియు పసుమర్తి లక్ష్మయ్య గార్లు నా అభిప్రాయాన్ని మార్చుకోమని నన్నుకూడ వారి వెంట బదరి, కేదార్‌నాథ్ రమ్మని ఎంతో ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహం నాకు అమితమైన ఉత్సాహాన్ని కలిగించింది. శ్రీహరి కరుణకు పాత్రుడనై ప్రయాణానికి సిద్ధ పడ్డాను. నన్ను ప్రోత్సహించి తిరిగి నన్ను యాత్రోన్ముఖుణ్ణి చేసిన నా మిత్రులకు, నా సతీమణికి కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను. యాత్రీకులందరం కలిసి అదేరాత్రి బజారుకు వెళ్లి మాకు కావలసిన అత్యవసర వస్తువులు ముఖ్యంగా బూట్లు, కర్ర, చలిటోపి, స్వెట్టర్లు వగైరా కొనుక్కున్నాం. నేను కూడా వస్తున్నానని విని నా భార్య ఎంతో ఆనందించింది. నేను రానని మొండితనం చేస్తే నా సతీమణి కూడా ప్రయాణం మానుకునేది. మా

జీవితంలో, జన్మాంతం ఉభయులకు తీరని లోటు మిగిలి పోయేది. ఆ లోటు తోనే మా జీవితాలు గడుస్తూ ఎంతో అసంతృప్తికి గురి అయ్యే వాళ్లము. అసంతృప్తే గాక మాలో మాకు మనస్పర్ధలు, జీవితాంతము వర్ణ్యమనోవ్యథతో బాధపడే వాళ్లము.

ఈశ్వరుని సంపూర్ణ కటాక్షము వల్ల, అనుగ్రహం వల్ల నాలో మార్పు వచ్చింది. నాకు సత్సంకల్పం కలిగింది.

మా తోటి ప్రయాణీకులు ముఖ్యంగా మా యాత్రామేనేజరు నారాయణ రావుగారు మాతో ఎంతో ఆప్యాయతగ వున్న సరస్వతి, మరియు హిందీ టీచరుగారు యింకా యితర మిత్రులు ఎంతో ఆనందించారు. నన్ను యీ విషయంలో ఎక్కువ ప్రోత్సహించి నన్ను యాత్రోన్ముఖునిగా చేసిన గౌరిశంకర్ గారికి నా ప్రత్యేక అభినందనలు తెలుపుచున్నాను.

20-5-78

ఋషికేశ్ నుంచి ఈ రోజు ఉదయం 5 గం॥కే మా బస్ సిద్ధంగా వుంది. మేమంతా కాలకృత్యాలు తీర్చుకుని బస్‌లలో ఎక్కికూర్చున్నాం. బస్ బయలు దేరింది. యాత్రికుల జైజై ధ్వానాలు, బదరీనాధ్ కీజై, కేదార్‌నాథ్‌కీ జై అంటూ మిన్ను ముట్టాయి. అందరిలో ఆనంద రేఖలు స్వర్గ సుఖాలు చూచి అనుభవించి ఆనందించటానికి వెళ్తున్నట్లు గోచరిస్తున్నాయి.

సుమారు 70కి.మీ. ప్రయాణం చేసిన తర్వాత దేవప్రయాగ లో అల్పాహారం, టీ పుచ్చుకున్నాం. ఆతర్వాత 30కి.మీ. ప్రయాణానంతరం శ్రీనగర్ అనే వూరు చేరాం. మధ్యాహ్నం కావటం వల్ల మా మేనేజిమెంటు వారు ఋషికేశ్‌లో రాత్రి తయారు చేసి తెచ్చిన భోజనం ఆరగించి వెంటనే బయలు దేరాం. మార్గమధ్యంలో పవిత్ర గంగానది ఒడ్డున వున్న అనేక గ్రామాలు, నగరాలు దర్శించుకున్నాం. వాటన్నిటిలో ముఖ్యమైంది "రుద్రప్రయాగ" ఒకటి. ఇదే అలకనంద, మందాకిని నదుల సంగమస్థలం. ఇదే కేదార్ నాధ్, బదరినాధ్ రోడ్డు జంక్షన్. పౌరి టికరి చాంతం అనే మూడు పర్వత జిల్లాల కూడలి. ఇదొక పెద్ద

వాణిజ్యకేంద్రం. ఇది కొద్ది పాటి పట్టణమనటంలో సందేహం లేదు. మేము యిక్కడ కొంతసేపు ఆగి కాఫీలు పుచ్చుకుని వెంటనే ప్రయాణం సాగించాం. మేము లక్‌వాడా, అగస్త్యుని, కుండ్ చట్టి, గుప్తకాశి, నరఘాటా, రాంపూర్ మొదలైన ముఖ్యస్థలాలను దర్శిస్తూ సాయంత్రం7గం॥ సోన ప్రయాగ చేరుకున్నాం. కేదార్ నాథ్‌కు యిక్కడి వరకే బస్‌లు వెళ్లే రోడ్డు వుంది. ఈ రోజు మా ప్రయాణ మంతా ఎంతో రమణీయంగా గంగానదికి ఉపనది అయిన మందాకిని నది ఒడ్డునే సాగుతూ వచ్చింది. మా బస్‌లు ఒక్కొక్క పర్యాయం హిమాలయ పర్వత శ్రేణుల పైతల భాగం అధిరోహిస్తూ మెలికలు తిరుగుతూ వేల అడుగుల ఎత్తుగల పర్వతాలు ఎక్కుతూ ప్రయాణీకులకు భయం కలిగేటట్లుగా సాగింది. సోనప్రయాగలో ఆ రాత్రి బసచేయటానికి సరైన వసతి గృహం మాకు దొరకలేదు. ఉత్సవ సమయాలలో పర్వతాభివృద్ధి సంఘం వారు యిక్కడ యాత్రికుల సౌకర్యార్థం గుడారాలు నిర్మించి, మంచి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తారు కాని అటువంటి వేవీ మాకు సందర్భపడనందున ఒక గుట్టమీదవున్న ఒక ప్రైవేటు గుడారంలో బసచేసాం. గుడారంలోకి వెళ్లే బాట చాల యిరుకైనది కావటం వల్ల ప్రమాదకరంగా వుంది. ఆ రాత్రి ఏదోవిధంగా గుడారంలో కాలక్షేపం చేశాం. సరియైన వసతి గృహం దొరకనందున ఆ రాత్రి మామేనేజిమెంటువారు సరైన భోజన ఏర్పాట్లు చేయలేక పోయారు. ఏదో వారు పెట్టిన అల్పాహారంతో తృప్తి చెంది అలసి పోయి నిద్రించాం.

సోనప్రయాగ నుంచి కేదార్ నాథ్‌కు 21-5-78

ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి మా ప్రయాణానికి కాలుసాగించాం. అక్కడనుండి గౌరీకుండ్ వరకు మట్టిరోడ్డు వేశారు. బస్ వెళ్లటానికి పర్మిషన్ లేదు. టాక్సీలలో వెళ్లవచ్చును. అక్కడ 10-12 టాక్సీలు దొరకుతాయి. మేమంతా బ్యాచీలు బ్యాచీలుగా గౌరీకుండ్ ఉదయం7గం॥వరకు చేరుకున్నాం. గౌరీకుండ్ ఒక చిన్న పల్లె . ఇది మందాకిని నది ఒడ్డున వుంది. ఇక్కడ ఒక చల్లటి నీళ్లది, ఒక వేడి నీళ్లది వేరు వేరుగా రెండు కుండ్లు వున్నాయి. ఇక్కడ అతిపురాతనమైన గౌరి దేవాలయం ఒకటి వుంది. చల్లనీళ్లకుండ్‌లో నీళ్లు అతి

శీతలంగా వుంటాయి. అందువల్ల మార్జన చేసుకోవటం తప్ప ఎవరూ స్నానం చెయ్యరు. వేడి నీటి కుండ్‌లో నీరు యాత్రీకులు తప్పని సరిగా స్నానం చేస్తారు. ఈ కుండ 10'x10'x6' వుంటుంది. ఈ కుండ్‌లోకి ఎక్కటానికి దిగటానికి మెట్లున్నాయి. కుండ్ అడుగు భాగంలో బండలు పరచివున్నాయి. కుండ్ మధ్యన నిలబడి కొందరు, కుండ్ మెట్ల పైన కూర్చొని కొందరు స్నానాలు చేయవచ్చును. కుండ్‌లోనికి నీరు నంది నోటి నుంచి ధారాళంగా (1-10 dial) వస్తూవుంటుంది. ఎప్పుడూ 2'లోతూ నీరు కుండ్‌లో వుంటూ వుంటుంది. ఆపై నీరు వెళ్లి మందాకిని లో పడుతూ వుంటుంది. నీళ్ల పోసుకునే మాదిరి వేడిగా వుంటాయి. కాని నీళ్లలో నుండి పొగలు వస్తూ వుంటాయి. అలసిపోయివున్న మాకు అందులో స్నానం చేయటం ఎంతో హాయి కలిగించింది. మాలో కొత్త ఉత్సాహం, ఉత్తేజం వచ్చింది.

ఈ ప్రదేశం నుండి కేదార్ నాథ్ దేవాలయం 14కి.మీ వుంటుంది. ప్రస్తుతం ఈ 14కిమీ. కాలి బాట వుంది. ఈ కాలిబాట చాల యిరుకుగా వుంటుంది. వెళ్లే మనిషికీ వచ్చే మనిషికీ మాత్రమే అవకాశం వుంటుంది. మూడో మనిషి అతికష్టంగా వెళ్లగలుగుతాడు కాని రాలేడు. ఒకవైపు అఖాతం, మందాకిని నది. ఒకవైపు ఎత్తైన హిమవత్పర్వతాలు అప్పుడప్పుడు పర్వత శిఖరాలపై మంచుపెళ్లలు కరిగి దారిలో పడుతూ వుంటాయి. కాలి నడకకు కూడ అవరోధం కలుగుతూ వుంటుంది. మధ్య మధ్య దారిలో 10'-50' పొడవువరకు మంచు పేరుకొని గడ్డకట్టి వుంటుంది. దానిపై నడిచి వెళ్లవలసి వుంటుంది. గౌరీకుండ్ వద్దనుంచి చేతకాని వాళ్లు గుర్రాలపైగానీ డోలీలపైగాని, కుండీలపైగాని వెళ్లవచ్చు. అధిక శాతం నడిచే వెళ్లుతారు. బలహీనులు పైన చెప్పిన మూడు విధాలుగా వారి కనువైన పద్ధతిలో వెళ్లుతారు. మనిషి ఒకరికి కుండీలో మోసుకుని వెళ్లటానికి రూ50 వరకు తీసుకుంటారు. గుర్రానికి కూడ రు.50 నుంచి60 వరకు తీసుకుంటారు. గుర్రపు యజమాని గుర్రంను ఆనుకుని వెంట వెంట నడుస్తూ వుంటాడు. పెద్దడోలీలు నలుగురు మనుష్యులతో మోయ బడతాయి. దానికి రూ. 100 వరకు తీసుకుంటారు. గౌరీ కుండ్ నుంచి కేదార్ నాథ్ దేవాలయం వరకు వున్న 14కి.మీ కాలి బాటను విశాలం చేసి తర్వాత రోడ్డు వేసే వుద్దేశ్యం వున్నట్లు అక్కడక్కడ బాటలు వెడల్పు చేస్తున్నారు కాని యిది కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన పని.

దీని సాధ్యా సాధ్యాలగురించి యిప్పుడు ఏమీ చెప్పలేము. ఈ తరం వారు ఆ రోడ్లను చూడక పోవచ్చు. వచ్చే తరం వారు దీని ఫలితాలు అనుభవించవచ్చు. ఈ ప్రయాణం ఒకటి చిత్రమైన అనుభవం. ఆహ్లాదంతో పాటు ఆపద అడుగడుగునా వెన్నంటివుంటుంది. తొందరపాటు ఏమాత్రం పనికి రాదు. ప్రతి అడుగు అతి జాగ్రత్తగా వెయ్యాలి. ఏ మాత్రం కాలు జారినా ఆ గంగకు అర్పణమే. నామరూపాలు చూడనోచుకోము. అంతటి అదృష్టం ఎవరికో?

ఈ ప్రయాణంలో నాకు కలిగిన ఒక అనుభవం పొందుపరుస్తున్నాను. గౌరీ కుండ్ నుండి యాత్రికులందరు వారి వారి యిష్టానుసారం కొంధరు గుర్రాల మీద కొందరు డోలీల మీద బయలుదేరారు. నేను నాసతీమణిని ఒక గుర్రం మీద ఎక్కించి ఏమి భయంలేదని ధైర్యం చెప్పి నేను గుర్రం వెంటనే వుంటానని పాదయాత్రగా బయలుదేరాను. నాకు చిన్నప్పటి నుండి నడక బాగా అలవాటు. నేను చిన్నప్పటి నుండి మావూరికి నేలకొండపల్లిలో బస్‌దిగి నడిచి వెల్తూ వుండేవాడిని. 15కి.మీ. వరకు నాకు నడక అంటే చాల సునాయాసం. ఇప్పుడు గౌరీ కుండ్ నుండి కేదార్ నాథ్ కూడ 15 కి.మీ. దూరమే వుంటుంది. అందువల్ల యిప్పుడు అనేక మంది యాత్రికులలో నడిచి వెళ్లటం విశేషమేముంది అని నడిచి వెళ్లాలనే కుతూహలం కలిగింది. ఈ నడిచి వెళ్లటంలో ఎన్నో విశేషాలువున్నాయి. పుణ్యం, పురుషార్థంతోపాటు డబ్బు ఆదా చేసిన వాడిని కూడ అవుతాను అనుకుని గుర్రం వెంట బయలు దేరాను. యాత్రీకులందరు గుంపులు గుంపులుగా బయలు దేరారు. నేను కూడ బయలు దేరాను. నాముందు నాసతీమణి గుర్రం వెనుక నేను. ఆమె వెనుకకు చూస్తూ నన్ను కనిపెడుతూ వున్నది. నేను కూడ ఆమెను చూస్తూ సాగండి ముందుకు సాగి పోతుందండి అని చేతితో సైగ చేస్తూ మా ప్రయాణం సాగించాను. రాంబారా వరకు గుర్రం వెంట నేను ఒక్కొక్క సారి నావెంట గుర్రం కలిసి వెళ్లాం. అంటే 7-8కి.మీ. దారి గడిచిపోయింది. నేను కొద్దిగా అలసిపోయాను. ఆకలి గూడ కావటం మొదలుపెట్టింది. నేను నాసతీమణి దారిలో ఒక హోటలులో టీ పుచ్చుకున్నాం. ఫలహారం సహించలేదు. మళ్లీ మా ప్రయాణం మామూలుగా సాగించాం. అక్కడ నుండి నా సతీమణి గుర్రం ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ పోయింది. నాలో చేతగానితనం, బలహీనత ఏర్పడి ఒక్కొక్క

అడుగు వెనుక పడుతూ పోయాను. ఒక కి.మీ ప్రయాణం చేసేవరకు నా సతీమణి గుర్రం నాదృష్టికి కానరాకుండాపోయింది. గుర్రపు యజమానులు కూడ దేవాలయం దగ్గరికి వచ్చిన కొద్ది తిరుగు బాడుగకొరకు తొందర తొందర గా వెళ్లి పోతారు. మా తోటి యితర యాత్రికులు కూడ మా కంటే ముందుపడ్డారు. నేను ఒంటరివాడనయ్యాను. ఒక అడుగు ఒక కి.మీ. గా నా ప్రయాణం సాగుతోంది. కళ్లు తిరుగుతున్నాయి. కడుపులో వికారం డోకు వస్తోంది. కాలు ఒక అడుగైనా సాగేటట్లు లేదు. దిగచెమటలు పెడుతున్నాయి. ఇది నా అవసానకాలమా అన్నట్లు అనిపించింది. అయినా దిగులు పడి చేసేది ఏమీ లేదు కదా ! ఎట్లా జరిగేది అట్లాగే జరుగుతుంది. అయినా మహాగొప్పప్రదేశం. మనం ఏమంత పుణ్యకార్యాలు చేసామని ఈ పుణ్య భూమిలో దైవసాన్నిధ్యంలో అంతిమశ్వాస విడవ గలగటం అని చీకటి పడేవరకు పడుతూ లేస్తూ నైనా ఈ కాస్త దూరం వెళ్ల లేనా అని ధైర్యం తెచ్చుకుని అతి కష్టం మీద ఒక్కొక్క అడుగు వేస్తున్నా. ఈశ్వర ధ్యానంలో ఏదో నోటికి వచ్చిన భజన పాటలు పాడుతున్నా. సూర్యుడు అస్తమించ బోతున్నాడు. ఇంతలో ఈశ్వరుని దయ అన్నట్లుగా ఒక గుర్రం వాడు కేదార్‌నాథ్ చల్తే క్యా, కేదార్ నాథ్ వస్తారా ? అని అడిగాడు. నాకు ప్రాణం లేచి వచ్చింది మళ్లా జన్మ ఎత్తి నట్లయింది. ఏమీ బేరం చెయ్యకుండానే గుర్రం వద్దకు వెళ్లి అతని సహాయంతో గుర్రం మీదికి ఎక్కి కూర్చున్నా. ఆ రెండు కి.మీ. గుర్రం ఎట్లా వెళ్లిందో నాకే తెలియదు. మందాకిని నది యివతలి ఒడ్డున గుర్రం ఆగింది. నేను గుర్రం దిగాను. పదిరూపాయలు యిమ్మన్నాడు 10రూ. ఇచ్చి మాతోటి ప్రయాణీకులను వెతుక్కుంటూ గుడివద్దకు నెమ్మదిగా కూర్చుంటూ లేస్తూ వెళ్లాను. ఆ ఫర్లాంగు దూరం వెళ్లటానికి 30 నిము షాలు పట్టి వుంటుంది. నేను వెళ్లే వరకు నా సతీమణి దిక్కముఖంతో ఏమీ తోచని స్థితిలో నాబాటవైపుకు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తూవుంది. మేమిరువురము అప్యాయతతో ఒకరినొకరు పరామర్శించుకున్న తర్వాత ఆ గుర్రం వాడికి ఆమే 10రూ. యిచ్చి నా గుర్తులు చెప్పి పంపించిందని మాటల సందర్భంలో తెలుసుకున్నాం. ఆ గుర్రం వాడు కనుక నన్ను కేదార్‌నాథ్ వస్తారా కేదార్‌నాథ్ చల్తేక్యా అని అడగకపోతే గుర్రం ఎక్కి వెళ్లవచ్చుననే ఆలోచన నాకు రాక పోవునేమో. ఎట్లజరిగేదో. కాని చివరకు ఆ

ఈశ్వరుని దయవల్ల ఈ రోజు మా అనుభవం సుఖాంతంగా ముగిసింది. వెంటనే దేవాలయానికి వెళ్లాం. మేము వెళ్లే వరకు దేవాలయసమయమయి పోయింది. తలుపులు మూసేసారు. రాత్రి 8గంIIవరకు అక్కడే విశ్రాంతి తీసుకుని ధూళి దర్శనం చేసుకుని మా బసకు వచ్చి అల్పాహారం తీసుకుని నిద్రించాం. రాత్రి చలి చాల అధికంగా వుంది. మేమిద్దరం చెరి రెండు రజాయిలు అద్దెకు తీసుకుని నిద్రించాం. రాత్రి 10గంIIఅయింది.

నేను అవసరమైనప్పుడు 15-20కి.మీ. సునాయాసంగా నడవగలిగే వాడిని. కాని ఈ సారి యింత అలసట ఆందోళన చెందటానికి కారణమేమిటి అని అలోచిస్తే మేము అప్పటికి40రోజులనుండి ప్రయాణం చేస్తుండటం వల్ల అప్పటికే బాగా అలసిపోయాం. క్రితంరోజంతా భోజనంలేదు. అల్పాహారంతోనే నిన్నరెండు పూటలు సరిపెట్టు కున్నాం. ఈ రోజు పూర్తిగా వట్టి కడుపే. అదీకాక యిప్పుడు నడిచేది వట్టి నడక కాదు. పర్వతారోహణతో కూడిన నడక. ఎత్తు ఎక్కుతున్న కొద్ది గాలిలో ప్రాణవాయువు శాతం తగ్గుతుందంటారు. మనకు కావలసింది ముఖ్యంగా ప్రాణవాయువు. అది తగ్గేసరికి ఆయాసం రావటం సహజం. దాంతో అన్ని యిబ్బందులు కలుగుతాయి. దేవాలయం యింకా రెండు కి.మీ. వున్నదనంగా నేను కూర్చొని లేవలేని స్థితి ఏర్పడింది. చెమటతో బట్టలు తడిసి పోయాయి. లేస్తే, నడుస్తే కళ్లు తిరగటం, తల తిరగటం ఆరంభమైంది. ఆ కాస్తదూరమైనా వెళ్ల గలనన్న ఆశ సన్నగిల్లింది. నిజంగా ఆ ఘోడావాలా నన్ను మందలించి గుర్రం ఎక్కించుకోకపోతే కథ ఎట్లావుండేదో! ఈ ప్రాంతవు ఘోడావాలాలు, కూలీలు, హోటలు యజమానులు ఎంతో నీతీ నిజాయితీ కలవారు.పారమార్థిక చింతన గలవారు. వారు యాత్రికులతో అన్ని వేళలా, అన్ని విధములా సహకరిస్తూ వుంటారు. మా తోటి యాత్రికుడు తన వద్ద వున్న డబ్బంతా మనీ పర్స్‌లో పెట్టి రాంబాలో ఒక హోటల్‌లో మర్చి పోయివచ్చాడు. ఆ హోటలు యజమాని దానిని, చూసి ఒక ఘోడావాలాకు పర్సు యజమాని గుర్తులు చెప్పి, అది అతనికి ముట్టేట్లు చూశాడు. వాళ్ల నిజాయతీ చూసి మనం నీతి నేర్చుకోవాలి.

కేదార్ నాథ్‌నుండి బదరీ నాథ్ ప్రయాణం 22-5-78

ఈ రోజు ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని గుడిలోకి వెళ్లాం. అందరితో కలిసి ఈశ్వరుడికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేయించు కున్నాం. ఇక్కడి లింగం స్వయంభువు. ద్వాదశజ్యోతిర్లింగాలలో యిది ఒకటి. ఇక్కడ పూజలు మూడు రకాలుగా జరుపుతారు. తెల్లవారు జామున నాలుగు గంటలకు అభిషేకం జరుగుతుంది. దీనిని చేయించదలచిన వారు Rs. 300 చెల్లించవలసి వుంటుంది. తరువాతది ఉదయం 8గంIIలకు జరిగే అభిషేకం. దీనికి Rs. 10 తీసుకుంటారు. అన్నింట్లో ముఖ్యమైంది, రు. 500/- ఇస్తే దేవాలయం మూసే రోజున మన గోత్రనామాలు చెప్పి అఖండంలో నెయ్యి పోస్తారు. ఈ అఖండంలోని జ్యోతి ఆరుమాసాలు అనగా మళ్లా దేవాలయం తలుపులు తెరిచే వరకు వెలుగుతూ వుంటుంది. ఈ దేవాలయంలో ఆరు మాసాలు అనగా నవంబరు నుంచి ఏప్రియల్ వరకు దేవతల పూజ మే నెల నుండి అక్టోబరు నెలాఖరు వరకు మానవులు పూజ చేస్తారని అంటారు. ఈ దేవాలయం ప్రక్కనే అమ్మవారి దేవాలయం వుంది. సమీపంలో వున్న విఘ్నేశ్వరాలయం, ఆదిశంకరుల సమాధి దర్శనీయాలు. ఆదిశంకరులు స్థాపించిన అయిదు పీఠాధిపతుల విగ్రహాలు ఇక్కడ చూడవచ్చు. ఆది శంకరులు తన నిర్యాణ సమయం ముందుగనే తెలుసుకుని ఇక్కడికి వచ్చి నిర్యాణమైనట్లు చరిత్ర చెప్తున్నదానికి సాక్షాత్కారంగా యిక్కడ దర్శించుకోవచ్చు. పూజలు 11గంIIవరకు ముగించుకొని అల్పాహారం తీసుకుని తిరుగు ప్రయాణం కొనసాగించాం. నిన్నటి నా అనుభవం దృష్ట్యా నేను కూడ యింకో గుర్రం మీద ప్రయాణం చేసాను. సాయంత్రం నాలుగు గంIIగౌరీకుండ్ చేరుకున్నాం. మా అలసట తీరగౌరీకుండ్‌లో స్నానాలు చేసి వెనుక ముందు వున్న వారికోసం వేచి వుండి అందరం కలిసి టాక్సీలలో సాయంత్రం 7గంII వరకు సోనప్రయాగ చేరుకున్నాం. మొన్నటి మాదిరి అదే బసలో మకాం చేసి అల్పాహారంతో తృప్తి చెంది రాత్రి నిద్రించాం.

సోనప్రయాగనుంచి బదరీనాథ్ 23-5-78

తెల్లవారు జామున నాలుగు గంటలకే లేచి ప్రయాణం సాగిందాం. మేము రుద్రప్రయాగ చేరేవరకు ఉదయం 10గంll అయింది. దారిలో కాలకృత్యాలు ముగించుకున్న మేము ఇక్కడ టీ, ఫలహారాలు సేవించి, మాప్రయాణం బద్రినాథ్‌కు సాగించాం. రుద్రప్రయాగ నుంచి బద్రినాథ్‌కు 160కి.మీ. వుంటుంది. దారిలో అనేక ముఖ్యపట్టణాల మీదుగా మా ప్రయాణం సాగుతుంది. మేము కర్ణప్రయాగ వెళ్లే వరకు పగలు 1గంll కావచ్చింది. కర్ణప్రయాగ కొద్ది పాటి బస్తీ లాంటి పట్టణం. ఇక్కడ ప్రభుత్వం వారి వసతి గృహాలువున్నాయి. కర్ణప్రయాగ అలకనందా, పిండార్ నదుల సంగమ స్థానం. ఈ సంగమం వద్దనే ఒక దేవాలయం వున్నది. ఆ దేవాలయం వద్ద మా భోజనకార్యక్రమాలు ముగించుకుని వెంటనే బయలుదేరాం. మా ప్రయాణం నందప్రయాగ, చమోలి, పిపాల్ కోట్, జ్యోషి మఠ్, విష్ణుప్రయాగ, హనుమాన్ చట్టి మీదుగా బద్రినాథ్ సాగిపోయింది. జ్యోషి మఠ్ జిల్లా ముఖ్యపట్టణం. వ్యాపారకేంద్రం. బద్రినాథ్‌లో మంచు గడ్డకట్టి వున్న ఆరుమాసాలు అక్కడి అర్చకులు మొదలైనవారు హనుమాన్ చట్టిలో వచ్చి నివసిస్తారు. మంచుకరిగి పోగానే తిరిగి వెళ్లి పోతారు. మేము బదరి వెళ్లే వరకు సాయంత్రం 7గంll అయింది. వెంటనే ధూళి దర్శనం చేసుకుని మా బసకు చేరుకున్నాం. మాబస తిరుపతి దేవస్థానం వారు నిర్మించిన సత్రాలలో ఏర్పాటు చేసారు. ఈ సత్రాలు ఎంతో సుందరంగా నవీన పద్ధతులలో అన్ని వసతులు కలిగి వున్నాయి. మేము దేవాలయం దర్శించే కొద్ది రోజుల ముందే దేవాలయం తలుపులు తెరిచారు. కేదార్ నాథ్ మాదిరి ఇక్కడ కూడ ఆరునెలలు దేవతల పూజ. ఆరు నెలలు మానవుల పూజ. దేవాలయం మూసి వున్న రోజుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలు, అఖండ జ్యోతి పెద్ద ఉత్సవవైభోగంతో జ్యోషిమఠ్‌కు తీసుకుని వస్తారు. ఈ ప్రదేశాన్ని"భవిష్యత్ బద్రి" అంటారు. ఇక్కడనే వుంచి పూజలు ఆరుమాసాలు జరుపుతారు. బద్రినాథ్‌లోని పూజారులు కేరళకు చెందిన నంబూద్రిబ్రాహ్మణులు. గొప్పసంస్కృత వేదపండితులు. తలుపులుతెరచినరోజు అఖండ జ్యోతిని దూర ప్రదేశాల నుండి వేల మంది యాత్రికులు వచ్చి దర్శించుకుంటారు.

బద్రినాథ్ పూర్వం నరనారాయణులు తపస్సుచేసిన పుణ్య ప్రదేశం. ఈ దేవాలయం ఏ కాలంలో ఎవరి చేత నిర్మింపబడ్డది నిర్ధారించటానికి సరియైన ఆధారాలు లేవు. వేదాలలో ఈ దేవాలయ ప్రసక్తి వున్నందున ఈ దేవాలయం వేదాలకు పూర్వం నాటి దని అతిప్రాచీనమైన దని చెప్పక తప్పదు. బౌద్ధ యుగం నాటి రోజుల్లో విగ్రహం స్థాన భ్రంశం చేయబడి నారదకుండ్‌లో పడవేసినట్లు తరువాత 8వ శతాబ్దంలో ఆది శంకరులవారు ఈ విగ్రహాన్ని తీయించి పునః ప్రతిష్ఠ చేసినట్లు చెప్తారు. ఇప్పుడు ఈ దేవాలయపు కొంత భాగాన్ని పునర్నిర్మాణం-గావిస్తున్నట్లు చూసాం. దేవాలయానికి దిగువలో అలకనందా నది ఒడ్డున ఒక దాని సమీపంలో మరొకటి ఉష్ణగుండాలున్నాయి. ఒకదానిని నారద కుండ్ అంటారు.

బద్రీనాథ్ 24-5-78

బద్రినాథ్‌లో మా మకాం తిరుపతి దేవస్థానం వారి సత్రంలో పెట్టాం. మేము మా విడిదిలో కాలకృత్యాలు తీర్చుకుని ఉష్ణ గుండాలలో స్నానాలు చేసి పవిత్ర గంగానదిలో మార్జన చేసుకుని దేవాలయంలోకి వెళ్లి, భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకున్నాం. దేవాలయానికి కొద్ది దూరంలో పవిత్ర గంగా నది ఒడ్డున బ్రహ్మ కపాళం వుంది. మేమంతా అక్కడ పితృ శ్రాద్ధాలు పెట్టాం. పిండప్రదానానికి కావలసిన అన్నం మరియు యితర సామాగ్రి దేవాలయం వారిచే సప్లైచేయ బడ్డాయి. బ్రహ్మ కపాలంలో పితరులకు పిండప్రదానం చేసిన ఏడుతరములవారు తరించిపోతారని, వారికి స్వర్గప్రాప్తి కలుగుతుందని, నరక బాధల నుంచి విముక్తులు అవుతారని శాస్త్రం చెబుతుంది. అందువల్ల నేను యిటు మా పితృ, పితామహ, ప్రపితామహాదులకు, అటు మాతామహాదులకు యింకా యితర ముఖ్య బంధువులు అనగా పెద్దతండ్రులు, పినతండ్రులు, మేనమామలు, మామగారు, స్వగోత్రీకులలో చనిపోయిన వారు ఆడమగ తారతమ్యం లేకుండా నాకు జ్ఞాపకం వున్నంతవరకు అందరిని స్మరించుకుని శ్రాద్ధం పెట్టాను. తర్పణం విడిచాను. బ్రహ్మ కపాళంలో పిండ శ్రాద్ధం పెట్టినవారు ప్రతి సంవత్సరం శ్రాద్ధాలు పెట్టకపోయినా పట్టింపులేదని అంటారు. దేవాలయానికి తూర్పుదిశలో ఒక ఎత్తైన

మంచు పర్వతం చూడవచ్చు. ఆ పర్వతం మీద కొందరు ఉత్సాహ వంతులైన యువకులు స్కేటింగ్ చేస్తుంటే మేము చూచి ఆనందించాం. బద్రినాథ్ దేవాలయం రెండు భాగాలుగా విభజించబడి వుంది. ఒకటి గర్భాలయం; రెండవది సభా మంటపం. సభా మంటపం నుండే భక్తులు స్వామిని దర్శించుకోవాలి. స్వామి పద్మాసనాసీనుడై వుంటాడు. బ్రహ్మ అమరేశ్వరుడు, గరుడుడు, హనుమంతుడు, శ్రీదేవి, భూదేవిలచే సేవింపబడుతుంటాడు.

ఇక్కడనుండి నీలకంఠశిఖరం మిక్కిలి దర్శనీయం. అలకనంద గంతులు వేస్తూ ప్రవహిస్తూ వుంటుంది. దేవాలయ ఘంటానాదం ఎంతో దూరం వినవస్తుంది. రాత్రి వేళల ప్రశాంత సమయంలో గంట మ్రోగిస్తే కొన్ని మైళ్ల వరకు నాదం వినబడుతుంది. ఉదయం 6-30నుండి మధ్యాహ్నం 2-00గంIIవరకు సాయంత్రం నాలుగు గంటలనుండి రాత్రి తొమ్మిది గంటలవరకు స్వామి వారి దర్శనం చేసుకోవచ్చును. ఇక్కడి పూజలలో సాయంత్రం హారతి చాల ముఖ్యమైనది. ఉదయం మహాభిషేకం తర్వాత అభిషేకం, గీతా పఠనం, భాగవత పఠనం చేస్తారు. మేము సాయంత్రం హారతిపూజ చేసికొని ఆడుతూ, పాడుతూ రాత్రి 9-00 గంIIవరకు బసకు చేరుకున్నాం. ఈ రోజు చలి చాల అధికంగా వుంది. మేము యిక్కడసుమారు1 1/2 రోజు అనగా 36గంIIలు ఉండటంతో గతనాలుగు రోజుల అలసట తీరిపోయింది.

బద్రినాథ్ నుండి తిరుగు ప్రయాణం 25-5-78

ఈ రోజు ఉదయం 5గంIIవరకు కాల కృత్యాలు తీర్చుకొని ప్రయాణానికి సిద్ధమయ్యాం. సాధించిన తృప్తితో తిరోన్ముఖుల మయ్యాం. అక్కడ అప్పటి ప్రకృతి సౌందర్యం చెప్ప నలవి కాదు. ఎత్తైన కొండల మధ్యలో గల ఆ ప్రదేశంలో సూర్యోదయ సమయం ఎంతో ఆకర్షణీయంగా, రమణీయంగా వుంటుంది. ఆ ఎత్తైన కొండల మీద ఉదయభానుని కిరణాలు ప్రసరించేటప్పుడు కొన్ని బంగారు కొండలు గాను, కొన్ని వెండి కొండలుగాను రంగురంగుల వైభవాలతో కన్నుల పండుగ్గా కనిపిస్తాయి. మేము మధ్యాహ్న భోజన వేళకు పిపాల్ కోట చేరుకున్నాం. ఇక్కడ కాలీ కంబల్ వాలా సత్రంలో మాకు వసతి ఏర్పాటు చేసారు.

ఇది కొత్తగాకట్టిన భవనం. అన్ని సదుపాయాలు వున్నాయి. అక్కడే వంట ఏర్పాట్లు చేసి భోజనాలు పెట్టారు. ఉత్తర భారతంలో బిర్లా దేవాలయాలు ఎంత ప్రసిద్ధో, హరిద్వారం తర్వాత ముఖ్యంగా హిమవత్పర్వతాలలో బాబా కాలీ కంబల్ వాలా పేరు అంత ప్రసిద్ధి. ఎక్కడికి వెళ్లినా బాబాకాలీ కంబల్ వాలా కట్టించిన సత్రమొకటి చూడవచ్చు. కాలీ కంబల్ వాలా బిర్లా మాదిరి కోటీశ్వరుడు కాదు. ఇండ్రస్టియలిస్టు కూడా కాదు. వ్యాపార వేత్తా కాడు. పేరుకు తగ్గట్టు యితడు చాల బీదవాడు. అతనికి తన స్వంత ఆస్తి అంటూ వున్నది ఒక నల్లగొంగళి మాత్రమే. కాని యితడు ప్రజలను యాచించి, హిమాలయ పర్వతాలలో వున్న, ప్రతి ముఖ్యమైన పట్టణాలలో నిస్వార్థ బుద్ధితో సత్రాలు కట్టించాడు. భోజనానంతరం బయలు దేరి రాత్రి8.00గంllవరకు శ్రీనగర్ చేరుకున్నాం. బస్టాండుకు సమీపంలో వున్న ఒక సత్రంలో బస చేసాం. ఆ రాత్రి అల్పాహారం తీసుకుని నిద్రించాం. తెల్లవారు జామున నాలుగు గంllవరకు బస్టాండువద్ద కాలకృత్యాలు తీర్చుకుని వెంటనే ఋషీకేశ్‌కు ప్రయాణం సాగించాం.

ఋషీకేశ్ 26-5-78

ఈ రోజు ఉదయం తొమ్మిది గంllల వరకు ఋషీకేశ్ చేరుకున్నాం. మధ్యాహ్నం భోజనాల అనంతరం ఋషీకేశ్‌లోని ముఖ్యమైన ప్రదేశాలు చూడటానికి బయలు దేరాం. ఇదొక పవిత్ర స్థలం. మొదట టాంగాలో లక్ష్మణ ఝూలా దగ్గరికి వెళ్లాం. ఝూలా అంటే ఊయల అని అర్థం. ఈ ఝూలా గంగపై నిర్మించబడ్డది. ఈ ఒడ్డునుండి అవలి ఒడ్డుకు ఆ ఒడ్డునుండి ఈ ఒడ్డుకు మనుష్యులు, సైకిళ్లు, స్కూటర్ల రాకపోకలకు ఏర్పాటు చేయబడింది. ఇనుపరేకులు, చువ్వలతో బోనుగా నిర్మించబడ్డ 6'x6' గల కట్టడం. లక్షణ ఝూలా అని ఎందుకు పేరు వచ్చిందో తెలియదు. పవిత్ర గంగానదిపైన సుమారు 50' 6 ఎత్తున దాదాపు ఒక ఫర్లాంగు పొడవున గంగానదికి యిరు ప్రక్కల రెండు ఎబెట్ మెంట్లు (Abetments దిమ్మలు) కట్టి బలమైన నాలుగు తీగెలతో ఆ తీగెల మధ్య ఈ బోను ఏర్పాటు చేయబడింది. వందల మంది ప్రయాణీకులు సైకిళ్లు వగైరా ఈ ఝూలా మీద నడవచ్చు.

మేము గంగకు ఉత్తరం దరి నుండి దక్షిణందరికి వెళ్లాం. మేము వెళ్తుంటే మార్గ మధ్యంలో అనగా సగం ఝూలా దాటగానే గాలివాన ఒకేసారి మమ్మల్ని అవరించింది. ఆ ఝూలా క్రిందికి పైకి ఊగటం మాకు ఎంతో ఆందోళన కల్గించింది. చివరకు మేము బాగా తడిసి అవతలి దరికి చేరుకున్నాం. అక్కడ ఎన్నో దేవాలయాలు వున్నాయి. కొన్ని 3,4 అంతస్తులు కలిగి వున్నాయి. ఇక్కడ ఒక సీతారామలక్ష్మణుల దేవాలయంవుంది. పాలరాతి విగ్రహాలు చూడ సొంపుగా వున్నాయి. లక్ష్మణ ఝూలాకు దగ్గరలో మానస మందిరం పేరుతో బిర్లావారిచే నిర్మింపబడ్డ గొప్ప మందిరం వుంది. ఇది 13 అంతస్థుల భవనం. ప్రతి అంతస్థులో ఏదో దేవాలయం, ఏవోదేముళ్లు, పాలరాతి విగ్రహాలు అతి వైభవంగా చూడసొంపుగా వున్నాయి. అక్కడనుంచి గంగకు యిరు ప్రక్కల ఋషీకేశ్ వరకు ఎన్నో ఆశ్రమాలు, ధర్మసత్రాలు, ఆచార్యపీఠాలు, సాధుజనసంఘాలు, ఆలయాలు ఎన్నెన్నో వున్నాయి. ఇక్కడ అహర్నిశలు పండిత సాహిత్యగోష్ఠులు. హరికథలు, పురాణ కాలక్షేపాలు భారత రామాయణ గాధలు, సాధు సజ్జనులచర్చలు జరుగుతునే వుంటాయి. మేము యిక్కడ ముఖ్యంగా దర్శించిన వాటిలో భారతీయ మందిరం, సీతామందిరం ముఖ్యమైనవి. త్రివేణి ఘాట్ వద్ద యాత్రికులు పిండప్రదానాలు చేస్తారు.

ఇవన్నీ విపులంగాచూసి తెలుసుకోవాలంటే కనీసం వారం రోజులైనా చాలవు కాని మాకు వ్యవధి లేనందున ఆ సాయంత్రమే అన్ని చూసినట్లు చూచి, చూసిన అనుభూతి పొంది గంగను లాంచీలలో దాటి ఇవతలి ఒడ్డు చేరుకున్నాం. పగలంతా బాగ తిరిగినందువల్ల వర్షంలో తడిసినందువల్ల బాగా అలసిపోయాం. భోజనాలు చేసి నిద్రించాం. తెల్లవారు ఝామునే మా రైలు హరిద్వారం బయలు దేరింది. ఉదయం8గంIIమళ్లీ హరిద్వారం చేరుకున్నాం.

27-5-78 హరిద్వారం

రైలు దిగగానే యాత్రికులంతా పవిత్ర గంగానదికి వెళ్లాం. మరోసారి చివరిసారిగా తనివితీరా స్నానం చేసి తృప్తిగా గంగామాయిని దర్శించుకుని హరి-కీ-పైడీ ఘట్టంలో గంగపూజ చేసుకుని గంగాజలాలను రాగి పాత్రలలో

స్వీకరించాం. ఆ పాత్రలు భద్రంగా సీలు చేయించి, మా వెంట స్టేషన్‌కు తెచ్చి సీట్లపైన భద్రపరచాం. ప్రతి యాత్రికుడు తమ బంధుమిత్రులకు యిచ్చి వారిని తరింపచేసే నిమిత్తం గంగాజలాలను తమ వెంట తీసుకొని రావటం సాంప్రదాయం. అదే సాంప్రదాయం ప్రకారం బంధు మిత్రులకు యివ్వటానికి చిన్న చెంబులలో గంగాజలాలు పట్టి గంగపూజలు చేయించి తీసుకువచ్చాం. సామాన్యంగా ప్రతి వారు కాశీక్షేత్రంనుంచి గంగతెస్తారు. కాని మేము యింకాపైకి వెళ్లి నందువల్ల అంతా ఒకే గంగ కాబట్టి, హరిద్వారం తర్వాత గంగ మరి తగలదు కాబట్టి హరిద్వారంలోనే గంగను తెచ్చుకున్నాం. మన సాంప్రదాయంలో హరిద్వారం గంగకే ఎక్కువ ప్రాధాన్యం వుంది. హరిద్వారం గంగ చెడిపోకుండా 60సంllల వరకు వుంటుందని ప్రతీతి.

కురుక్షేత్రం 28-5-78

హరి ద్వారం నుంచి మా రైలు నిన్నటి రోజు సాయంత్రం బయలు దేరింది. మధ్యలో మేము మా రైలును వదలి వేరొక రైలులో ప్రయాణం చేసాం. ఆ రైలు తెల్లవారే వరకు కురుక్షేత్రం చేరుకుంది. రైలు దిగి కాలకృత్యాలు తీర్చుకుని టాంగాలలో కురుక్షేత్రానికి బయలు దేరాం. మహా భారత యుద్ధంలో కౌరవులు, పాండవులు రాజ్యకాంక్షతో యుద్ధం చేసిన ప్రదేశం యిది. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యాన్ని బలితీసుకున్న ప్రదేశం యిది. ధృతరాష్ట్రుని సంతానం, కర్ణుడు, ద్రోణాచార్యులు, కృపాచార్యులు లాంటి యుద్ధనిపుణులు, యుద్ధ వీరులు యుద్ధంలో నేలకొరిగి అసువులు బాసింది ఈ ప్రదేశంలోనే. ప్రస్తుతం ఇది ఒక మహానగరం. భారతదేశంలో వున్న అయిదు ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీలలో(వరంగల్‌లో వున్నటువంటిది) ఒకటి ఇచ్చట కూడ వున్నది.రైలు స్టేషన్‌కు ఈ నగరం నాలుగు మైళ్ల దూరం వుండవచ్చు. మొదట మేము సూర్య కుండ్‌కు వెళ్లాం. అక్కడ సంకల్పంతో స్నానం చేసి పక్కనే వున్న 2,3 దేవాలయాలను దర్శించాం. తర్వాత మేము బ్రహ్మ కుండ్ వద్దకు వెళ్లాం. ఈ కుండ్ 1కి.మీ. పొడవు 1కి.మీ. వెడల్పు వుండవచ్చు. కుండ్‌లో నీరు సమృద్ధి గావుంది. కుండ్ నాలుగు వైపుల కుండ్ పొడవునా మెట్ల వెంబడి అరుగు, అరుగు నానుకొని

గోడవున్నాయి. ఈ కుండ్ ప్రక్కనే ఒక దేవాలయం వుంది. ఆ దేవాలయంలో పంచపాండవుల విగ్రహాలున్నాయి. ఈ కుండ్ భారత యుద్ధానంతరం పంచ పాండవులచే విజయ చిహ్నంగా నిర్మించ బడింది అనికొందరు, కురుక్షేత్ర యుద్ధంలో పారినరక్తపుటేర్ల పాపపరిహారార్థం నిర్మింపబడిన అయిదు కుండ్‌లలో యిది ఒకటని కొందరు అంటుంటారు. ఈ కుండ్‌కు సమీపంలో 2,3 దేవాలయాలున్నాయి. ఒక దేవాలయం పెద్ద ఆవరణలో కట్టబడి వుంది. దేవాలయం ముందు పాలరాతితో ఒక పెద్ద రథం శ్రీకృష్ణుడు అర్జునునకు గీతబోధిస్తున్నట్లు,ఆ రథంపై అర్జునుడు,కృష్ణుని విగ్రహాలున్నాయి. మేము ఈ దేవాలయానికి వెళ్లినప్పుడు యిక్కడ అతివైభవంగా భజనలు జరుగుతున్నాయి. తర్వాత మేము భీష్ముడు అంపశయ్య నలంకరించిన తర్వాత ఆయన దాహం తీర్చటానికి అర్జుడు తన బాణంతో పాతాళ గంగను పైకి తెచ్చి భీష్ముని దాహంతీర్చి నట్లున్న ప్రదేశాన్ని చూసాం. ఆ ప్రదేశం ప్రస్తుతం ఒక పాడుపడిన గొయ్యి లాగావుంది. ఆ పక్కనే ఒక పాతదేవాలయం చాల శిధిలావస్థలో వుంది. ఈ రోజు ఎండ చాల తీక్షణంగా వుంది. ఆ ప్రాంతమంత తిరిగి చూసే ఓపిక లేకపోయింది. మేము స్టేషన్‌కు వచ్చి భోజన కార్యక్రమాలు పూర్తి చేసుకుని, రైలు కోసం 2,3 గంllలు వేచి, రాత్రి 9గంllలకు కొత్త ఢిల్లీ చేరుకున్నాం.

న్యూ ఢిల్లీ 29-5-78

ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని భోజనకార్యక్రమాలు పూర్తి చేసుకుని భారత రాజధాని నగరంలో లోగా వచ్చినప్పుడు దర్శించని మరికొన్ని ప్రదేశాలను సందర్శించాం. మొదలు మేము 10-11 మందిమి కలిసి ఒక బృందంగా శ్రీమతి ఇందిరాగాంధీ యింటికి ఆమె దర్శనార్థం వెళ్లాం. ఉదయం 8-00గంll సమయమది. ఇందిరాగాంధీని చూడాలని అందరూ ఆతృత పడుతున్నారు. ఇందిరా గాంధీ నివాసగృహం ముందు మామూలు దుస్తులతో ఒక సిక్కు పహారా మనిషి కాబోలు నిలబడి వున్నాడు. మమ్ములను గేటుదగ్గరే ఆపుచేసి మా వివరాలు తెలుసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారమని ఎంతో గర్వంగా చెప్పాం. మమ్ములను అక్కడే నిలపి వుంచి లోపలికి వెళ్లి మరునిముషంలో తిరిగి

వస్తూనే లోపలికి రమ్మని సంజ్ఞ చేసాడు. అప్పటి మా ఆనందానికి అంతులేదు. ఆ భవనము చాల నిరాడంబరంగా వుంది. బయట కాంపౌండులో అతిధులు విశ్రాంతి తీసుకోటానికి రెండుగదులు సిమెంటు రేకులతో కొత్తగా నిర్మించ బడినట్లున్నాయి. ఒకరు మాకు ఎదురు వచ్చి ఆహ్వానించి ఒక గదిలో కూర్చో పెట్టి వెళ్లారు. ఇంతలో శ్రీమతి ఇందిరాగాంధీ ఇంకెవరితోనో పక్కన మాట్లాడుకుంటూ నేరుగా ఎదురుగావున్న మావద్దకు వచ్చి మా వందనములను స్వీకరించి, ఆమే వందనములు చేసి, మాకంటె ముందుగా వచ్చి వేచి వున్న యితరులను కలిసి వస్తానని చెప్పివెళ్లారు. కొద్దిసేపట్లోనే వారితో మాట్లాడి ఛాయా చిత్ర కార్యక్రమంలో పాల్గొని మా వద్దకు వచ్చారు. మా అందరితో కరచాలనం చేసి, క్షేమలాభములు తెలుసుకుని ఫోటోలో పాల్గొని లోపలికి వెళ్లి పోయారు. ఇందిరాగాంధీ అప్పుడు పదవిలో లేరు. భారతదేశము జనతాప్రభుత్వ పాలనలో శ్రీ మొరార్జీ దేశాయి ప్రధానమంత్రిగా వున్నరోజులవి. తర్వాత మేము బిర్లామందిర్(లక్ష్మీ నారాయణ దేవాలయం) రెండవసారి దర్శించాం. పూర్తిగా పాలరాతితో నిర్మించిన ఈ దేవాలయాన్ని, సుందరాతి సుందరమైన స్వామిని దర్శించి దేవాలయ ఆవరణంతా తిరిగి చూసి తర్వాత మేము బిర్లాహౌస్‌కు (Birla House) వెళ్లాం. భారతదేశాన్నే కాక యావత్ ప్రపంచాన్ని దుఃఖ సాగరంలో ముంచెత్తిన చారిత్రక హత్య జరిగిన ప్రదేశం యిది. జాతి పిత మహాత్మాగాంధీ సాయంసమయ భజనకు వెళ్తూ వినాయకరాం నాథూరం గోడ్సే పిస్తోలు గుళ్లకు బలై 'హే రామ్, హే రామ్ 'అంటూ నేలకొరిగిన స్థలమిదే. చక్కని పచ్చిక మైదానంలో నిర్మించబడ్డ భవనమిది. ఇక్కడ ఎల్లప్పుడు భజనలు జరుపుతుంటారు. మేము వెళ్లింది సోమవారం కనుక ఆ రోజు భజన సిబ్బందికి సెలవు. కాబట్టి భజన కార్య క్రమంలో పాల్గొన లేక పోయాం. తర్వాత మేము చాంద్‌నీ చౌక్‌ను దర్శించి ఎండ తీవ్రంగా వున్నందున స్టేషన్ చేరుకున్నాం. తిరిగి ప్రయాణం సాయంత్రం7గంllనిర్ణయించ బడ్డది. మేము ఇందిరాగాంధీతో కలిసి దిగిన ఫోటోలు తీసుకోటానికి ఫోటోలు తీసిన ఫోటోగ్రాఫర్ సాయంత్రం 5గంll టైముకు ఇందిరా గాంధీ ఇంటి వద్దకు వచ్చి తీసుకొని వెళ్లమని మాకు అడ్రసు యిచ్చాడు. కాని ఎండ తీవ్రత వల్ల 5గంll వరకు వెళ్ల లేకపోయాం. తర్వాత వెళ్లటానికి రైలు బయలు

దేరేవరకు వెళ్లి రాలేమేమోనని ఒక Post Card వ్రాసి Photographer అడ్రసుకు పంపించాం. మా ఫోటోలు Post ద్వారా వారం రోజులలో మేము యాత్రల నుండి తిరిగి వెళ్లేవరకు మా వూరు చేరునట్లు పంపవలసిందిగా వ్రాసి Post చేసాను. ఆ సాయంత్రం రైలు లేటు అయినందున ఢిల్లీ నుండి రాత్రి 9గంll బయలు దేరి తెల్లవారుఝామున 5-00గంll కు మా రైలు ఝాన్సీ చేరింది. బ్రిటీష్ సామ్రాజ్యంతో ప్రథమ స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించిన లక్ష్మీ బాయి పాలించిన నగరం ఇది. వ్యవధి లేనందున పట్టణంలోకి వెళ్లి దర్శించలేకపోయాం. మా మేనేజిమెంటు యిచ్చిన ప్రోగ్రాంలో యిది లేదు. ఈ పట్టణానికి చారిత్రక ప్రఖ్యాతే గాని ఆధ్యాత్మిక ప్రాముఖ్యత లేదు.

30-5-78

ఝాన్సీ నుండి మా రైలు ఉదయం 8గంllకు బయలు దేరింది.ఈ రోజు పగలు, రాత్రి అంతా రైలులో ప్రయాణం చేస్తూనే వున్నాము. సాయంత్రం 7గంllకు మధ్యప్రదేశ్ ముఖ్యపట్టణమైన భోపాల్ చేరుకున్నాం. అక్కడ నుండి వెంటనే భోజన కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఉదయాని కల్లా ఉజ్జయిని నగరం చేరుకున్నాం. గత రెండు రోజులుగా మా భోజనాలు కాఫీ ఫలహారాలు రైలులోనే జరుగుతున్నాయి.

ఉజ్జయిని నగరం 31-5-78

ఉజ్జయినీ నగరానికి అవంతికాపురమనే పూర్వనామం వుంది. సాహసానికి, దానానికి, కళాపోషణకు పేరెన్నిక గన్న విక్రమార్క మహారాజు పాలించిన నగరం. నవరత్నాలని పేరు పొందిన కాళిదాసాది మహాకవులను వరాహమిహిరుని వంటి జ్యోతిష్కులను పోషించిన చక్రవర్తి విక్రమాదిత్యుడు ఈ నగరాన్ని పాలించాడు. ఇతని సోదరుడు భట్టు వేదాంతియై తపస్సు చేసిన గుహ నేటికీ చూడవచ్చు. ఉజ్జయిని నగరం నిప్రానది ఒడ్డునవుంది.

భారతదేశంలో వున్న ద్వాదశ జ్యోతిర్లింగము లోని మహాంకాళేశ్వర లింగం ఈ ఉజ్జయినిలో కళ్లారా దర్శించాం. ఈశ్వరుని దర్శించటానికి ఇక్కడ వున్న దేవాలయం భూమట్టం నుంచి మెట్టు దిగి భుగర్భంలోకి వెళ్లాలి. దేవాలయంలో భూగర్భంలో వున్న లింగానికి, భూమట్టంపై వున్న లింగానికి అభిషేకం చేయటం రివాజు. మొదట ఉదయాన్నే మేము సిప్రానదిలో స్నానం చేసి సమీపంలో వున్న దేవాలయాలను దర్శించుకుని, మహాంకాళేశ్వర దేవాలయానికి వెళ్లాం. ఇచ్చట పెద్దకోనేరు వుంది. కోనేరులో మార్జన చేసుకుని మహాంకాళేశ్వర లింగమును యధావిధిగా అభిషేకము చేసుకుని ముఖ్య ప్రదేశాలు దర్శించటానికి బయలు దేరాం. మొదట విక్రమార్కుని గద్దె దర్శించుకున్నాం. ఇది శిధిలావస్థలో వుంది. దీనికి బ్రహ్మాండ మైన స్థలపురాణం వుంది. ఈ పట్టణంలో చూడ వలసినవి అనేక దేవాలయాలు, చారిత్రకప్రదేశాలు వున్నాయి. మాకు వ్యవధి లేనందున ముఖ్యమైనవే చూసి తృప్తి చెందాం. తర్వాత మేము మహాంకాళి దేవాలయాన్ని దర్శించాం. ఇది నగరానికి చేరువలోనే వుంది. ఇక్కడ కాళీమాత విగ్రహము అతి సుందరంగాను, భీకరంగాను వుంది. ఈ దేవాలయంలోనే కాళిదాసు మహాకవికి ఆయన మూఢ భక్తికి మెచ్చుకుని దేవి గుడి తలుపుసందులో నుంచి నాలుక జాపమని కోరి అర్ధరాత్రి కాళిదాసు నాలుక పై బీజాక్షరాలు వ్రాసినట్లు చరిత్ర చెపుతుంది. తర్వాత కాళిదాసు సంస్కృత భాషలో మహాకవిగా ప్రసిద్ధి చెందాడు. ఆయన ఎన్నో ఉద్గ్రంధాలు, చరిత్రలు సంస్కృత భాషలో రాసాడు. వాటిలో ముఖ్యమైనవి: అభిజ్ఞాన శాకుంతలం, కుమార సంభవం, మేఘ సందేశము, రఘువంశము. మేము కాళిమాత దేవాలయంలో పూజలు పూర్తి చేసుకుని భట్టి తపస్సు చేసిన గుహను దర్శించాం. ఈ గుహ సిప్రానది ఒడ్డునవుంది. లోపలికి వెళ్లి దర్శించటం ప్రమాదంతో కూడినదని అన్నందువల్ల మేము గుహలోనికి వెళ్లటానికి సాహసించలేదు. విక్రమాదిత్యునిచే నిర్మించ బడ్డ వేధశాల ఇక్కడున్నట్లు చెప్పగా విన్నాము కాని సమయము లేనందున దర్శించలేకపోయాం.

ఉజ్జయిని పట్టణం అతిపురాతనమైంది. ఈ పట్టణం రాజధానిగా చేసుకుని ఎందరో రాజులు భారతదేశాన్ని పాలించారు. ఈ పట్టణానికి ఎంతో చరిత్ర వుంది. భట్టి విక్రమార్కుని కథలు మన దేశంలో ఎంతో ప్రసిద్ధి చెందినాయి.

ఉజ్జయిని 1-6-78

ఈ రోజు ఎండ తీవ్రంగా వుండి సాయంత్రం 5గం॥కు మేము ఉజ్జయిని నుండి బయలు దేరాం. తెల్లవారి సాయంత్రం అహమదాబాద్ చేరుకున్నాం.

అహమదాబాద్ 2-6-78

మేము ఆ రాత్రి విశ్రాంతి తీసుకుని ఉదయమే గుజరాత్ పట్టణంలో ముఖ్యప్రదేశాలు చూడడానికి బయలు దేరాం. మొదట మేము సబర్మతి ఆశ్రమాన్ని దర్శించాం. ఈ ఆశ్రమం సబర్మతి నది ఒడ్డు నవుంది. ఈ ఆశ్రమానికి రాజకీయ ప్రాధాన్యత కలదు. ముఖ్యంగా భారతదేశ స్వాతంత్ర్య సమరానికి ఎంతో సంబంధం వుంది. జాతిపిత మహాత్మాగాంధీ తన రాజకీయ జీవితం మొదటి ఘట్టం ఈ ఆశ్రమం నుంచే ఆరంభించారు. మహాత్ముడు ఈ ఆశ్రమంలో నివసిస్తూ ఉద్యమాన్ని నడిపాడు. ఈ ఆశ్రమం ఎంతో ప్రశాంతంగా వుంది. గాంధీజీ నివసించిన కుటీరం, వాడిన వస్తువులు భద్రపరచి వుంచారు. ప్రస్తుతం ఈ ఆశ్రమం గాంధీజీ వస్తు ప్రదర్శన శాలగా మార్చారు. భారత దేశ స్వాతంత్ర్యసమ పార్టనలో గాంధీజీ చేపట్టిన వివిధ కార్యక్రమాలు, గాంధీజీ దర్శనార్థం వచ్చిన స్వదేశ నాయకులు, మరియు విదేశ యాత్రికుల ఛాయా చిత్రాలు నిలువెత్తువి చూచి ఆనాటి అనుభూతుల్ని తిరిగిపొందాం. పెద్ద పెద్ద దేవదారువృక్ష ఛాయల్లో వున్న ఈ ఆశ్రమం నాటికీ నేటికీ స్వదేశ యాత్రికులనే గాక ప్రపంచ యాత్రికుల దృష్టిని సైతం ఆకట్టుకుంటూనే వుంది. దీని ప్రక్కనే గాంధీజీతో నడపబడిన వృత్తి ప్రాథమిక పాఠశాలను (Basic School) దర్శించాం. తరువాత హనుమాన్ దేవాలయాన్ని చూసాం. అహమదాబాద్ గుజరాత్ పట్టణానికి యిటీవలి వరకు రాజధానిగా వుండేది. ఆసియా ఖండంలోనే ప్రథమ స్థానాన్ని పొందిన నూలువస్త్రాల మిల్లులు వున్న ప్రదేశం యిది. వస్త్ర పరిశ్రమకు కాణాచి. ఈ ఒక్క పట్టణంలో 300లకు పైగా మిల్లులున్నాయి. అధిక జనాభావల్ల, మిల్లులవల్ల ఏర్పడిన కలుషిత వాతావరణం వల్ల గుజరాత్ రాష్ట్ర ముఖ్యపట్టణాన్ని అహమదాబాద్ నుండి సమింపంలో అత్యాధునిక పద్ధతులతో నిర్మింపబడిన

గాంధీనగర్‌కు మార్చారు. ఈ పట్టణానికి జాతిపిత అయిన మహాత్మా గాంధీ పేరు పెట్టారు. అహమదాబాద్‌లో కూడ ఎన్నో చూడవలసిన ముఖ్య ప్రదేశాలువున్నాయి కాని వ్యవధి తక్కువ వున్నందున, రోజు రోజుకు ఎండతీక్షణం అవుతున్నందున అన్నీ చూడలేక పోయాం. ఈ రోజు రాత్రి 10గంIIకు మా బస్‌లు ద్వారకా నగరాభిము ఖంగా బయలుదేరాయి.

పంచద్వారకలు 3-6-78

శ్రీకృష్ణుడు ద్వారకానగరాన్ని తన రాజధాని నగరంగా చేసుకుని దేశాన్ని పరిపాలించాడు. మధుర నుండి తన రాజధానిని శ్రీకృష్ణుడు సముద్ర మధ్యం లో నిర్మించబడ్డ ద్వారకకు మార్చాడు. ద్వారక అయిదు భాగాలుగా విభజింపబడివుండేది. అందువల్లనే దీనిని పంచద్వారకలని అంటారు. వాటిని 1నేటి ద్వారక 2.రుక్మిణీ ద్వారక 3. మధుర ద్వారక 4. గోమతి ద్వారక 5. మొIIవి. మేము ఈ రోజు పగలు 11గంIIకు సముద్రపు ఒడ్డునవున్న అకోలా చేరుకున్నాం. అహమధాబాద్‌లో రాత్రి10గంIIకు బయలుదేరి ఏకధాటిగా 13 గం.లు 510 కి.మీ. ప్రయాణం చేశాం. మధ్యలో అరగంటదాకా కాలకృత్యాలు తీర్చుకోటానికి ఆగవల్సివచ్చింది. సముద్రపు అంచున ఒక ప్రభుత్వ అతిధిగృహం అకోలాలో వుంది. మాకు ఈ అతిధి గృహంలో వంటలు, భోజనాలు ఏర్పాటు చేసారు. మేము బస్‌లు దిగిన వెంటనే పడవలలో రుక్మిణీ ద్వారకకు వెళ్లాం. ఇది అకోలా రేవుకు 5,6 కి.మీ. వుంటుంది. ఎత్తైన పర్వతాలపై ఈ దేవాలయాలు వున్నాయి.వీటిలో చక్కగా పూజాదికార్యక్రమాలు జరుగుతున్నాయి. శ్రీకృష్ణుడు రుక్మిణీ అమ్మవారితో యిక్కడకు వచ్చి విశ్రమించేసాడని అందువల్ల ఈప్రాంతానికి రుక్మిణీ ద్వారక అనే పేరు ఆనాటి నుంచే వుందని చెపుతారు. రుక్మిణీద్వారకలో సుమారు 2గంIIపాటువుండి. దేవాలయాలన్ని దర్శించి పూజలు చేసుకుని తిరిగి పడవలో లాంచీలలో అకోలా చేరుకున్నాం. రుక్మిణీ ద్వారకలో అనేక దేవాలయాలు, కట్టడాలు పురాతన కాలం నాటి వన్ని శిధిలమైపోతున్నాయి. ఇంకా కొంత కాలం వరకే యిక్కడి విశేషాలన్ని చూడవచ్చు. అకోలా వచ్చి సముద్రపు ఒడ్డున వున్న మంచి నీళ్ల కుళాయిలవద్ద స్నానాలు చేసి భోజన కార్యక్రమాలు

ముగించుకున్నాం. అకోలా పట్టణరేవుకు భారతదేశ రక్షణ దృష్ట్యా చాల ప్రాధాన్యత వుంది. ఇక్కడ భారతదేశపు వైమానిక, సముద్రసైన్యాలు వుంటాయి. ఇది పెద్ద మిలిటరీ కేంద్రం.

మేము భోజన కార్యక్రమాలు ముగించుకుని వరుసగా పంచద్వారకలకు సంబంధించిన యితర పట్టణాలు సందర్శించుకుంటూ సాయంత్రం 3గం॥కు ద్వారక చేరుకున్నాం. ఇక్కడ దేవాలయాలన్నీ ఇంచుమించు సముద్రమధ్యంలోనే సముద్రపు వొడ్డులో వున్నాయి. శ్రీకృష్ణుడు పరిపాలించిన ద్వారక సముద్ర మధ్యంలో మునిగి పోయిందంటారు. ఇపుడున్న ద్వారక తర్వాత నిర్మింపబడ్డదని పురావస్తు శాఖవారి అభిప్రాయం. ఆదిశంకరుల వారిచే స్థాపించబడిన శ్రీ శారదా పీఠము గోమతీద్వారకలో వుంది. చాల సుందరమైన మందిరం యిది. అది శంకరులచే స్థాపించబడిన అయిదు పీఠాలలోనిది ఈ శైవపీఠము. ద్వారకలో దేవాలయాలు కూడ అయోధ్యలో మాదిరి గోపురాలు లేని దేవాలయాలే. ఇవి మామూలు మేడల మాదిరిగా వున్నాయి.

సాయంత్రం 5 గం.కు మేము ద్వారక నుంచి బయలుదేరి సముద్రపు వొడ్డున గల మరొక మార్వాడే దేవాలయాన్ని రాత్రి 7 గం. వరకు చేరుకున్నాం. దీన్ని హరిషడ్ మఠం అంటారు. ఇది ద్వారకలో మేము చూచిన జైన దేవాల్లయం వంటిదే. దీని ప్రక్కన గల సత్రంలో మేము ఆ రాత్రి నిద్రించాము.

4-6-78

ఈ రోజు ఉదయం 5గం॥కు మా బస్ హరిషడ్ మఠం మందిరం దగ్గర నుండి బయలు దేరి అక్కడికి 95కి.మీ. దూరాన వున్న పోర్ బందర్ చేరుకున్నది. పోర్‌బందర్ భారత జాతిపిత మహాత్మా గాంధీ జన్మస్థానం. కఠియవార్ పట్టణంలో ఈ పోర్‌బందర్ గొప్పరేవు పట్టణం. ఇక్కడ మొదటగా మేము దర్శించింది, భారత మందిర్ అనే ఒక భవనం. ఈ భవనంలో పురాణ కాలం నుంచి నేటి జాతీయ నాయకులవరకు చక్కని నిలువెత్తు తైల విగ్రహాలు ప్రతిష్ఠింపబడివున్నాయి. ఒక మతమని ఒక కులమని లేక సర్వమత స్థాపకుల విగ్రహాలు యిక్కడ వున్నాయి. కాళిదాసు నుండి రవీంద్రుని వరకు,రుక్మిణి నుండి ఝాన్సీలక్ష్మీ బాయివరకు, అర్జునుని నుంచి ఛత్రపతిశివాజీ వరకు ఎన్నో విగ్రహాలు, పురాణ చారిత్రిక గాధలు తైలవర్ణ చిత్రాల రూపంలో ఇక్కడ ప్రదర్శింప బడివున్నాయి. స్థూలంగా భారత దేశాన్ని రసప్లావితం చేసిన వ్యక్తు లందరిని యిక్కడ దర్శించ వచ్చు. ఈ భవనం చుట్టూ చక్కనితోటవుంది.

దీనిని జవహర్ లాల్ నెహ్రూ వేధశాల అని పిలుస్తారు. కలకత్తాలోని బిర్లా వారిచే నిర్మించబడినంత వేధశాల కాదిది. ఈ వేధశాలపైన శాంతి కపోతాన్ని ఎగర వేస్తున్న నెహ్రూ విగ్రహం పతిష్టింప బడివుంది. వేధశాలలో సుమారు ఒక గంట సేపు నక్షత్ర చలనం, గ్రహ గమనం, అనేక ఖగోళ విషయాలు చూసాం. అక్కడ నుండి మేము పోర్ బందర్ లోవున్న ఒక సత్రంలో మకాం చేసాము. భోజన కార్యక్రమాలు ముగించుకుని పూజ్య బాపూజీ జన్మించిన భవనాన్ని దర్శించాం. ఇది రెండంతస్తుల భవనం. చాల పురాతన మైంది. గాంధీజీ స్మృతి చిహ్నంగా ఈ భవనాన్ని భారత జాతికి అంకితం చేయటం జరిగింది. దీని ప్రక్కనే "నానాజీ భాయ్ కాళీదాస్ మహతా" చే అయిదు లక్షల రూ||ల వ్యయంతో నిర్మించ బడ్డ "కీర్తి మందిరం" అనే భవనం వుంది. దీని ప్రారంభోత్సవము 1950 సం|| మే నెల 27వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్‌చే చేయించ బడింది. ఈ భవనం కూడ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. భారత దేశంలోని వివిధ మత సాంప్రదాయాలననుసరించి ఒక్కొక్క మతానికి ఒక్కొక్క ద్వారం చొప్పున మహమ్మదీయ, జైన, క్రైస్తవ, సిక్కు సాంప్రదాయాలు ఇక్కడ చూడవచ్చు. ఈ భవనపు హాలులో గాంధీజీ, కస్తూరి బాల నిలుకెత్తు తైల వర్ణ చిత్రాలు ప్రతిష్ఠింప బడి వున్నాయి. ఈ భవనం రెండంతస్థులది. ఇది గాంధీజీకి అంకితం చేయ బడ్డది. తర్వాత శ్రీ కృష్ణుని చిన్న నాటి స్నేహితుడు (సుదామ) కుచేలుడు స్వామికి అటుకులు తినిపించి అఖండ ధనసంపదల నార్జించిన దేవాలయాన్ని దర్శించాం. ద్వాపర యుగంలో యిక్కడ పెద్ద పెద్ద భవనాలుండేవేమో కాని ప్రస్తుతం మాత్రం విశాలమైన ఆవరణలో ఒక పాడు పడిన నుయ్యి, చిన్న సొరంగంలో కుచేలుని ఆలయం మాత్రం వున్నాయి. ఆ నూతిని గురించి విచారించగా అది ద్వాపర కాలం నాటిదని చెప్పారు,అక్కడి పెద్దలు. శ్రీ కృష్ణునికి బాల్యంలో సహాధ్యాయి అయి తర్వాత భక్తుడై స్వామిని దర్శించి తరించిన కుచేలుని మరోపేరు సుదాముడు. ఈ సుదామ దేవాలయ పోషణ సరిగా జరుగుతున్నట్లు లేదు. నిత్యనై వేద్యాలు మటుకు జరుగు తున్నాయి. ఆ ప్రక్కనే అన్నపూర్ణ ఆలయం వుంది. జయపూర్ వాస్తు పద్ధతిలో నిర్మింపబడ్డది యీ ఆలయం. అమ్మవారి విగ్రహానికి పూజలు జరిపించాం. ఆపైన కేదార్‌నాథ్ దేవాలయం వుంది . ఇక్కడ స్వామి కేదారేశ్వరుడు.

ఇది చాల గొప్ప దేవాలయం.పూజాపురస్కారములు సక్రమంగా జరుగుతున్నాయి. సాయంత్రం 5గంIIలకు మా బస్‌లు సోమనాథ్ దేవాలయాభిముఖంగా బయలు దేరాయి. దారిలో మాధవపురం అనే చిన్న గ్రామం తగిలింది. ఈ గ్రామం చాల చిన్నదైనా అక్కడ వున్న గుడి, గుడిలో విగ్రహాలు చాల గొప్పవి. స్వామి పేరు వేణుమాధవుడు. అక్కడి నుండి మా బస్‌లు సోమనాథ్‌కు బైలుదేరాయి. మార్గమధ్యంలో ఒక పెద్ద పట్టణాన్ని దాటాం. దీని పేరు "వీర వాక". బహుశ యిది జిల్లా కేంద్రం కావచ్చు. రాత్రి 9గంII సోమనాథ్ చేరుకున్నాం. గుడి తలుపులు మూసే సమయమైంది. వెంటనే దేవాలయానికి వెళ్లి ధూళి దర్శనం చేసుకుని వచ్చాం. మా బస ముసాఫిర్ ఖానాలో ఏర్పాటు చేసారు. హైదరాబాద్‌లో నాంపల్లి స్టేషన్‌కు సమీపంలో వున్న ముసాఫిర్ ఖానా మోడల్‌లో కట్టబడి వుంది. చాల విశాలమైన గదులు. పెద్ద ఆవరణం. మంచి నీళ్ల వసతి చాల సౌకర్యంగా వుంది. ఈ ముసాఫిర్ ఖానా దేవాలయానికి అతి చేరువలో వుంది. భోజనాలు ముగించి నిద్రించాం.

సోమనాథ్ 5-6-78

ఉదయాన్నే లేచి కాల కృత్యాలు తీర్చుకుని స్నానాలు చేసి దేవాలయం వద్దకు వెళ్లాం. సోమనాథ్ దేవాలయం చారిత్రకంగానే కాక పౌరాణికంగా కూడ ప్రసిద్ధి చెందింది. ఇది సరస్వతీ నది సంగమ ప్రదేశం. ప్రభాస తీర్థం అని ప్రసిద్ధి చెందింది. అర్జునుడు ఈ ప్రభాస తీర్థంలో స్నానం చేసాడట. ఈ ప్రభాస తీర్థంలోనే యాదవ కులంలో జన్మించిన ముసలం మూలంగా ఆ కులం సర్వ నాశనమైంది. అవతార మూర్తులు ప్రతిభా సంపన్నులైన బలరామకృష్ణుల కళ్ల ముందే యాదవ కులం యావత్తూ తుడిచి పెట్టుకు పోయింది. ఐనా ముని శాప కారణంగా బలరామకృష్ణులు ఏమీ చెయ్యలేక పోయారు. రామావతారంలో వాలిని చెట్టు చాటు నుంచి కొట్టి చంపిన కారణంగా కృష్ణావతారంలో వాలి బోయవాడుగా జన్మించి కృష్ణ నిర్యాణానికి కారకుడౌతాడు. చెట్టు చాటున విశ్రమించిన శ్రీ కృష్ణుని పాదాన్ని లేడి శరీరంగా భావించి బోయ వాడు విడిచిన బాణానికి ప్రాణ త్యాగం చేసి అవతారం చాలిస్తాడు శ్రీ కృష్ణుడు. ఈ ప్రదేశంలో

ప్రస్తుతం శ్రీ కృష్ణుని విగ్రహం, బోయవాడు బాణం విడవటం, శ్రీ కృష్ణుడి కాలికి బాణం తగిలి గాయమై రక్తము స్రవించటం ప్రత్యక్షంగా కనుపిస్తాయి. మరణించిన శ్రీ కృష్ణుని అంత్యక్రియలు సరస్వతీ సముద్ర సంగమ స్థానంలో నిర్వహించ బడినాయి. ఇక్కడ స్వామి విగ్రహం ప్రతిష్టించారు భక్తులు. ఈ రెండూ కాక యిక్కడ లక్ష్మీ నారాయణ దేవాలయం కూడ వుంది. దీనికి దగ్గరలో శారదామఠం వుంది. ఇక్కడొక చోట భారత దేశంలో ఆది గురువు శంకరా చార్యులచే ప్రతిష్ఠింప బడ్డ ద్వాదశ జోతిర్లింగాలు ఎక్కడెక్కడున్నాయో భారత దేశపటంలో యీ విధంగా చూపించబడ్డాయి.

1)	కేదార్‌నాథ్	-	కేదారేశ్వరుడు
2)	సోమనాథ్	-	సోమేశ్వరుడు
3)	వారణాశి	-	విశ్వనాధుడు
4)	ఉజ్జయినీ	-	మహాంకాళేశ్వరుడు
5)	శ్రీ శైలం	-	మల్లికార్జునుడు
6)	ఎల్లోరా	-	ధూపలేశ్వరుడు
7)	రామేశ్వరం	-	రామలింగేశ్వరుడు
8)	నాసిక్	-	త్రయంబకేశ్వరుడు
9)	ఢాకిన్యాం	-	భీమ శంకరుడు
10)	ఓంకారం	-	మమతీశ్వరుడు
11)	పర్లి	-	వైద్యనాధేశ్వరుడు
12)	దారుకావని	-	నాగేశ్వరుడు.

తరువాత మేము చరిత్ర ప్రసిద్ధి పొందిన సోమనాధ దేవాలయం పాతది, కొత్తది దర్శించాం. మొట్టమొదటగా యీ దేవాలయం ఎవరు నిర్మించారన్నది వివాదాస్పదంగా వుంది. కాని పశుపతేయుల నిర్మాణంలో వివాదం లేదు.క్రీస్తు శకారంభంలో దేవాలయ నిర్మాణం జరిగి యుండ వచ్చును. తరువాత ఏ కారణం

చేతనో శిథిలమైన యీ దేవాలయాన్ని క్రీ.శ. 649లో హూణరాజులు పునరుద్ధరించారు. క్రీ.శ. 722లో అరబ్బుల దండయాత్రలో దేవాలయం శిథిలం చేయ బడ్డది. తర్వాత చాళుక్యులచే క్రీ.శ. 800లో ఈ దేవాలయం మళ్లీ పునర్నిర్మాణం చేయ బడ్డది. క్రీ.శ. 960లో అనంద దేవుడనే ఔత్తరాహిక మహారాజు తన సైన్యంతో వచ్చి సోమేశ్వరుని పూజించారట. టర్కీ రాజైన మహమ్మద్ గజినీ అనేక సార్లు దండెత్తి ఓడి పోయి చివరకు తొమ్మిదవ సారి క్రీ.శ.1026 సం॥ జనవరి నెల ఆరవ తేదీన పెద్ద సైన్యంతో దండెత్తి కొన్ని రోజుల వరకు దేవాలయం చుట్టు ముట్టి వుండి, లోపలివారికి అన్నపానాదులు చేర నివ్వకుండా వుంచినందువల్ల చివరికి లోపలి సైన్యం దేవాలయ సిబ్బందితో సహా లొంగి పోయారు. దానితో గజినీ సైన్యం కోటను స్వాధీన పరచుకుని దేవాలయంలో ప్రవేశించి పూర్తిగా సంపదను కొల్లగొట్టుకుని వెళ్లారు. ఈ సంపద అంతా మణుగుల కొద్దీ వెండి బంగారం అనేక వజ్ర వైడూర్య, గోమేధిక పుష్యరాగాది మణులతో మహమ్మద్ గజనీ స్వాధీనమైంది. ప్రసిద్ధ మైన సోమేశ్వర లింగాన్ని అపవిత్రం చేసి సముద్రంలో పార వేసినట్లు చరిత్ర చెప్తోంది. ఆనాడు ఈ దేవాలయ రక్షణకు 50,000ల మంది భక్తులు మహమ్మద్ గజినీ సైన్యంతో పోరాడి ప్రాణ త్యాగం చేసారు. సోమనాథ దేవాలయపు గర్భాలయపు గోపురం బంగారం తొడుగు పొదిగినదట. గర్భాలయం లోపలి గోడలు మణులతో, వజ్రవైడూర్యాలతో పొదిగి వున్నాయిట. ఈ విధంగా దోచుకొని వెళ్లబడ్డ వాటిలోదే యీ ప్రపంచ ప్రసిద్ధి చెందిన కోహినూర్ వజ్రము అని అంటారు.

తర్వాత ఈ దేవాలయం దగ్గర 1783లో ఇండోర్ రాణి అహల్యాబాయిచే నూతన దేవాలయం నిర్మించ బడింది. ప్రస్తుతం యాత్రికులు ఈ అహల్యా బాయిచే నిర్మించ బడ్డ దేవాలయంతో పాటు స్వాతంత్ర్యానంతరం సర్దార్ వల్లభాయి పటేల్ పూనిక వల్ల ఇరువై అయిదు లక్షలఖర్చుతో పునర్నిర్మింప బడుతున్న పాత దేవాలయాన్ని కూడ చూడ వచ్చు. సర్దార్ వల్లభాయి పటేల్‌చే పునర్నిర్మించ బడ్డ దేవాలయం ప్రాచీన శిథిలాలపై నిర్మించ బడింది. దానికి దగ్గరలోనే సముద్రములో నుండి ప్రాచీన లింగమును ఉద్ధరించి రాణి అహల్యాబాయిచే ప్రతిష్ఠించ బడ్డ ఆలయం వుంది. ప్రస్తుతం భక్తులు ఈ

ఆలయంలో అభిషేకాలు జరుపుకుని కొత్తగా నిర్మించబడ్డ ఆలయంలో పూజలు జరుపు కుంటున్నారు. రాణి అహల్యాబాయి నిర్మించిన ఆలయంలో లింగాన్ని భద్రత కోసం భూ గర్భంలో నిర్మించబడ్డ మాళిగలో ప్రతిష్ఠించారు. భూమట్టంపై భక్తులకు కనిపించే విధంగా మరొక లింగం ప్రతిష్ఠించారు. ప్రస్తుతం భక్తులు ఈ రెండు చోట్ల అభిషేకాలు జరుపుకోవచ్చు. సర్దార్ పటేల్ మరణానంతరం మొరార్జీ దేశాయ్ దీనికి అధ్యక్షులుగా వుండి ఈ పునరుద్ధరణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం అహల్యాబాయిచే నిర్మించ బడ్డ దేవాలయంలో అనువంశికంగా చేయు పూజలు పునరుద్ధరింప బడిన దేవాలయంలో నిర్వహింప బడుతున్నాయి. ఇక్కడి పూజారులు వేద వేదాంగములు పఠించిన గొప్ప పండితులు. వేదాంత కోవిదులు. గొప్ప ఘనాపాఠీలు. ఈ దేవాలయ నిర్మాణానికి 8-5-1950 సంIIలో నావనగర్ మహారాజు జాంసాహెబు దిగ్విజయ సింహజీచే శంకుస్థాపన చేయబడింది. ఆయన ఆకస్మిక మరణానంతరం ఆయన భార్యచే స్మృతి చిహ్నంగా యిక్కడ ముఖ మంటపం నిర్మింప బడింది. పునరుద్ధరణ గావింపబడ్డ దేవాలయానికెదురుగా వున్న పెద్ద మైదానంలో సర్దార్ వల్లభాయిపటేల్ కాంస్య విగ్రహం ప్రతిష్టింప బడివుంది. మేము అహల్యా బాయిచే నిర్మింపబడ్డ దేవాలయంలో అభిషేకం చేసుకుని పునరుద్ధరణ గావింప బడిన దేవాలయంలో పూజలు జరుపుకుని 2గంII వరకు ముసాఫిర్ ఖానాకు వచ్చి భోజన కార్యక్రమాలు ముగించుకుని విశ్రాంతి తీసుకున్నాం.

ఇక్కడ నుంచి సాయంత్రం 3-30నిIIలకు అహమదాబాద్‌కు బయలు దేరాం. దారిలో జునాఘడ్ అనే నగరంలో నరసింహస్వామి దేవాలయాన్ని దర్శించుకున్నాం. గుజరాతీ ఫక్కీలో నిర్మింప బడ్డది యీ దేవాలయం. సోమనాథ్ నుండి 10 కి.మీ. ప్రయాణం చేసిన తర్వాత మార్గమధ్యంలో విర్‌పూర్ అనే గ్రామంలో పూర్వం 'జీర్లారాం' అనే నిరతాన్న దాత వుండే వాడు. కొన్ని తరాల పూర్వం - ప్రస్తుతం అతని ముని మనుమలు నేటి వరకు కూడ ఆ నిరతాన్న దానాన్ని కొనసాగిస్తున్నారు. వీరికి కుల, మత, పేద, ధనిక తారతమ్యము లేదు. ఉదయం 9గంII నుండి రాత్రి 9గంII వరకు అన్నదాన యజ్ఞం సాగుతూ వుంటుంది. ఇది చిన్న దేవాలయం లాంటిది. ఇక్కడ వున్న మఠంలో నిరంతరం పూజలు, భజనలు, భక్తులచే జరుప బడుతుంటాయి. రోజూ కొన్ని వేల మంది భుజిస్తూ

వుంటారు. చక్కని పాలరాతితో చేయబడ్డ శ్రీ సీతారామలక్ష్మణులున్న మందిరం వీరి గృహంలో వుంది. ఇక్కడ నిత్యం స్వయంగా వీరు పూజాదులు నిర్వహిస్తారు. స్వామి వారి ఆజ్ఞానుసారం నిరతాన్న దానం చేసే వాడట కీ.శే. జీర్లారాం. ఈయన శ్రీ రామ భక్తుడు. వీరి భక్తికి మెచ్చి శ్రీ రాముడు వీరికి సాక్షాత్కరించినట్లు ఇక్కడి ప్రజలు చెపుతారు. ఒక సారి నేను చరిత్రలో చదివిన (దక్షిణం) తంజావూరు నాయకుడు విజయరాఘవ నాయకార్ చేసిన నిరతాన్న దాన యజ్ఞం స్ఫురణకు వచ్చింది. ఆ మహారాజు రోజుకు పన్నెండు వేల మంది భక్తులు భుజించిన మీదట వినిపించే ఘంటారావం వినిగాని తాను భుజించే వాడు గాదట.

మేము అ రాత్రంతా బస్‌లలో ప్రయాణం చేస్తూ తెల్లవారు జామున 5గంllలకు అహమదాబాదు రైలు స్టేషన్‌కు సురక్షితంగా చేరుకున్నాం. నాలుగు రాత్రుళ్ల నాలుగు పగళ్ల ఎడతెగని ప్రయాణం వల్ల ఎండ దెబ్బకు మేమంతా అలసి పోయాం. స్టేషన్ చేరగానే స్నానాలు చేసి నిద్రించాం. ఈ రోజంతా పూర్తిగా విశ్రాంతి దినమే. ఆ సాయంత్రం అహమదాబాద్ వీధులలో ముఖ్యమైన దృశ్యాలు చూసి వచ్చి మేం రాత్రి భోజనాల ముగించిన తర్వాత 11గంllకు మా రైలు బయలు దేరి సూరత్ దిశగా ప్రయాణం సాగించింది. తెల్లవారి 6గంllకు సూరజ్ తో పాటు సూరత్ చేరుకున్నాం.

నాసిక్ 7-6-78

మేము సూరత్‌లో సాయంత్రం వరకు వున్నామే కాని స్టేషన్ నుంచి బయటికి వెళ్ల లేదు. సూరత నూలు పరిశ్రమకు, వస్త్ర పరిశ్రమకు పేరెన్నికగన్న పట్టణం. ఇక్కడ చూడ తగ్గ విశేషాలు ఏమీ వున్నట్లు మాకు తెలియదు. మా ప్రోగ్రాంప్రకారం యిక్కడ ఆగేది లేదు కనుక సాయంత్రం 4గంll బయలు దేరింది. ఈ సారి మా గమ్య స్థానం నాసిక్.

మా రైలు నాసిక్ చేరుకునే వరకు మధ్యాహ్నం రెండున్నర గంటలైంది. నాసిక్ సమీపంలో70-80 కి.మీ. దూరంలో అజంతా, ఎల్లోరా గుహలు వున్నాయి. ఇవి ప్రపంచం లోనే గొప్ప యాత్రా స్థలాలుగా పేరు గాంచినాయి. సుమారు 120 కి.మీ. దూరంలో శిర్ది సాయిబాబా సమాధి వుందని తెలుసుకున్నాం. వ్యవధి ఎక్కువ లేనందున ఈ రెండు ప్రదేశాలలో ఒకటి మాత్రమే వెళ్లే అవకాశం వున్నందువల్ల మేము "శిర్ది" వెళ్లి రావటానికి నిర్ణయించుకున్నాం. మేము మరి కొందరము టాక్సీలలో బయలు దేరి వెళ్లాం. ఇదంతా బీద ప్రదేశంలా కనుపించింది. షిర్ది సాయిబాబా పెరిగి, యోగిగా, సన్యాసిగా, బాబాగా ప్రఖ్యాతి పొంది ఈ ప్రదేశం నందే నిర్యాణం చెందాడు. మొదట భక్తులు సమాధి కట్టి ఆ తర్వాత దాని చుట్టూ ఆలయంగా భజన మందిరంగా నిర్మించారు. యాత్రికుల వసతి కొరకు అనేక గదులు, సత్రాలు వున్నాయి. ఇక్కడ బాబా సంఘం వారిచే ఒక కాంటిన్ నిర్వహించ బడుతూ వుంది. గదులు గాని, క్యాంటీన్‌లో భోజనం గాని, టీ దుకాణంలో టీ గాని నామమాత్రంగా డబ్బులు తీసుకుంటారేగాని లాభసాటిగా మాత్రం కాదు. దేవాలయం వెనుక భాగంలో బాబాగారి దివ్యజ్యోతి (ధుని)ఎప్పుడూ వెలుగుతూ వుంటుంది.

భక్తులు అక్కడికి స్వయంగా వెళ్లి భస్మం తీసుకుని వెళ్తుంటారు. మేము కూడ భస్మం స్వీకరించాం. మేము షిర్ది వెళ్లే వరకు సుమారు రాత్రి 8గం|| కావచ్చింది. ఆ రోజు అదృష్టవశాత్తు గురువారం కావటంతో భజన కార్యక్రమం ప్రారంభమైంది. మేము కూడ భజన కార్యక్రమంలో పాల్గొన్నాం. ఆనంద భరితుల మౌతూ రాత్రి 10 గం|| వరకు అక్కడే వున్నాం. బాబా సమాధి పక్కనే ఆయన పాలరాతి విగ్రహం వుంది. సాయంతరం భజనానంతరం హారతి యిస్తారు. వెనక వున్న యజ్ఞ కుండంలో భక్తులు ఊదొత్తులు, సాంబ్రాణి వేస్తారు. ఈ భస్మరాసిని భక్తులు విభూతి బొట్టుగా ధరిస్తారు. ఈ విభూతి పొట్లాలు భయ జ్వరాలలో గొప్పగా పని చేస్తాయని యిళ్లకు తెచ్చుకుంటారు. రాత్రి రెండు గం|| వరకు తిరిగి నాసిక్ చేరుకున్నాం. ఆ రాత్రి దారిలో వాన కురిసింది. వాతావరణం

మేఘావృతమై చల్లని గాలులు వీస్తున్నాయి. పెద్ద వాన పడుతుందేమో రేపటి కార్యక్రమమునకు అందుకోలేమేమోనని మొదలు భయపడ్డాం కాని బాబా గారి దయ వల్ల మేము క్షేమంగా వెళ్లి మా స్టేషన్ చేరుకున్నాం.

నాసిక్ -త్రయంబకం 9-8-78.

నాసిక్ పట్టణానికి 10 కి.మీ. దూరం వుంటుంది, త్రయంబకం. ఇక్కడ పురాతనమైన త్రయంబకేశ్వరాలయం వుంది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో యిది కూడ ఒకటి. ఇది పవిత్ర గోదావరి నది ఒడ్డున వుంది. గోదావరి నది త్రయంబకం మధ్యలో నుండి పారుతుంది. గోదావరి పుట్టుక స్థలం యిక్కడికి సుమారు 5, 6 కి.మీ. దూరం వుంటుంది. గుట్టలపైన గోదావరి పుట్టిన స్థలం వుంది. గోదావరి పుట్టిన చోట కొద్ది పాటి కాలవగా బయలు దేరి పోను పోను భద్రాచలంలో శ్రీ రామునికి పాదాభిషేకం చేస్తూ తర్వాత అఖండ గోదావరిగా పేరు పొంది అయిదు పాయలుగా చీలి సముద్ర గర్భంలో కలసి పోతుంది. గోదావరి పారినంత మేర పొలాలను సస్యశ్యామలంగా మార్చేస్తుంది.

త్రయంబకం లోని దేవాలయం విభిన్న ప్రదేశాలలోని శివాలయాలకు అతీతం గావుంది. ఆలయంలో ఈ శివలింగం జల లింగం. ఇక్కడ పానువట్టం పైలింగాకృతి ఉబ్బెత్తుగా కనిపించదు. సుమారు అడుగులోతు గుంట మాత్రం కనుపిస్తుంది. ఆ గుంటలోకి చెయ్యి పెట్టి బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల మూర్తులను మూడు వైపుల నుండి తడిమి గుర్తించాల్సి వుంటుంది. ఇది త్రిమూర్త్యాత్మకమైన లింగం కనుక త్రయంబకేశ్వరుడని పేరు వచ్చింది. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే లింగాన్ని స్పృశించి ధన్యత పొందుటకు పురుషులు మాత్రమే అర్హులని, స్త్రీలకు దృశ్యానందమే కాని స్పర్శానందం లేదని అంటారు. అందు వల్ల స్త్రీలను గర్భ గుడిలోనికి అనుమతించరు. ఉత్తరాది దేవాలయాలలో వలే కాక యిచ్చటి పూజారులు పట్టు బట్టలు ధరించి విభూతి రాసుకొనే, ఊర్ధ్వ పుండ్రములు పెట్టుకునే నిత్య పూజా విధాన ధౌరంధర్యులే కాక ఆగమ శాస్త్ర ప్రవీణులు కూడ అయి శుచి శుభ్రతలు పాటిస్తూ వేదములను వల్లె వేస్తూ దర్శించగానే చేయెత్తి నమస్కరించాలనే పూజ్య భావం కలిగించేటట్లుగా వుంటారు. గోదావరి నది ఒక

ఎత్తైన ప్రదేశం నుండి ఒక్కొక్క బొట్టుగా ప్రవహిస్తూ త్రయంబకంలోని ఒక కుండ్‌లోకి ఒక కాలువ రూపంగా ప్రవహిస్తుంది. ఈ కుండ్ నుండి వెలువడి నదిగా ప్రవహిస్తుంది. ఈ కుండంలో భక్తులు, యాత్రీకులు స్నానాలు చేసి గోదావరి నది స్నాన ఫలితం పొందుతారు. త్రయంబకేశ్వరాలయంతో పాటు అనేక చిన్న చిన్న దేవాలయాలున్నాయి. మేము త్రయంబకేశ్వరాలయంలో పూజలు, అభిషేకం చేసుకుని వెంటనే బస్‌లలో బయలు దేరాం. మేము గోదావరి నది వున్నటు వంటి పంచవటి ఆలయానికి వెళ్లాం. శ్రీ సీతా రామలక్ష్మణుల విగ్రహాలు పాలరాతిలో నిర్మింప బడి చూపరుల కాకర్షణీయంగా వున్నాయి. చల్లని నీడనిచ్చే పెద్ద పెద్ద వృక్షాల మధ్య వుంది యీ ఆలయం. ఆలయ ప్రాంగణమంతా ప్రశాంతతకు ప్రతీకగా వుంది. ఇక్కడ అతిథి గృహం అధునాతన సౌకర్యాలతో నివాస యోగ్యంగా వుంది. చుట్టు ప్రక్కల అనేక దేవాలయాలు అతి పురాతన మైనవి దర్శన యోగ్య మైనవి వున్నాయి. కాని మాకు వ్యవధి లేనందున వెళ్ల లేక పోయాం. మేము తిరిగి సాయంత్రం నాలుగు గంllకు నాసిక్ స్టేషన్ చేరుకున్నాం. వెంటనే మా రైలు బొంబాయికి బయలు దేరింది. మేము బొంబాయి V.T. చేరేవరకు రాత్రి 8గంll అయింది. ఆ రాత్రి విశ్రమించాం.

బొంబాయి V.T 10-6-78

ఈ రోజు బొంబాయి నగరాన్ని దర్శించటంలోనే గడిచి పోయింది. వీధులన్ని తిరిగి చూసాం.

బొంబాయి 11-6-78 - 12-6-78

ఈ రోజు బొంబాయిలో కొన్ని ముఖ్యమైన ప్రదేశాలు తిరిగి చూసాం. అందరూ బస్‌లలో బయలు దేరాం. మొదటగా మేము దర్శించిన ప్రదేశం పాలశీతల కేంద్రం. ఈ ప్రదేశం బొంబాయి పట్టణానికి 25-30 కి.మీ. దూరంలో వుంది. ఇది గుట్టలపై నిర్మింప బడి వుంది. ఈ పాల శీతల కేంద్రం ఎంతో విచిత్రంగా చూడ సొంపుగా వుంది. పాలసీసాలు వాటంతటవి వరుసగా నడిచి రావటం, నల్లాల

క్రింద పాలకు ఎదురుగా ఆగటం, నల్లాల ద్వారా పాలు వాటిలో నిండటం, వాటికి మూతలు బిగించటం, వాటంతటవే వరుసగా బయటికి వెళ్లటం, పెట్టెలలో నిలవకావటం ఎంతో ఆశ్చర్యం, ఆనందం కలిగించాయి. ఈ భవనమంతా ఏర్ కండిషన్‌తో కూర్చ బడివుంది. ఇక్కడ యితర యంత్రాల ద్వారా ఐస్ క్రీం, కోవా తయారు చేయ బడతాయి. ఐస్ క్రీం యాత్రికులకు విక్రయించ బడుతుంది. అక్కడ నుండి మేము తిరిగి సత్య సాయి బాబా చేత గుట్ట మీద నిర్మింప బడిన సుందరం చూసాం. ఇది నిజంగా ఎంతో సుందరంగా వుంది. పట్టణం మధ్యలో ఒక గుట్టపై శివలింగాకారంలో ఈ దేవాలయం నిర్మించ బడివుంది. తర్వాత మేము కమలా పార్కు దర్శించాం. మహాలక్ష్మి దేవాలయం, మెరైన్ బీచ్, పార్కు దర్శించాం. సముద్రం లోపల వున్న ఒక గణపతి దేవాలయాన్ని దర్శించిన తర్వాత ఇండియా గేట్ వద్దకు వెళ్లాం. సమీపంలో పాత తాజ్ మహల్ హోటల్, క్రొత్త తాజ్ మహల్ దర్శించాం. కొత్త తాజ్‌మహల్ 25 అంతస్తులు కట్టబడింది. ఈ భవనం నుండి సముద్రం చాల వరకు చూడ వచ్చు. సముద్రంలోని పడవల రాకపోకలు చూసి ఆనందించ వచ్చు. బొంబాయి లోని వేలాది మంది ప్రజలు సాయంత్రం 5గంll నుండి రాత్రి 10 గంll వరకు తాజ్ మహల్ ప్రాంతాలు, ఇండియా గేట్ వద్ద సముద్ర తరంగాలు చూసి, ఆనందిస్తూ ఆ పిల్లవాయువులను ఆస్వాదిస్తూ కాలం గడుపుతారు. రాత్రి 10గంllవరకు బొంబాయిలో కొన్ని బజార్లు చూస్తూ యాత్రికులకు కావలసిన బట్టలు, వస్తువులు, చీరెలు వగైరా కొనుక్కుని ఎవరంతట వారు పొద్దుపోయే వరకు స్టేషన్ చేరుకున్నాం. మాలో చాల మందికి ఇంకా రెండు రోజులుండి ఏరోడ్రోం, జూ వగైరా చూడాలని వుంది కాని వ్యవధి లేనందున మా రైలు అదే సాయంత్రం 6గంll వాడి స్టేషన్ వైపు బయలు దేరింది.

12-6-78

ఈ రోజంతా ప్రయాణం చేస్తూ తెల్లవారే సరికి వాడి చేరుకున్నాం.

13-6-78

ఈ రోజు పగలంతా ప్రయాణం చేస్తూ సాయంత్రం 3 గంllకు కుర్దువాడి చేరుకున్నాం. ఇక్కడ వున్న హనుమాన్ దేవాలయం, పాండురంగ దేవాలయాన్ని దర్శించు కున్నాం. రైలు ప్లాటు ఫారం మీదనే మకాం వేసి రాత్రి నిద్రించాం. తెల్లవారు ఝూమున 3గంllకు పండరి పురానికి బయలు దేరాం.

14-6-78

మా రైలు తెల్లవారు ఝూమున న్యారో (Narrow) గేజ్ మీద పండరి పురం ప్రయాణం అయినాం. ఇప్పటి వరకు మేము బ్రాడ్ గేజ్ మీద ప్రయాణం చేస్తూ వచ్చాం. ఒకే ఒక రైలు మార్గం కుర్దువాడి నుంచి పండరి పురానికి న్యారో గేజ్ వుంది. న్యారోగేజ్ మీద రైలు గంllకు 10, 15కి.మీ. కంటె ఎక్కువ వెళ్లదు. ప్రతి 4, 5కి.మీ. కొక స్టేషన్ వుంది. కుర్దువాడి నుండి పండరి పురానికి 40-50 కి.మీ వుండ వచ్చు. మేము పండరి పురానికి ఉదయం 7 గంll వరకు చేరుకున్నాం. వెంటనే రిక్షాలు, టాంగాలలో చంద్రభాగానదికి వెళ్లాం.

పండరిపురం 14-6-78

రైలు స్టేషన్ నుంచి పండరిపురం 4, 5కి.మీ. వుండ వచ్చు. స్టేషన్ వద్ద యాత్రికుల సౌకర్యార్థం రేకుల షెడ్డులు, సత్రాలుగా ఏర్పాటు చేయబడి వున్నాయి. ప్రతి సంవత్సరం తొలి ఏకాదశికి అంటే ఆషాఢ శుద్ధ ఏకాదశికి ఇక్కడ బ్రహ్మాండమైన పూజలు, ఉత్సవాలు, ఊరేగింపులు జరుగుతాయి. హైద్రాబాదు, బొంబాయి లాంటి ముఖ్య పట్టణాల నుండి ఇంకా అనేక ప్రదేశాల నుండి వేల కొద్ది పాండురంగ భక్తులు యిక్కడికి వచ్చి పాండురంగడిని దర్శిస్తారు. ఆంధ్రదేశంలో పాండురంగ భజనకు మంచి ప్రాశస్త్యం వుంది. భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి పాండురంగ భజన సమాజముగా ఏర్పడి పండరి నాథుడైన పాండురంగనిపై కీర్తనలు పాడుతూ భజనలు చేస్తూ వుంటారు. ఈ భజనలు పాడుతూ, ఆడుతూ నృత్యం చేస్తూ వుంటే ఎంతో భక్తి పరవశంగా వుంటుంది. పండరి పురం పవిత్ర

చంద్రభాగానది ఒడ్డున వుంది. ఈ నది మధ్యలో రెండు మూడు దేవాలయాలు వున్నాయి. మేమంతా ఉదయం 8గం॥ సమయంలో స్నానాలు చేసి పడవలలో ఎక్కి సుమారు 3-4కి.మీ ప్రయాణం చేసాం. అక్కడ కూడ నదిలో చిన్నపాటి దేవాలయం వుంది. మా పడవలు అక్కడే ఆగి పోయినాయి.

అక్కడ నుండి 1కి.మీ. దూరంలో వున్న యితర దేవాలయాలకు ఛేలలో నుంచి కాలి నడకన వెళ్తాం. ఇక్కడ ఒక పెద్ద కాంపౌండులో దేవాలయం సముదాయం వుంది. సక్కు బాయి సంసారంలో అత్తగారి ఆరళ్లకు బాధపడుతూ శ్రీ కృష్ణుని ధ్యానిస్తూ అత్తగారికి, భర్తకు సేవలు చేస్తూ అత్తగారు పెట్టే బాధలు భరిస్తూ చివరకు ఆ పాండురంగని అనుగ్రహానికి పాత్రురాలై అతని సాన్నిధ్యంలో తనువు చాలిస్తుంది. ఈ దేవాలయ సముదాయంలో సక్కుబాయి పిండి విసిరిన విసుర్రాయిని చూడవచ్చు. సక్కుబాయిని పిండి విసరమని ఆజ్ఞాపించి మానవ మాత్రులు చేయ లేనంత పనిని యిచ్చి అత్తగారు నిద్ర పోతుంది. శ్రీ కృష్ణుడు స్వయంగా ఆ పని చేస్తూ సక్కుబాయిని భక్తులతో పాండు రంగని దర్శనార్థం పండరిపురానికి పంపించాడట. ఆంధ్రదేశంలోను, మహారాష్ట్ర లోను పండరినాధుని మహాత్మ్యం గురించి ఎన్నో కథలు, పురాణాలు వాడుకలో వున్నాయి. భక్తవిజయంలో పాండు రంగని మహాత్మ్యం గురించి అనేక కథలు చదవ వచ్చు. దీనిని ఎన్ని సార్లు చదివినా తనివి తీరదు. కొందరు భక్తులకు ఇది భారత భాగవతాలతో సమానమైనదని విశ్వాసము. తిరిగి మేము చంద్ర భాగానది దగ్గరకు వచ్చి అక్కడ మంటపం చూసి స్నానాలు చేసి అక్కడ వున్న విష్ణుపాదాలు కళ్ల కద్దుకుని పడవల మీద పండరి పురం చేరుకున్నాం.

పండరిపురం చంద్రభాగానది ఒడ్డునే వుంది. మహా భక్తుడైన పుండరీకునిచే నిర్మించ బడ్డ క్షేత్రం ఇది. పవిత్ర చంద్ర భాగా నదీ తీరంలో రఖమా దేవి (రుక్మిణీ దేవి)తో కలసి కటి హస్తులై శ్రీ కృష్ణుడు పాండురంగని పేరుతో వెలసిన క్షేత్రం యిది. భక్త పుండరీకుని కోరికపై స్వామి యిక్కడ పాండురంగ నామంతో వెలసి ఈ పురమును పండరీ పురంగా చేసాడు. ఈ పండరీ పుర ఆలయ గోపురాలు మయునిచే నిర్మించ బడ్డాయని క్షేత్ర మహాత్మ్యం చెప్తోంది. దీనిని పాండురంగ విఠల్ ఆలయమని కూడ అంటారు. ఆలయ గోపురాలు చక్కగా మలచ బడి ఎంతో

మనోజ్ఞంగా వున్నాయి. పాండురంగ స్వామి యిక్కడ కటిహస్తుడై ఒక యిటుక రాతిపై నిలిచి వుంటాడు. ఆ యిటుక వృత్రాసుర సంహార కారణంగా శాపగ్రస్తుడైన యింద్రుడని చెప్తారు. దానిని విఠల్ అని కూడ అంటారు. స్వామి పుండరీకునికి దర్శనం యివ్వదలచి రాగా మాతాపితృల సేవయందు వున్న పుండరీకుడు తన అందు బాటులోవున్న ఒక యిటుక రాయిని విసిరి స్వామిని దానిపై వుండవలసిందని కోరాడని ఆతని కోరికపై స్వామి అల్లె నిలచి వున్నాడని స్వామిని విడిచివుండలేని రుక్మిణీదేవి రుఖమాదేవి పేరుతో స్వామివారి వామ పార్శ్యమున మరో యిటుక రాయిపై నిలచిందని స్థల పురాణం చెప్తోంది. మేము వెళ్లేసరికి భజనలు పూజలు జరుగుతున్నాయి. శివాజీని ప్రభావితం చేసిన సమర్థ రామదాసు, తుకారం మొదలైన భక్తుల చేత మీరాబాయి లాంటి భక్తురాండ్ర చేత సేవింప బడిన క్షేత్రం పండరీ పురం. పాండు రంగ విఠలుని పావన నామం జపించని తెలుగు వాళ్లుండరు. పాండురంగ భజన సమాజం లేని, పండరి భజనలు చేయని తెలుగు గ్రామం అరుదు.

ఇక్కడ ఒక చిన్న విశేషము స్వానుభవముచే నేను పొందిన అనుభూతి తెలుపుతున్నాను.

నా పెంపుడు తల్లి శ్రీమతి లలితమాంబ నాచిన్న తనంలో పాండురంగ భక్త సమాజంలో కలిసి పండరిపురం దర్శించింది. ఆమె ఈ క్షేత్రం దర్శించి ముగ్ధురాలై ఆ పాండురంగడిని జీవిత పర్యంతం మనసారా స్మరిస్తూ వుండేది. ఏ పని చేసినా రంగడే చేయించాడు అంటూ తిన్నా రంగడే, నిద్రించినా రంగడే అంటూ వుండేది. మా యింట్లో పాండురంగ భజన మందిరం చేయించుకుని తోటి భక్తులతో భజన చేస్తూ వుండేది. భక్త విజయం లోని కధలు కంఠతా చేసేది. తన భక్తికి ప్రతీకగా నాకుమార్తె పేరు రుక్మాబాయి అని, కుమారుని పేరు పాండురంగడని నామకరణం చేయించింది. ఆమె జీవితంలో ఎన్నో క్షేత్రాలు సేవించుకున్నది. కాని పండరిపురమన్నా, పాండురంగడన్నా ఆమెకు యిలవేలుపు, ఆరాధ్య దైవం.

ఆమెకు నాపై వున్నప్రేమ మమకారం వల్లకాబోలు నేను, నా సతీమణి పండరీ పురవీధుల్లో తిరుగుతూవుంటే. ఆమె తోడై నీడై మావెంటవస్తున్నట్లు, మాతో కలిసి వున్నట్లు అనుభూతి పొందాము. మా అమ్మ స్ఫురణకు వచ్చి కళ్లు చెమ్మగిల్లాయి. కళ్లుతుడుచుకుంటూ నేను నా సతీమణితో చెప్పాను. నాకు ఆమె స్ఫురణకు వస్తున్నది. ఆమెకు అన్నదానం అంటె చాలయిష్టం. ఆమె ఆత్మ శాంతి కోసం యథాశక్తి అన్నదానం చేద్దాం. నాకూ మనశ్శాంతి వుంటుంది అన్నాను. వెంటనే మేము ఒక హోటలుకు వెళ్లాం. ఒక కె.జి. పూరీలు కొన్నా. దానికి సరిపోను పంచదార కొన్నా. కొన్ని పళ్లు కొన్నాం. అక్కడున్న సాధువులకు, భిక్షగాండ్రకు దానం చేసుకున్నాం. దానితో మేము తృప్తి చెందాం. ఇది మరువరాని ఒక మధురస్మృతి. స్వర్గస్తురాలైన మా అమ్మ, ఎన్నడూ కలలోనైనా కనపడని మా అమ్మ ఆరోజు నావెన్నాని తిరిగింది. బహుశ ఆమె ఆత్మ శాశ్వతంగా శ్రీ పాండురంగని పాద పద్మముల యందు నిలచిపోయిందేమో నన్న విశ్వాసం కలుగుతూవుంది.

తరువాత సుమారు 10గంll ప్రాంతంలో అక్కడకుసమీపంలో వున్నకైకోపి మహారాజు శ్రీ మెహతా నిర్మించిన ఒక మందిరం చూసాం. దీనిని మందిర మనాలో, మానస మందిరం అనాలో,దేవాలయమనాలో, దేముడిగుళ్ల సముదాయమనాలో, చిత్ర విచిత్రాలైన చిత్ర శాల అనాలో, యావద్భారతావని కూట మనాలో తెలియనటువంటి కనీ వినీ ఎరుగ నటువంటి గొప్ప వేదాంత, దేవతా, వైజ్ఞానిక కళాశాల, శృంగార ఆధ్యాత్మిక రాజకీయ నాయకుల సంగమప్రదేశం. దీనిని విమర్శనాపూర్వకంగా చూసి తెలుసుకోవాలంటే ఒకవారం రోజులైనా పట్టవచ్చు కాని మాకు అంత వ్యవధిలేదు. ఓపిక లేదు. మాకున్న కొద్ది పాటి సమయంలో చూసి తిరిగిరావాలని ముఖద్వారం ద్వారా యిందులో ప్రవేశించాం. ఇది భారత యుద్ధంలో అభిమన్యుడు ప్రవేశించిన పద్మవ్యూహం లావుంది. దీనికి లోపలికి వెళ్లటానికి దారి ఒకటే. తిరిగి బయటకు రావటానికి ప్రవేశించిన దారికే వస్తాము. ఈ పుణ్య క్షేత్రం చాల విశాలమైన ప్రదేశంలో కట్టబడింది. దీని నిర్మాణంలో కొన్ని కోట్లు ఖర్చు అయినాయంటే అతిశయోక్తి కాదు. దీన్ని నిర్మించి ధన్యుడైన మెహతా దీని సమీపంలో ఒక

సాధువు రూపంలో ఒక తాటాకు గుడిసెలో ఒక కుక్కిమంచంలో పరుండి వున్నాడు. వారిని దర్శించుకున్నాం. సుమారు 70-80సంllలు వున్న వృద్ధుడు. శారీరకంగా చాల బలహీనంగా వున్నాడు. జానెడు పొడుగు గడ్డంతో నిక్కరు బనీను ధరించి వున్నాడు జీవిం చివుండగా ఆ త్యాగధనుని దర్శన భాగ్యం కలగటం మా అదృష్టం. వారి దర్శనం పొంది ధన్యులమయ్యాం. మందిరం ఇటీవలి కాలంలో నిర్మించబడ్డది. ఇంకా నిర్మింపబడుతున్నది. ఇదొక అద్భుత నిర్మాణం. మందిరంలోని ద్వారాలన్నీ వివిధ జంతువుల తలలలో మలచబడినాయి. మకరద్వారము, గజద్వారము, సింహద్వారము, శార్దూలద్వారము, గోద్వారము మొదలైనవి ప్రవేశించే వారికి ఆయా జంతువుల నోళ్లలోనికి పోతున్నట్లుగా కనిపిస్తుంది. కొన్ని గదులు రైలు డబ్బాల వలె నిర్మించబడ్డాయి. ఈ మందిరంలో సర్వదేవతలు, సర్వ ఋషులు, సర్వ భక్తులు, ఆది శంకర పాదుల వారు ఏర్పాటు చేసిన పీఠాధిపతుల విగ్రహాలు, మహాభారత, రామాయణ భాగవతాది గ్రంధాలలో పాత్రలు, భారతావనిలోని అధిష్టాన దేవతలు, చారిత్రక రాజకీయ నాయకుల విగ్రహాలు చక్కని వరుసలో నిలువబడి వున్నాయి. ఈ విశాలమైన మందిరాంతర భాగమునకు ఒకే ద్వారమున పోయి అదే ద్వారమున రావలసివుంది. మేము పగలు 2గంllవరకు దర్శించుకొని టాంగాపై స్టేషన్ చేరుకున్నాం. భోజన కార్యక్రమం ముగించుకుని తిరుగుప్రయాణానికి రైలు కోసం ఎదురు చూస్తూ స్టేషన్‌లో కూర్చున్నాం. పండరిపురం నుంచి సాయంత్రం 4గంll బయలుదేరి రాత్రి 8గంllవరకు ఖుర్దువాడి చేరుకున్నాం. రాత్రి భోజనం అక్కడ చేశాం. మా రైలు 2గంllలకు సికింద్రాబాద్ ముఖంగా బయలుదేరింది.

15-6-78

ఈ రోజంతా మేము ప్రయాణంలోనే గడిపాం. మా భోజనాదులు రైలులోనే ముగించుకున్నాం. మా రైలు హైద్రాబాద్ నాంపల్లి స్టేషనుకు చేరుకునే సరికి రాత్రి 9గంll అయింది. సుమారు రెండునెలల మా ఉత్తర దేశ యాత్రలో ఇది ఆఖరు మజిలీ. చివరి రాత్రి మేము స్టేషన్‌లో దిగేవరకు మా కుమారులు, కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాండ్రు, బావమరదులు, వాళ్ల సతీమణులు,

పిల్లలు యింకా బంధువులు యింకా స్నేహితులు హాజరుగావున్నారు. వారందరు ముందుగా నాకు నమస్కరించి క్షేమలాభాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మా యాత్ర ఫలితంలో కొంత అందుతుంది. వారంతా పోటీలు పడి నమస్కారాలు చేసి కుశల ప్రశ్నలు వేసి మా యాత్రా విశేషాలు తెలుసుకున్నారు. మేము మాపిల్లలవసతి గృహాలకు వెళ్లాం. మా రైలు సికింద్రాబాద్ స్టేషన్ వరకు ఆ రోజు ప్రయాణం ముగించింది. తోటి ప్రయాణీకులు కొందరు రైలులోనే భోజనాలు ముగించుకుని రైలులోనే నిద్రించారు.

హైద్రాబాదు 16-7-78

హైద్రాబాదు ఆంధ్రప్రదేశ్ రాజధాని. దీనికి భాగ్యనగర మనే పేరు కూడ వుంది. మా యాత్రీకులలో హైద్రాబాదు ఎరుగని వారు చాల తక్కువమంది వున్నారు. మేము ఇదే ఆంధ్రప్రదేశ్ ఒక జిల్లా ముఖ్య నగరమైన ఖమ్మం పట్టణం నుండి బయలుదేరి ఆంధ్రప్రదేశ్ తూర్పు దిశగా వెళ్లి ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, విదేశమైన నేపాల్, ఉత్తరప్రదేశ్, హరియానా, హిమాచల్ ప్రదేశ్, కాశ్మీర్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల గుండా పర్యటించి స్వంత రాష్ట్ర మైన ఆంధ్రప్రదేశ్ చేరుకున్నాం. మేము హైద్రాబాదులో యితర చోట్లలో వలే యాత్రికులందరు ఉమ్మడిగా బయలుదేరలేదు. ఎవరంతట వారు బయలు దేరాం. ఎవరికి యిష్ట మొచ్చింది వారు తమంతట తాము తిరిగి చూసి స్టేషన్ చేరుకున్నాం. మేము మటుకు ఆ రాత్రి, తెల్లవారి పగలంతా మాపిల్లల వద్ద వున్నాం.

హైద్రాబాదు 17-6-78

ఈ రోజు పగలు చిక్కడపల్లిలో వున్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భోగాని కిచ్చి పూజలు చేయించాం. ఇక్కడున్న బంధువులందర్ని కలిసి కబుర్లు యాత్రానుభవాలు చెప్పుకుంటూ కాలం గడిపాం. మా యాత్రికులందరికి హైద్రాబాద్‌లో వున్న ముఖ్య ప్రదేశాల గురించి వారికి చెప్పి వ్రాత పూర్వకంగా

వ్రాసి యిచ్చాం. ఎవరికి వారు హైద్రాబాదులో యీక్రింద వ్రాయబడిన ముఖ్య ప్రదేశాలు చూసి వచ్చారు. మేము లోగా చూడని ప్రదేశాల్కు వెళ్ళి చూచాం.

చార్ మినార్, మక్కామజీద్, గోల్కొండ కోట, ఫలక్ నామా, గండిపేట, నెహ్రూ జులాజికల్ పార్కు, సాలార్ జంగ్ మ్యూజియం, నౌబత్ పహాడ్ మీద నిర్మింపబడ్డ బిర్లామందిరం అనే వేంకటేశ్వరస్వామి దేవాలయం, హుస్సేన్ సాగర్ చెరువు, టాంక్‌బండ్, అసెంబ్లీ భవనం, పబ్లిక్ గార్డెన్స్, పాత, కొత్త M.L.A. క్వార్టర్స్, రాజభవన్, అన్నపూర్ణ స్టూడియోస్, ఇందిరాపార్కు, రామకృష్ణ మఠము, శంకరమఠము, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్‌కాలేజీ, మూసీనది తీరం, హైకోర్టు, ఉస్మానియా హాస్పటల్ ఇంకెన్నో దర్శనీయ స్థలాలను దర్శించి సాయంత్రం 5గంll వరకే మేము వెళ్లేరైలు దగ్గరకు సికింద్రాబాద్ చేరుకున్నారు. మేము మాపిల్లల యిండ్లలోనే భోజన కార్యక్రమాలు ముగించుకొని స్టేషన్‌కు వచ్చాం. మా రైలు కొంచం లేటుగా 8గంllకు సికింద్రాబాద్ స్టేషన్‌లో బయలుదేరింది. మాతోటి యాత్రికులందరు ఎవరెవరి స్టేషన్లలో వారు దిగిపోతూ వచ్చారు. వారు దిగి పోయేటప్పుడు మిగిలి వున్నవారు ఎంతో ఆప్యాయంగా కౌగిలించుకుని సంతోషంగా వీడ్కోలు చెప్పుకుంటూ వచ్చారు. మేము ఖమ్మం రైలుస్టేషన్ లో దిగాం. మా రైలు ఖమ్మం వచ్చేవరకు తెల్లవారు జామున 4గంllఅయింది. మా పిల్లలంతా ఆ రాత్రి మా రాక కోసం ఎదురుచూస్తూ రైలు స్టేషన్‌లోనే కాలం గడిపారు. మేళ తాళాలతో బాజా భజంత్రీలతో మాస్వగృహంలో ప్రవేశించాం, తెల్ల వారు జామున 5గంllలకు.

సమాప్తి.



రచయిత

సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ అయితరాజు రాంరావు ఖమ్మంజిల్లా వల్లభి గ్రామంలో ఆగస్టు 1919 లో జన్మించారు.

స్వామి రామానంద తీర్థ పిలుపు నందుకొని స్టేట్ కాంగ్రెస్ కార్యకర్తగా హైదరాబాదు సంస్థాన విముక్తి పోరాటంలో పాల్గొన్నారు. వల్లభి గ్రామంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి సత్యాగ్రహం సలిపి అరెస్టయారు. వరంగల్ సెంట్రల్ జైల్లో శ్రీ జమలాపురం కేశవరావు, కొలిపాక కిషన్ రావు, కాళోజీ నారాయణ రావు మొదలైన నాయకులతో పాటు పదకొండు నెలల పాటు నిర్బంధంలో వుండి, పోలీస్ యాక్షన్ తరువాత విడుదలయారు.

వల్లభి సర్పంచిగా, పాలేరు పంచాయతీ సమితి సభ్యులుగా, చక్కెర కర్మాగారం డైరెక్టరుగా వివిధ పదవులకు ఎన్నుకోబడి రాష్ట్రాభివృద్ధికి, ప్రత్యేకించి ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేసారు.

స్థానిక కక్షలకు గాంధేయ పరిష్కారం అన్వేషించి, ఆచార్య భన్సాలి గారిని తమ గ్రామానికి ఆహ్వానించి శాంతి సామరస్యాలను నెలకొల్పేందుకు పాటు పడ్డారు.

వల్లభిలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునరుద్ధరణ భారం వహించి, గ్రామస్థులందరి సహాయ సహకారాలతో దిగ్విజయంగా పూర్తి చేసారు. ఆ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను వెలువరించారు.

స్వాతంత్ర్య సమరయోధుడుగా భారత ప్రభుత్వం నుండి తామ్రపత్రం అందుకొన్న వారిలో మొదటి శ్రేణి నలంకరించిన ప్రముఖులు శ్రీ రాంరావు.